


సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


దేశంలో అల్లర్లు జరిగే అవకాశం

కశ్మీర్‌లో రెండో రోజూ నిరసనలు **05**


ఒమన్ ఆయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి


సంపుటి 09, సంచిక: 93 | మంగళవారం | 03-03-2026 | ఖమ్మం
Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**
పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# యుద్ధం ఉద్ధృతం


## ఖతార్, సౌదీ ఇంధన వనరులపై ఇరాన్ క్షిపణులు

## టెహ్రాన్‌పై కొనసాగుతున్న ఇజ్రాయెల్, అమెరికా దాడులు



**టెహ్రాన్:** పశ్చిమ ఆసియాలో అమెరికా మిత్రదేశాలు, ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం సోమవారం మరింత తీవ్రరూపం దాల్చింది. దాడుల ఉద్ధృతిని, పరిధిని విస్తరించింది. ఖతార్, సౌదీ ఆరేబియా ఇంధన వనరులపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు అపారనష్టం కలిగించాయి. ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లో భవనాలు దాడుల్లో ధ్వంసమయ్యాయి. జనం అధికంగా ఉండే ప్రాంతాలపై ఇరాన్ క్లస్టర్ బాంబులను ప్రయోగిస్తోందని ఐ.డి.ఎఫ్ ఆరోపించింది. దాడులు ఆపకపోతే ప్రతీకార చర్యలు తీసుకుంటామని ఇరాన్ బాధిత అరబ్ దేశాలు హెచ్చరిక చేశాయి. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ కార్యాలయంపై ఖైబార్ షెఖాన్ క్షిపణులతో దాడి చేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దిగ్భ్రాంతికర ప్రకటన చేసింది. ఎయిర్ ఫోర్స్ కమాండర్ కేంద్ర కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు తెలిపింది. ఐతే దీనిపై ఇజ్రాయెల్ ఇంకా స్పందించలేదు. అమెరికా సైన్యం ప్రస్తుతం యుద్ధరంగంలో లేదని, అవసరమైనప్పుడు రంగంలోకి దిగే అవకాశాలున్నాయని అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్ ప్రకటించారు. ఐతే ఇంతవరకూ తాము దాడి చేయలేదని, త్వరలోనే ఇరాన్‌పై భారీస్థాయిలో అమెరికా దాడి చేస్తుందని ట్రంప్ సోమవారం పొద్దుపోయాక ప్రకటించారు. తక్షణం తమపై దాడులు నిలిపివేయకపోతే ప్రతీకార చర్యలు తీసుకుంటామని బహ్రెయిన్, కువైత్,ఖతార్, సౌదీఅరేబియా,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాలు హెచ్చరించాయి. ఇరాన్

తరువాయి 2లో



- నెతన్యాహూ కార్యాలయంపై దాడి చేసినట్లు టెహ్రాన్ ప్రకటన
- కువైట్‌లో అమెరికా ఎంబసి ధ్వంసం
- డ్రోన్ల వరద:భారీగా నష్టపోయిన ఇజ్రాయెల్
- టెహ్రాన్ సహా 130 ఇరాన్ నగరాలపై దాడులు
- ఆసుపత్రులు, పోలీస్ స్టేషన్లపై క్షిపణులు
- ప్రతీకార దాడులు చేస్తామని బాధిత అరబ్ దేశాల హెచ్చరిక
- భారీ దాడికి సన్నాహాలు చేస్తున్న అమెరికా:ట్రంప్
- అమెరికా స్థావరాలపైనే గురి:స్పష్టం చేసిన ఇరాన్
- పొరపాటున అమెరికా ఎఫ్-15 జెట్స్‌ను కూల్చేసిన కువైట్
- గాయాలతో మరణించిన ఖమేనీ భార్య

## రాష్ట్ర పౌరుల కోసం

## తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్




ప్రజాపక్షం/హైదరాబాద్

మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ పౌరుల కోసం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మధ్యప్రాచ్య ప్రాంతంలోని కొన్ని దేశా ల్లో ఏర్పడుతున్న పరిస్థితులను తెలంగాణ ప్ర భుత్వం సమగ్రంగా పర్యవేక్షిస్తోంది. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో ఇప్పటికే నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితుల ను అంచనా వేస్తున్నారు. వివిధ దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న విచారణలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రభుత్వం న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు

తరువాయి 12లో

## అమెరికాతో చర్చల ప్రసక్తే లేదు

ట్రంప్ అబద్ధ ప్రచారంపై ఇరాన్ మండిపాటు



**టెహ్రాన్:** అమెరికాతో చర్చలకు అవకాశమే లేదని ఇరాన్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఆదేశంతో ఇక చర్చలకు తావు లేదని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీ సోమవారం ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. అమెరికాతో చర్చలకు లారిజానీ ఎంతో ఆసక్తి చూపిస్తున్నారని, ఆయన చొరవ చూపించారని ఆదివారం వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక ప్రచురించిన వార్తపై లారిజానీ తీవ్రంగా స్పందించారు. ఇరాన్ ప్రభుత్వంలో అలీ ఖమేనీ పాలనలో ఆయన అత్యంత శక్తిమంతమైన నాయకులలో ఒకరుగా ఎదిగారు. ఐనప్పటికీ కూడా ఆయన ఖమేనీ మరణం తర్వాత రాజ్యాంగ సంరక్షణ మండలి సభ్యుడు అలిరెజా అరాఫి (67) తాత్కాలిక సుప్రీం నేతగా ఏర్పడిన త్రిసభ్య మండలిలో స్థానం లభించలేదు. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్, న్యాయ వ్యవస్థ ప్రధానాధిపతి ఘోలం హుస్సేన్ మొహ్‌సెని ఎజిలు ఈ మండలిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో లారిజానీ పేరుతో వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వార్త వెలువడింది. ఇరాన్ కొత్త నాయకత్వం తనతో చర్చలు కోరుకుంటోందని, వారు చర్చలకు

తరువాయి 2లో

## ఇరాన్ క్షిపణి పరిశ్రమను ధ్వంసం చేస్తాం

- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్
- నాలుగు వారాలు యుద్ధం : అమెరికాకు సైనిక నష్టం తప్పదు
- వెయ్యికిపైగా ఇరాన్ లక్ష్యాలపై దాడులు
- ఐఆర్‌జిసి లొంగిపోతే క్షమాభిక్ష



**వాషింగ్టన్:** ఇరాన్ క్షిపణి తయారీ పరిశ్రమను నాశనం చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. తమ దళాలు అందుకు సిద్ధపడుతున్నాయన్నారు. యుద్ధం మరో నాలుగు వారాలు కొనసాగే అవకా శం ఉందని అన్నారు. ఇప్పటివరకూ ఇరాన్‌లో 1000 కి పైగా లక్ష్యాలపై దాడులు చేశామని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ ప్రకటించగా ట్రంప్ కూడా అదే విష యం చెప్పారు. మొదటిరోజు యుద్ధంలో అలీ ఖమేనీతోపాటు మరో 48 మంది ముఖ్యనాయకులు, సైనిక కమాండర్లు, మంత్రి వర్గ సభ్యులను హతమార్చామని చెప్పారు. ఇంకా ఎన్ని లక్ష్యాలపై దాడులు

తరువాయి 2లో

## ఇజ్రాయెల్, బహ్రాయిన్, సౌదీ రాజులకు ప్రధాని మోదీ ఫోన్‌కాల్స్



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో సైనిక ఘర్షణ వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, బహ్రాయిన్ రాజు హమాద్ బిన్ ఈసా అల్ ఖలీఫా, సౌదీ అరేబియా యువ రాజు మహ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్‌లతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం మాట్లాడారు. బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని నరేంద్రమోదీ "పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరాం. అలాగే ఘర్షణలను సా ధ్యమైనంత త్వరగా ముగించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించాం" అని తమ సంభాషణ గురించి మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. అదే విధంగా బహ్రాయిన్, సౌదీ అరేబియా దేశాలపై ఇరాన్ దాడులను మోదీ ఖండించారు. ఇక ఇదే సమయంలో బహ్రాయిన్, సౌదీ అరేబియా దేశాల్లో నివసిస్తున్న భారతీయుల బాగోగులపై ప్రధాని ఆరా తీశారు. బహ్రాయిన్ రాజు, సౌదీ యువరాజుకు మోదీ చేసిన ఫోన్ కాల్ సంభాషణల వివరాలను భారత ప్రభుత్వ అధికార వర్గాలు

తరువాయి 2లో

## జంతర్ మంతర్ వద్ద

## 9న రైతు, కార్మికుల పార్లమెంట్

- కేంద్ర కార్మిక సంఘాల వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం నిర్ణయం
- అదే వేదికగా భవిష్యత్ పోరాట ఉద్ధృతిపై ప్రకటన విడుదల చేస్తామని వెల్లడి


ఫైల్

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈ నెల 9న 'రైతులు,కార్మికుల పార్లమెంట్'ను నిర్వహించి, అదే వేదికగా భవిష్యత్ పోరాటాల ఉద్ధృతిపై ఒక ప్రకటన చేయబోతున్నామని కేంద్ర కార్మిక సంఘాల వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) సోమవారం సంయుక్తంగా ప్రకటించింది. ఢిల్లీలో విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో నాయకులు విషయాన్ని వెల్లడించారు. ఫిబ్రవరి 12న జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, భారీ జన సమీకరణలపై కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సమాఖ్యలు/ సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఉమ్మడి వేదిక సోమవారం ఒక సంయుక్త సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. భవిష్యత్ పోరాట కార్యాచరణ ఉద్ధృతిపై లోతుగా చర్చించింది. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఇటీవలి కాలంలోనే ఒక అతిపెద్ద పోరాటమన్నారు. దేశ వ్యాప్తంగా 600 జిల్లాలలో వందలు, వేల ప్రాంతాలలో 30 కోట్ల మందికి పైగా ప్రజలు ముఖ్యంగా కార్మికులు, రైతులు, సమాజంలోని అన్ని తరగతుల వారు పాల్గొని విజయవంతం చేసిన సమరశీల పోరాటం అన్నారు. ఈ అతిపెద్ద పోరాటంలో భాగస్వాములైన వీరందరికీ

తరువాయి 12లో

## ఆయిల్ ధరలు పైపైకి

భారత్ సహా ప్రపంచ చమురు రవాణాకు అంతరాయం!

- స్టాక్‌మార్కెట్లు పతనం
- రక్షణరంగ కాంట్రాక్టర్లకు భారీ లాభాలు
- విపరీతంగా పెరుగుతున్న చమురు ధరలు
- ఉత్పత్తి పెంచాలని ఒపెక్ ప్లస్ నిర్ణయం



**దోహా:** పశ్చిమాసియాలో యుద్ధం మొదలయ్యాక చమురు,స్టాక్ మార్కెట్ ధరలు ఉత్థాన పతనాలను చవిచూస్తున్నాయి. సోమవారం ఈ ధోరణి మరింతగా కొనసాగింది. రక్షణ రంగ కాంట్రాక్టర్లు భారీగా లాభపడుతున్నారు. ఆసియా మార్కెట్‌లో షేర్లు పతనంకాగా, చైనా షాంఘైలో మాత్రం భారీగా పెరిగాయి. ముడి చమురు, సంబంధిత ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. బంగారం ధర కూడా అనూహ్యంగా పెరిగింది. మరోవైపు స్టాక్‌మార్కెట్లు పతనమవుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర మరో పదిశాతం పెరగడంతో సోమవారం ఒక బ్యారెల్ ధర 82 డాలర్లకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద మూడు చమురు రవాణా నౌకలపై దాడులు జరగడంతో ఈ ధరలు మరింతగా పెరడగం మొదలైంది. సహజయువు ధరలు కూడా 25 శాతం పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా దేశాలకు ప్రతిరోజూ అవసరమైన ముడి చమురు, సహజవాయువులో 20 శాతం ఉత్పత్తులను రవాణా నౌకలు ఈ జలసంధి నుండే తీసుకువెళతాయి. బ్రిటన్‌కు

తరువాయి 2లో






## బిసి కోటా పెంపునకు పార్లమెంట్‌లో కాంగ్రెస్ ప్రైవేటు బిల్లు

- తెలంగాణలో బిసి రిజర్వేషన్లను పెంచడానికి పార్లమెంటులో ప్రైవేట్ బిల్లు పెడతాం
- ప్రధాని మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానమే సక్రమంగా లేదు
- లోక్‌సభలో ప్రతిపక్ష నేత,ఎఐసిసి అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డిసిసి అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో రాహుల్‌గాంధీ దిశానిర్దేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో బిసి రిజర్వేషన్లను పెంచడానికి కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో ప్రైవేట్ బిల్లును ప్రవేశపెడుతుందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు, ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. రాష్ట్రంలో బిసి జనాభా లెక్కల గణన ప్రక్రియ పూర్తయినందున, బిసి రిజర్వేషన్లు పెంచే విషయంలో పార్లమెంటులో ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టాలని టిపిసిసి నాయకులు రాహుల్ గాంధీని కోరారు. ఇందుకు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ప్రధాని దుర్మార్గాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని, ఈ లోపాలను ప్రజల దృష్టికి తీసుకురావాలని రాముల్ గాంధీ కాంగ్రెస్

తరువాయి 12లో

## వర్తక మాయాజాలం

## ఖజానాకు రాజకీయ కన్నం!

- యాదాద్రి క్షేత్రం సాక్షిగా అద్దె దోపిడీ.. రూ.25 కోట్ల ఆదాయానికి గండి!
- చెల్లించాల్సిన అద్దె (3 ఏళ్లకు) రూ.5.07 కోట్లు.. చెల్లిస్తోంది రూ.1.69 కోట్లే!
- దేవస్థానానికి రూ.3.38 కోట్లు ఎగనామం

ప్రజాపక్షం/యాదాద్రి

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆదాయానికి కొందరు 'వర్తక' శక్తులు గండి కొడుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి, రాజకీయ అండదండలతో కొందరు వ్యాపారులు కొండపైనే తిష్టవేసి దేవస్థాన ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. బహిరంగ టెండర్లు నిర్వహిస్తే ఏటా రూ.25 కోట్లు రావాల్సిన చోట, పైరవీలతో కేవలం నామమాత్రపు అద్దె చెల్లి స్తూ దేవస్థానాన్ని నిలువునా ముంచుతున్నారు. పారదర్శకమైన టెండర్లు లేకుండా, 'తాత్కాలికం' అనే ముసుగులో దశాబ్దాలుగా సాగుతున్న



ఈ వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్తక సం ఘానికి సంబంధించినవి 2014 వరకు దేవస్థాన రికార్డుల్లో కేవలం 10 దుకాణాలు మాత్రమే ఉన్నాయి. టెండర్ల ద్వారా దుకాణం

తరువాయి 2లో

## భారత్-కెనడా కుదిరిన యురేనియం డీల్

- త్వరలోనే ఇరుదేశాలు సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని ముగించాలని ప్రతిజ్ఞ
- పశ్చిమాసియాలో భారతీయ పౌరుల భద్రత కోసం అన్ని దేశాలతో కలిసిపనిచేస్తామని మోదీ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** యురేనియం, కీలకమైన ఖనిజాల సరఫరాపై భారత దేశం, కెనడా సోమవారం కీలక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. త్వరలోనే ఇరుదేశాలు సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని ముగించాలని ప్రతిజ్ఞ చేశాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ 2030 నాటికి యునైటెడ్ స్టేట్స్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ల యుఎస్‌డి డాలర్లకు తీసుకెళ్లడం సహా సంబంధాలను పెంచుకునేందుకు ఒక కొత్త చట్రాన్ని (ఫ్రేమ్‌వర్క్‌ను) ఖరారు చేశారు. రెండు దేశాల మధ్య సంబంధాలు ఇప్పుడు కొత్త శక్తి, పరస్పర విశ్వాసం, సానుకూలతతో నిండి ఉన్నాయని ప్రధానమంత్రి మోదీ వ్యాఖ్యానించారు. విస్తృత స్థాయి చర్చలలో

తరువాయి 12లో


ఫొటో : ఎస్ఎన్. సిన్హా న్యూఢిల్లీ

## ఇరాన్ దాడుల నుండి మిత్రదేశాలను రక్షించలేని అమెరికా క్షిపణి నిరోధక వ్యవస్థ

**మాస్కో:** అమెరికా క్షిపణి–నిరోధక వ్యవస్థ విఫలమైందని రష్యన్ నిపుణులు పేర్కొన్నారు. వేలకోట్ల రూపాయలు పెట్టుబడులతో వ్యవస్థలను ఏర్పాటు చేసినప్పటికీ ఇరాన్ చేసిన గగనతల క్షిపణి దాడుల నుండి పశ్చిమాసియాలో మిత్రదేశాలను అమెరికా కాపాడుకోలేకపోయిందని ఒక విశ్లేషణలో వారు చెప్పారు. యాంటీ–డ్రోన్, యాంటీ–మిస్సైల్ వ్యవస్థలలో ఆత్యాధునిక ఏర్పాట్లు ఉన్నప్పటికీ శక్తిమంతమైన ఇరాన్ కిల్లర్ డ్రోన్స్‌ను అడ్డుకోలేకపోయాయని రష్యన్ ప్రెసిడెన్సియల్ అకాడమీ ఆఫ్ నేషనల్ ఎకానమీ అండ్ పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ (ఆర్‌పిఎఎన్‌ఎపిఎ)కి చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా అండ్ నేషనల్ సెక్యూరిటీలో సైనిక నిపుణులు అలెగ్జాండర్ స్టెపనోవ్ టాస్ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు. యాంటీ–డ్రోన్ వ్యవస్థలు, అనేక రాడార్ స్టేషన్లు, పేట్రియాట్ బ్యాటరీలు, హై ఆల్టిట్యూడ్ ఏరియా క్షిపణి రక్షణ వ్యవస్థలతో సహా అత్యాధునిక పరికరాలు పశ్చిమాసియాలో అమెరికా ఏర్పాటు చేసినప్పటికీ మిత్రదేశాల గతన వ్యవస్థలను కాపాడలేకపోయిందన్నారు. యుద్ధ వ్యూహాలు, సాంకేతికతలలో మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ఏదైనా శత్రు వ్యవస్థను నాశనం చేయడం లేదా నష్టం కలిగించడం వంటి చర్యలు సాంకేతికంగా తీసుకున్నప్పుడు సిబ్బంది కూడా నష్టపోతారని అమెరికా గుర్తించిందని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా ఇటీవల హత్యకు గురైన అలీ ఖమేనీ తన చివరి ఇంటర్వ్యూలో గతనెలలో వ్యక్తం చేసిన అభిప్రాయాలు దాదాపు ఇలాంటివే. అమెరికా పతనం ప్రారంభమైందని, ఇక అమెరికా ఓడిపోతుందని, అమెరికా ఆర్థికంగా, సైనికంగా పతనమవుతోందని ఖమేనీ అనాన్రు. ఫిబ్రవరి 28వ తేదీన పశ్చిమ ఆసియాలో అమెరికా–ఇజ్రాయెల్ పెద్ద ఎత్తున యుద్ధం ప్రారంభించాయి.



తర్వాత ఇరాన్ తన సైనిక ప్రతాపం చూపించడం ప్రారంభించింది. ఇరాన్ పాటవం నుండి దాదాపు ఎనిమిది మిత్ర దేశాలను ట్రంప్ కాపాడుకోలేకపోయారు. అమెరికా మిలిటరీ సెంట్రల్ కమిటీ చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. పైగా ఇరాన్ సమీప జలాలలో అమెరికా భారీ ఎత్తున యుద్ధ నౌకలను, విమాన వాహక నౌకలను మోహరించినప్పటికీ అది ఎంతో పరిమితమే. పైగా ఎన్నో వేల కిలోమీటర్ల నుండి పశ్చిమాసియాకు సైనిక వ్యవస్థలను తీసుకువచ్చి మోహరించడం ఆర్థికంగా బలహీనంగా ఉన్న అమెరికాకు చాలా ఖరీదైన వ్యవహారంగానే మారింది. ఈ దశలో ఇరాన్ చాలా తక్కువ ఖర్చులో డ్రోన్లు, క్షిపణులను తయారుచేసి ప్రయోగిస్తోంది. తక్కువ ఎత్తులో ఉన్న ఈ డ్రోన్లను పసిగట్టడంలో అమెరికా అత్యాధునిక వ్యవస్థలు విఫలమవుతున్నట్లు సైనిక నిపుణులు అంచనావేస్తున్నారు. పైగా గడచిన కొద్ది నెలలుగా ఇరాన్ సైనిక వ్యవస్థకు చైనా అంతర్లీనంగా సహాయ సహకారాలు అందజేస్తోందని అనేక వార్తలు వెలువడ్డాయి. రష్యాకు ఇరాన్ సరఫరా చేసిన క్షిపణులు కూడా ఉక్రేన్‌ను భారీస్థాయిలో దెబ్బతీసి తీవ్ర నష్టం కలగజేయడంతో రష్యా కూడా ఈ సాంకేతికతను అందిపుచ్చుకుని వాటిని ఉత్పత్తి చేసేందుకు సిద్ధమైంది.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి 31 మంది మృతి

● ఇళ్ళు వదలి వెళ్ళిపోతున్న 50 గ్రామాల ప్రజలు ● హెజ్బొల్లా కీలక నాయకులు మృతి
● ఆయుధాల స్వాధీనానికి లెబనాన్ ప్రభుత్వం యోచన



జెరూసలెం: దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా ఉగ్రవాదసంస్థ స్థావరాలపై ఇజ్రాయెల్ సోమవారం దాడులు చేసింది. ఈ దాడుల్లో 31 మంది మరణించగా, మరో 150 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. లెబనాన్ పార్లమెంటులోని హెజ్బొల్లా విభాగాధిపతి మహ్మద్ రాడ్ ఈ దాడుల్లోమరణించారు. ఆయనతోపాటు అనేకమంది సీనియర్ నాయకులు మరణించారు. దాడుల ఫలితంగా రాజధాని బీరూట్‌లో పలుచోట్ల భారీపేలుళ్ళు సంభవించాయి. హెజ్బొల్లా బలమైన కేంద్రాలపై దాడులు చేశామని, హెజ్బొల్లా అగ్రనాయకత్వంలోని సీనియర్ సభ్యులను నిర్మూలించామని ఇజ్రాయెల్ ఐ.డి.ఎఫ్ ప్రకటించింది. ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో కూడా పరస్పర కాల్పులు జరిగాయి. అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ మరణించడంతో ఇరాన్‌కు మద్దతుగా హెజ్బొల్లా సంస్థ ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు చేసింది. ఈ దాడులకు ప్రతీకారంగా బీరూట్ శివారు ప్రాంతంలో ఐ.డి.ఎఫ్ దాడులు ప్రారంభించింది. లెబనాన్‌లో 50 గ్రామాలను ఖాళీ చేసి వెళ్ళిపోవాలని, తాము హెజ్బొల్లాపై దాడులు చేస్తున్నామని ఐ.డి.ఎఫ్ ముందుగానే ప్రకటించింది. భారీ పేలుళ్ళు సంభవించడంతో ప్రజలు భయంగా ఇళ్ళు వదలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోయారు. దీంతో యుద్ధం మరింత విస్తరించింది. ఒకవైపు ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్న తరుణంలో లెబనాన్‌లో దాడులు జరిగాయి. ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా చేసిన ఈ దాడులను లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్, ప్రధానమంత్రి నవాఫ్ సలామ్ తీవ్రంగా ఖండించారు. లెబనాన్ నుండి ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా చేసిన దాడులు ఎంతమాత్రం సమ్మతం కాదని, కఠిన నియంత్రణ చర్యలు తీసుకుంటామంటూ దీనిని బాధ్యతారహిత చర్యగా నవాఫ్ సలామ్ ప్రకటించారు. హెజ్బొల్లా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందన్నారు. దేశాన్ని ప్రమాదం నుండి కాపాడేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలను హెజ్బొల్లా విఫలం చేస్తోందని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ విమర్శించారు. ఖమేనీ మరణంతో హెజ్బొల్లా కాల్పుల విరమణ ఒప్పంద నియంత్రణను ఛేదించి ఇరాన్‌కు మద్దతుగా దాడులు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. 2024 నవంబరు 27న లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ రెండు దేశాలతోపాటు అమెరికా సహా మరో ఐదు దేశాలు కూడా మధ్యవర్తులుగా ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఐతే ఒప్పందం కుదిరిన తర్వాత కూడా లెబనాన్‌పై ఇజ్రాయెల్ పలు సార్లు దాడులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు 83 మంది పౌరులు మరణించారు. ఇదిలా ఉండగా, హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని లెబనాన్ ప్రభుత్వం ఆలోచిస్తోంది. లెబనాన్ భూభాగం నుండి హెజ్బొల్లా అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తోందని, ఈసంస్థ ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం ధృఢనిశ్చయంతో ఉంది. ఇరాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో లెబనాన్ ప్రభుత్వం ఈ ఆలోచన చేస్తోందని ప్రధానమంత్రి నవాఫ్ సలామ్ చెప్పారు. హెజ్బొల్లా సైనిక కార్యకలాపాలను నిషేధించామని, వారు జనజీవన స్రవంతిలో రాజకీయ రంగంలో మాత్రమే ఆయుధాలు లేకుండా పనిచేయాల్సి ఉంటుదన్నారు.

**బీరూట్‌లో నిరసన ప్రదర్శన**

లెబనాన్ రాజధాని బీరూట్‌లో అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా షియా మూమెంట్ హెజ్బొల్లా నాయకత్వంలో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. వెంటనే యుద్ధం ఆపాలని వారు డిమాండ్ చేశారు. అలీ ఖమేనీ చిత్ర పటాలతో భారీ ప్రదర్శన జరిపారు. ఖమేనీకి నివాళులు అర్పించారు. డెత్ టూ ఇజ్రాయెల్, డెత్ టూ అమెరికా అంటూ వారు నినాదాలు చేశారు. ఇరాన్‌పై తొలిరోజు దాడుల తర్వాత ఇజ్రాయెల్‌ను మట్టుపెడతామని హెజ్బొల్లా ప్రతిజ్ఞ చేసింది. అమెరికన్, జియోనిస్టు (ఇజ్రాయెల్) నేరపూరిత చర్యలవల్ల మన నాయకుడు ఖమేనీ మరణించారని, అమాయకులైన కుమారులను లక్ష్యంగా చేసుకోవడం వారి నేరాలకు పరాకాష్ఠ అనీ ఈ దాడులకు ప్రతీకారంతో తమ విధి నిర్వహిస్తామని హెజ్బొల్లా పేర్కొంది.

## ఐదో తేదీన నేపాల్ ఎన్నికలకు రంగం సిద్ధం

### ప్రజాస్వామ్య మనుగడకు ఓటు వేయాల్సిందే : సుశీల కర్కి



**కాఠ్మండు:** నేపాల్‌లో మార్చి ఐదోతేదీ (వచ్చే గురువారం) సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ప్రత్యర్థి రాజకీయపార్టీలు ప్రజల్లో జోరుగా తుది విడత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజలు శాంతి, సామరస్యాలను పాటించాలని కోరారు. దేశం ప్రగతిపథంలో నడవాలంటే తప్పనిసరిగా ఓటర్లు పోలింగ్ ప్రక్రియలో పాల్గొనాలని దేశ తాత్కాలిక ప్రధానమంత్రి సుశీల కర్కి సోమవారం టెలివిజన్‌లో జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఓటర్లు పోలింగ్‌లో విధిగా పాల్గొనడం తప్ప మరోమార్గం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగించడానికి జాతీయ సెలవు దినాలు ప్రకటించారు. 2025 సెప్టెంబరులో నేపాల్‌లో జనరేషన్ జెడ్ ఉద్యమం మహోధృతంగా సాగింది. ఈ ఉద్యమంలో 77మంది మరణించారు. ఈ ఉద్యమ ఫలితంగా కె.పి.శర్మ ఓలి ప్రభుత్వం రాజీనామా చేసింది. తాత్కాలిక ప్రధానమంత్రిగా సుశీల కర్కి బాధ్యతలు చేపట్టి ఆరునెలలో తిరిగి ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఇదే విషయాన్ని ఆమె తన టెలివిజన్ సందేశంలో ప్రస్తావిస్తూ, సంక్లిష్టమైన పరిస్థితులు, సవాళ్ళను అధిగమిస్తూ వచ్చామన్నారు. ఎన్నికల సంఘం సజావుగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసిందని చెప్పారు. ఎన్నికలు న్యాయబద్ధంగా, నిజాయతీగా, బాహాటపద్ధతులలో నిర్వహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాగా ఎన్నికల ప్రచారంలో యువ అభ్యర్థులు పోటాపోటీగా ప్రజలకు వాగ్దానాలు కురిపిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతామని, పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని, దేశానికి స్థిరత్వాన్ని, భద్రతకు చేకూరుస్తామని చెబుతున్నారు. దేశంలో 1.90 కోట్లమంది అర్హులైన ఓటర్లు ఉండగా, వీరిలో ఎనిమిది లక్షలమంది మొదటిసారి ఓటుహక్కు ఉపయోగించుకునేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. దేశ పార్లమెంటు దిగువసభలో 275 స్థానాలు ఉండగా, 165మంది చట్టసభ్యులను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. మిగిలిన 110మంది సభ్యులను నిష్పత్తి ప్రాతిపదికపై ఎన్నుకుంటారు. 3,400మంది పైగా అభ్యర్థులు ఈ ఎన్నికల్లో అధికారం కోసం పోటీ పడుతుండగా, వీరిలో 30 శాతం మంది నలభైయేళ్ళ లోపు వయసుగలవారే ఉన్నారు. పోటీలో ఉన్న ముఖ్యులలో కమ్యూనిస్టు నేత కె.పి.శర్మ ఓలి (74) ఉన్నారు. నేపాలీ కాంగ్రెస్ తరపున గగన్ థాపా పోటీలో ఉన్నారు.

## ఇరాన్ ద్రోహపూరిత దాడులు

### పునర్నిర్మాణం, శాంతి పునరుద్ధరణకు జిసిసి సమీక్ష

**రియాద్:** గడచిన మూడు రోజులుగా పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ చేస్తున్న దాడులను గల్ఫ్ కో–ఆపరేషన్ కౌన్సిల్ (జిసిసి) తీవ్రంగా ఖండించింది. నష్టపోయిన దేశాలలో పునర్నిర్మాణ చర్యలపై సభ్యులు చర్చించారు. యుద్ధ పరిస్థితి, నష్టాలు జరుగుతున్న పూర్వరంగంలో జిసిసి అసాధారణరీతిలో దృశ్య మాధ్యమ పద్ధతిలో సమావేశం నిర్వహించింది.ఇరాన్ చేస్తున్న ద్రోహపూరిత దాడుల కారణంగా పౌర సౌకర్యాలు, సేవా ప్రాంతాలు, నివాసిత ప్రాంతాల మౌలిక వ్యవస్థకు అపారమైన భౌతికనష్టం, ఆస్తినష్టం సంభవించిందని, అనేక ఇళ్ళు ధ్వంసమయ్యాయని, శాశ్వత ప్రాతిపదికపై నష్టాలు సంభవించాయని, అమాయకులైన ప్రజలను ఇరాన్ భయభ్రాంతులకు గురిచేసిందని సమావేశం విమర్శించింది. పౌరుల భద్రతకు, జీవితాలకు నష్టం కలిగించిందని విమర్శించింది. ఈ నష్టాలకు పరిహారం, వ్యవస్థల పునర్నిర్మాణం, శాంతి పునరుద్ధరణ జిసిసి సభ్య దేశాలు చర్చించాయి. జిసిసి మంత్రివర్గ మండలి ప్రస్తుత సెషన్ ఛైర్మన్‌అబ్దుల్ లతీఫ్ బిన్ రషీద్ అల్జయానీ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఖతార్, కువైత్, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల అధినేతలు, విదేశాంగ మంత్రులులతోపాటు జిసిసి సెక్రటరీ జనరల్ జాసెం మొహమ్మద్ అల్బుదైవి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ధరలు పైపైకి

(మొదటి పేజీ తరువాయి)

చెందిన మారిటైమ్ ట్రేడ్ సెంటర్ ఒక ప్రకటన చేస్తూ జలసంధి వద్ద గుర్తుతెలియని ప్రొజెక్టైల్స్ తమ రెండు నౌకలను దెబ్బతీశాయని, మరో నౌకకు ప్రొజెక్టైల్ అడ్డుగా వచ్చిందని తెలిపింది. యుద్ధ పరిస్థితులవల్ల హోర్ముజ్ జలసంధి నుండి చమురు నౌకల రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ప్రపంచ చమురు మార్కెట్‌లో భయాందోళన వ్యక్తమవుతోంది.భారతదేశానికి అవసరమైన దాదాపు 20.60లక్షల మిలియన్ బ్యారెల్స్ పెట్రోలు ఈ జలమార్గం నుండే రవాణా అవుతుంది. అంతేకాదు భారత్ ఒకరోజుకు ఉపయోగించే 19.60 కోట్ల క్యూబిక్ మీటర్ల (ఎంఎంఎస్‌సిఎండి) సహజవాయువు కూడా ఈ మార్గం నుండే వస్తుంది. ప్రపంచదేశాల అవసరాలకు అనుగుణంగా ప్రతిరోజూ 50 శాతం సహజ వాయువు ఈ మార్గంలోంచే వస్తుంది. యుద్ధం ప్రారంభమైన వెంటనే చమురు ధరలు గడచిన నాలుగేళ్ళలో ఎన్నడూలేని రీతిలో అనూహ్యంగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో సమస్యలను అధిగమించేందుకు వచ్చేనెల నుండి క్రమ క్రమంగా చమురు ఉత్పత్తులు పెంచాలని 'ఒపెక్ ప్లస్' దేశాల కూటమి నిర్ణయించింది. ఈ నిర్ణయంవల్ల రోజుకు 206,000 బ్యారెల్స్ చమురు ఉత్పత్తి పెంచుతారు. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఒక బ్యారెల్‌కు 80 డాలర్లకు పెరిగింది. గడచిన నాలుగు సంవత్సరాలలో ఎన్నడూలేని విధంగా చమురు, సంబంధిత ఉత్పత్తుల ధరలు యుద్ధం మొదలైన వెంటనే పెరిగాయి. ఇరాన్–ఒమన్ మధ్య ఉన్న అతి సన్నని ఈ జలమార్గం ద్వారా ప్రతిరోజూ వందల నౌకలు ప్రయాణం చేస్తూ ఉంటాయి. ఈ జలసంధి నిర్వహణ బాధ్యతలన్నీ ఇరాన్ చేతుల్లోనే ఉన్నాయి. ఇక్కడ యుద్ధ వాతావరణం నెలకున్నందువల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో నౌకల సక్రమ రాకపోకలపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచవాణిజ్యానికి అవసరమైన ఇరవైశాతం చమురు ప్రతిరోజూ ఈ మార్గం నుండే రవాణా అవుతూ ఉంటుంది. హోర్ముజ్ జలమార్గం ద్వారా ప్రతి రోజూ 2.10 కోట్ల బ్యారెళ్ళ చమురు నౌకల్లో రవాణా అవుతూ ఉంటుంది. అదేవిధంగా ప్రపంచదేశాలకు అవసరమైన 30శాతం సహజవాయువు కూడా ఈ మార్గం నుండేవెళుతుంది. యుద్ధ పరిస్థితుల్లో రవాణా చర్యలు అనిశ్చితంగా ఉన్నాయి. మరో నాలుగు వారాలు యుద్ధం కొనసాగకతప్పదన్ని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఎర్ర సముద్రంలో ఇక మీదట వాణిజ్య నౌకలపై దాడులు పునరుద్ధరిస్తామని ఇరాన్ అనుకూల ఉగ్రవాద సంస్థలు హెచ్చరికలు చేయడంతో అనేక చమురు రవాణా కంపెనీలు నౌకలను నిలిపివేయాలని నిర్ణయించాయి.

అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా భారత్ సహా వివిధ దేశాల్లో స్టాక్ మార్కెట్‌లు కూడా పతనమవుతున్నాయి. పశ్చిమాసియా గగనతలాన్ని మూసివేయడంతో లండన్‌లో ఎఫ్‌టిఎస్‌ఇ పతనమైంది. యూరప్‌దేశాలలో లీడింగ్ మార్కెట్లన్నీ కనిష్టస్థాయికి క్షీణించాయి. ఫ్రాన్స్‌లో సిఎసి–40 1.6 శాతం మేరకు, జర్మనీలో డాక్స్ 1.7 శాతం మేరకు పతనమైంది. ఔన్స్ బంగారం ధర 3.4 శాతం పెరుగుదలతో 5,426.99 డాలర్లకు చేరుకుంది. అమెరికా ఫ్యూచర్స్ ఒకశాతం మేరకు పతనమయ్యాయి. డిఫెన్స్ కాంట్రాక్టర్లు భారీగా లాభపడుతున్నారు. ఎస్ అండ్ పి 500 ఫ్యూచర్స్, డౌ జోన్స్ ఇండస్ట్రీలు సగటున 1.7శాతం మేరకు స్టాక్స్ పతనమయ్యాయి. యూరప్ మార్కెట్లు కనిష్టస్థాయిలో ప్రారంభమయ్యాయి. జపాన్ నిక్కీ 225 ఇండెక్స్ ప్రాథమికంగా రెండూ శాతం మేరకు పతనమైంది. 1.4 శాతం వద్ద ముగిసింది. ఆస్ట్రేలియా ఎస్ అండ్ ఎఎంపి పి/ఎఎస్ఎక్స్ 200 పూర్తిగా క్షీణించింది. తైవాన్,సింగపూర్ మార్కెట్లు కూడా 0.9 శాతం నుండి 2.3 శాతం మేరకు పతనమయ్యాయి. దక్షిణ కొరియాలో మార్కెట్లు హాలీడేలో ఉన్నాయి.

## యుద్ధం ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఒక ప్రకటన చేస్తూ ప్రపంచ వాణిజ్యానికీ, దేశాల చమురు అవసరాలు తీర్చే రవాణా నౌకల రాకపోకలకు కేంద్రంగా ఉన్న హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామని హెచ్చరిక జారీ చేసింది. ఐక్యరాజ్యసమితి ఐఎఇఎలో ఇరాన్ దౌత్యవేత్త రెజా నజాఫి పాత్రికేయులతో మాట్లాడుతూ, అమెరికా–ఇజ్రాయెల్ ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి స్థావరంపై దాడులు చేసినట్లు చెప్పారు. మరోవైపు ఇరాన్ దాడుల ఉద్రిక్తతలమధ్య సైప్రస్‌లో ఉన్న అక్రోటిరి రాయల్ ఎయిర్‌ఫోర్స్ స్థావరాన్ని బ్రిటన్ ఖాళీ చేసింది. ఇరాన్‌పై దాడుల్లో బ్రిటన్ పాల్గొనబోదని, రక్షణ చర్యలు తీసుకుంటామని ఆ దేశ ప్రధానమంత్రి స్టార్‌మర్ ప్రకటించారు. అమెరికా స్థావరాలున్న మిత్రదేశాలపై ఇరాన్ దాడులు చేస్తుంటే, గగనతల క్షిపణి,డ్రోన్ నియంత్రణ వ్యవస్థలు వాటిని అడ్డుకోలేకపోవడం అమెరికా వైఫల్యంగా ప్రచారం కావడంతో నాటో కూటమి దేశాలు కూడా సందర్భానుసారం పరిమితంగా రంగంలోకి దిగుతాయన్న వార్తలు కూడా వస్తున్నాయి. డిగోగార్షియా దీవులలో ఉన్న బ్రిటన్ స్థావరాలను అవసరమైతే గగనతల దాడులకు ఉపయోగించుకోవడానికి అమెరికా రంగం సిద్ధం చేసుకుంటున్నది. ఒక లక్షమంది రిజర్విస్టు సైనికులను యుద్ధరంగంలోకి రప్పిస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఒకవైపు ఇరాన్ అనుబంధ సాయుధ సంస్థల అండతో దాడులు చేస్తుండగా మరోవైపు అమెరికా–ఇజ్రాయెల్ కూడా దాడులు పెంచాయి. లెబనాన్‌లో హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో కీలక నాయకులు సహా 31 మంది మరణించారు. మొదటిరోజు అమెరికా–ఇజ్రాయెల్ ఉమ్మడి దాడిలో గాయపడిన అలీ ఖమేనీ భార్య మనౌరే ఖోజారే బగజౌస్తే చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు ఇరాన్ మీడియా తెలియజేసింది.

కువైత్‌లోని అమెరికా దౌత్యకార్యాలయాన్ని ఇరాన్ ధ్వంసం చేసింది. దౌత్యకార్యాలయం పొగలు కక్కుతూ మంటల్లో చిక్కుకుంది. కువైత్‌లోని అనేక కేంద్రాలను ధ్వంసం చేసింది. బహ్రైన్ ఓడరేవులో అమెరికా జెండాతో వెళుతున్న స్టెనా ఇంపెరేటివ్ చమురునౌకపై ప్రొజెక్టైల్స్ దాడి చేశాయి. దీంతో నౌకలో మంటలు చెలరేగాయి. ప్రపంచంలోనే లోనే అతిపెద్దదైన తూర్పు సౌదీలోని దమ్మమ్ సమీపంలో ఉన్న రాస్ తనురా ఇంధన శుద్ధి కేంద్రంపై ఇరాన్ దాడులు చేసింది. దీంతో ఈ కేంద్రాన్ని సౌదీ మూసివేసింది. మంటల్లో ఈ కేంద్రం దగ్ధమైన దృశ్యాలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. అరబ్ ఎమిరేట్స్‌లో మూడు రోజుల్లోముగ్గురు మరణించగా మరో 58 మంది గాయపడ్డారు. దీంతో ఇరాన్ లో దౌత్యకార్యాలయాన్ని మూసివేసింది. ఇరాన్ దౌత్యవేత్తను పిలిపించి తీవ్ర నిరసన తెలియజేసింది. ఖతార్‌లోని దోహాలో వరుసగా రెండోరోజు ఇరాన్ దాడులతో భారీపేలుళ్ళు సంభవించాయి. మరోవైపు ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లను ఇరాన్ వరద ప్రవాహంలా ప్రయోగిస్తూ ఉండటంతో అపార నష్టం వాటిల్లుతోంది. దీంతో ఇరాన్ క్షిపణులను ట్రాకింగ్ చేయడంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఐడిఎఫ్ పేర్కొంది. నివాసిత ప్రాంతాలు, ప్రాతిపదిక సౌకర్యాలపై ఇరాన్ దాడులు చేస్తోంది. కాగా దుబాయ్‌లో ప్రజలు బాంబుపేలుళ్ళ శబ్దాలతో సోమవారం నిద్రలేచారు. భయంతో పరుగులు తీశారు.

ఇజ్రాయెల్–అమెరికా కూడా ఇరాన్‌పై తాజా దాడులు చేస్తున్నాయి. నాలుగు దశాబ్దాలక్రితం నాటి ఇరాన్ యుద్ధ విమానాలు, బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు కూడా దాడులు చేస్తున్నట్లు అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఇరాన్‌లోని ఆసుపత్రులు,పోలీస్ స్టేషన్లు, ఇతర మౌలిక సదుపాయాలపై కూడా దాడులు చేస్తూ ఉండటంతో ఇరాన్ తీవ్ర నష్టాని చవిచూస్తోంది. టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ తీవ్ర దాడులు చేస్తోంది. ఇరాన్‌లో గడచిన మూడు రోజుల్లో 555 మంది మరణించారని, 747 మంది గాయపడ్డారని ఇరానియన్ రెడ్ క్రిసెంట్ సొసైటీ ప్రకటించింది. మినాబ్‌లో ఇజ్రాయెల్ ప్రాథమిక పాఠశాలపై చేసిన క్షిపణిదాడిలో మరణించిన బాలికలసంఖ్య 165కు చేరుకుందని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఐతే ఆ దాడికి తాము బాధ్యులం కాదని ఇజ్రాయెల్ బుకాయించింది.

మరోవైపు నుండి ఇరాన్‌లో సైబర్ దాడులను అమెరికా–ఇజ్రాయెల్ ప్రోత్సహిస్తున్నాయి. దీంతో సాంకేతికంగా,నిత్య జీవన సేవా కార్యకలాపాలకు తీవ్ర నష్టం కలిగింది. మొత్తం ఇరాన్‌లోని 130 నగరాలు, పట్టణాలపై ఇజ్రాయెల్ డ్రోన్లు, క్షిపణి దాడులు చేసింది. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ కార్యాలయంపై క్షిపణి దాడులు జరిగాయి. కానీ పూర్తిగా ఇరాన్ టీవీ ప్రసారాలను నిలిపివేయకుండా అడ్డుకోవడంలో ఇజ్రాయెల్ విఫలమైంది. కాగా దాడుల నేపథ్యంలో టెహ్రాన్ వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇరాన్ దాడులను జిసిసి తీవ్రంగా తప్పుపట్టిన నేపథ్యంలో, తమ దాడులు పశ్చిమాసియాలో ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకునే జరుగుతున్నాయని, తోటి దేశాలపై దాడి చేయడం తమ ఉద్దేశం కాదని ఇరాన్ స్పష్టం చేసింది.

అమెరికాకు చెందిన మూడు ఎఫ్–15 ఇ ఫైటర్ ఈగల్ జెట్స్‌ను మిత్రదేశం కువైత్ కూల్చివేసింది. ఈ విషయాన్ని అమెరికా అధికారికంగా ధృవీకరించింది. పొరపాటున ఈ సంఘటనలు జరిగాయని అమెరికా పేర్కొంటూ దీనిని ఫ్రెండ్లీ ఎటాక్‌గా అభివర్ణించింది. బాగ్దాద్ విమానాశ్రయంలో అమెరికా సైన్యాలపై ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల గ్రూపులు దాడులు చేశాయి. బ్రిటన్ సైనిక స్థావరాలను అమెరికా ఉపయోగించుకోవడాని తోటి నాటో మిత్రదేశంగా అవకాశం కల్పించనట్లు ఆ దేశ ప్రధానమంత్రి స్టార్‌మర్ చెప్పారు.దీంతో రెండో రోజు కూడా సైప్రస్‌లో ఇరాన్ డ్రోన్ దాడులు జరిగాయి. మృతులసంఖ్య, గాయపడుతున్నవారి సంఖ్య పెరుగుతూ ఉండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ పౌరుల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరింది.

## ఖజానాకు రాజకీయ కన్నం!

(మొదటి పేజీ తరువాయి)

పొందినటువంటి వారు వారి గడువు ముగిసిన తర్వాత వర్తక సంఘంలో చేరుతున్నారు. ఆ విధంగా నేడు వాటి సంఖ్య ఏకంగా 112కు చేరింది. అయితే ఈ పెరుగుదల కేవలం దుకాణాల సంఖ్యలో మాత్రమే కనిపిస్తోంది తప్ప, దేవస్థాన ఖజానాకు చేరే ఆదాయంలో మాత్రం ప్రతిఫలించడం లేదు. వీటికి బహిరంగ టెండర్లు నిర్వహిస్తే ఏటా సుమారు రూ.25 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, నామమాత్రపు చెల్లింపులతోనే కాలం వెళ్లదీస్తున్నారు.

**అద్దె చెల్లింపుల్లో భారీ 'ఎగనామం'**

నిబంధనల ప్రకారం ఏటా అద్దెను 33.33 శాతం మేర పెంచాల్సి ఉంటుంది. ఈ లెక్కన మూడేళ్ల కాలానికి దాదాపు 100 శాతం అద్దె పెంచి, దేవస్థానానికి రూ.5.07 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ, వర్తక సంఘం నాయకులు తమ ప్రాబల్యాన్ని ఉపయోగించి కేవలం ఏడాదికి సరిపడా రూ.1.69 కోట్లు మాత్రమే చెల్లిస్తూ, మిగిలిన 3.38 కోట్ల రూపాయలను ఎగ్గొడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే ఈ భారీ అక్రమం సాగుతోందని భక్తులు ఆరోపిస్తున్నారు.

**సబ్–లీజుల దందా.. భక్తులపై ధరల భారం**

లైసెన్సులు పొందిన కొందరు వ్యక్తులు ఆ దుకాణాలను ఇతరులకు భారీ రేట్లకు సబ్‌లీజుకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి తోడు, కొండపై వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అక్షింతలు, పచ్చ బొట్లు, ఇతర చిరు వ్యాపారాల పేరుతో సాగుతున్న ఈ దందాలో దేవస్థానానికి వస్తున్నది కేవలం నామమాత్రపు రుసుమే.

**ఇతర విభాగాల్లో కోట్లలో ఆదాయం.. ఇక్కడ మాత్రం ఎందుకు తక్కువ?**

దేవస్థానంలోని ఇతర సేవలైన సెల్ ఫోన్ల భద్రత ద్వారా ఏడాదికి రూ.2.62 కోట్లు, కొబ్బరి చిప్పల సేకరణ ద్వారా రూ.78 లక్షలు, లక్ష్మీ పుష్కరిణి వద్ద కొబ్బరికాయల విక్రయం ద్వారా రూ.80.24 లక్షల ఆదాయం సమకూరుతోంది. ఇవన్నీ టెండర్ల ద్వారా పారదర్శకంగా జరుగుతుండగా, 112 దుకాణాలు ఉన్న వర్తక సంఘం నుంచి మాత్రం కేవలం కోటిన్నర రూపాయలే రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. వైకుంఠ ద్వారం, వాహన పూజల వద్ద వ్యాపారం చేసేవారు కూడా అదనంగా చెల్లించాల్సిన మొత్తాన్ని ఎగ్గొడుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పారదర్శక పద్ధతిలో టెండర్లు నిర్వహించి దేవస్థాన ఆదాయాన్ని కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

## అమెరికాతో చర్చల ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధపడుతున్నారనీ, అందుకు తాను అంగీకరించాననీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పచ్చి అబద్ధ ప్రచారం చే స్తున్నారని లారిజానీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రపంచాన్ని ఆయన అబద్ధ ప్రచారంలో ముంచెత్తుతున్నారని, తాము ఎవ్వరినీ చర్చలకోసం సంప్రదించలేదని, అలాంటి అవసరం లేదని తిరస్కరించారు.చర్చలకు వస్తామని తాము అడగలేదని ఆయన అన్నారు. జెనీవాలోని ఒమన్ దౌత్యకార్యాలయంలో ఆ దేశ మధ్యవర్తిత్వంలోనే ఫిబ్రవరి 26న చివరిసారి అమెరికా–ఇరాన్ ప్రతినిధులమధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చలు ముగిసిన తర్వాత ఖమేనీ ప్రధాన సలహాదారు షంఖానీ ఎంతో సానుకూలమైన ప్రకటన చేశారు. అదే ఆయన చివరి ప్రకటన. ఆ తర్వాత ఖమేనీతోపాటు ఆయన మరో 40మంది ఇరాన్ మంత్రివర్గ సభ్యులు, కమాండర్లు అమెరికా–ఇజ్రాయెల్ ఉమ్మడి దాడుల్లో మరణించారు. కానీ మధ్యవర్తి దేశం ఒమన్ మాత్రం వచ్చేవారం వియన్నాలో మరోవిడత చర్చలు జరుగుతాయని, జెనీవా చర్చలు సానుకూలంగా జరిగాయని ప్రకటించింది.

## మోదీ ఫోన్‌కాల్ (మొదటి పేజీ తరువాయి)

మీడియాకు వెల్లడించాయి. అంతకుముందు ఆదివారం యుఎఇ ప్రెసిడెంట్ షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు కూడా భారత ప్రధాని ఫోన్ కాల్ చేశారు. యుఎఇపై ఇరాన్ దాడులను మోదీ ఖండించారు. ఆ దాడుల వల్ల యుఎఇలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపాన్ని ప్రకటించారు. ఈ కష్టకాలంలో యుఎఇకి అండగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రవాస భారతీయుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నందుకు యుఎఇ ప్రెసిడెంట్‌కు ధన్యవాదాలు తెలిపారు. సైనిక ఉద్రిక్తతలను తగ్గించాలని, ప్రాంతీయ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మిడిల్ ఈస్ట్ దేశాలకు ప్రధాని పిలుపునిచ్చారు.

**అందుకే ఆ దాడులను ఖండించాం**

'పశ్చిమాసియా ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై బహ్రయిన్ రాజు, సౌదీ యువరాజులతో చర్చించాను. ఆ రెండు దేశాలపై ఇటీవలే ఇరాన్ చేసిన దాడులను ఖండించాను. ఈవిధంగా దాడులు చేయడం అనేది ఇతర దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలకు భంగం కలిగించినట్లు అవుతుంది. అందుకే ఆ దాడులను భారత్ ఖండించింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రవాస భారతీయుల యోగ, క్షేమాలను పర్యవేక్షిస్తున్నందుకు బహ్రయిన్ రాజు, సౌదీ యువరాజులకు ధన్యవాదాలు చెప్పాను' అని పేర్కొంటూ ప్రధాని మోదీ ఒక ట్వీట్ చేశారు.

**ఈ కష్టకాలంలో బహ్రయిన్‌కు అండగా నిలుస్తాం**

'బహ్రయిన్ రాజుతో ఫోన్ కాల్‌లో నా చర్చలు ఫలవంతంగా జరిగాయి. ఆ దేశంపై ఇరాన్ చేసిన దాడులను భారత్ ఖండిస్తోంది. బహ్రయిన్ ప్రజలకు భారత్ సంఘీభావాన్ని ప్రకటిస్తోంది. ఈ కష్టకాలంలో వారికి అండగా మేం నిలుస్తాం. ప్రవాస భారతీయుల భద్రతకు పెద్దపీట వేస్తున్నందుకు భారత్ తరపున నా ధన్యవాదాలు' అని పేర్కొంటూ ప్రధాని మోదీ మరొక ట్వీట్ చేశారు.

## ఇరాన్ క్షిపణి పరిశ్రమను ధ్వంసం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చేయాలో తమకు బాగా తెలుసుననీ అన్నారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇరాన్ భద్రతాదళాలు, పోలీసులు లొంగిపోవాలని, ప్రజాస్వామ్యవాదులతో చేతులు కలపాలని కోరారు. వారు లొంగిపోకపోతే చావు తప్పదని హెచ్చరించారు. 'ఇరాన్ దేశం పెద్దది కదా, అందువల్ల సమయం పడుతుంది, నాలుగు వారాలపాటు యుద్ధం కొనసాగుతుంది, అమెరికా కూడా తన వైపు సైనిక నష్టాన్ని భరించకతప్పదు, మరింతమంది సైనికులు మరణించే అవకాశం ఉంది' అన్నారు. అదేవిధంగా ''ఇరాన్‌లో సైనిక చర్య కొనసాగుతుంది' అని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. 'లయన్ రోర్' పేరుతో ఇజ్రాయెల్ ఐ.డి.ఎఫ్, 'ఎపిక్ ఫ్యూరీ' పేరుతో అమెరికా ఉమ్మడిగా ఇరాన్‌పై గడచిన శనివారం నుండి సైనిక చర్య కొనసాగిస్తున్నాయి.

**విదేశీజోక్యంతప్ప వేరేదారిలేదు : ఐఐఎఫ్ఎంఎ ప్రకటన**

ఇరాన్ ఇండిపెండెంట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ (ఐఐఎఫ్ఎంఎ) అమెరికా,ఇజ్రాయెల్ దాడులకు వత్తాసు పలికింది. ఇరాన్ ప్రజలు తమను తాము విముక్తి చేసుకోవడానికి విదేశీ జోక్యం తప్ప మరో మార్గం లేదని ప్రకటించింది. ఇరాన్‌లో కోట్లాదిమంది పౌరులకు కూడా అమెరికా,ఇజ్రాయెల్ రక్షణ కల్పించాలని, ఇరాన్ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని కోరింది. ఖమేనీ ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో దేశంలో ప్రజాందోళనను అణచివేసిందని 30 వేలమంది ప్రజలను, యువకులను ఊచకోత కోసిందని పేర్కొంది.



## మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మహిళల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘం భవనం నిర్మాణ పనులకు, అలాగే గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాలకు స్వంత భవనం ఏర్పాటు కావడంతో సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి మార్గదర్శక కార్యక్రమాలునిర్వహించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధిలో భాగంగా మెరుగైన రహదారి సదుపాయం కల్పించడం ద్వారా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, వర్షాకాలంలో ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్ రావు, గ్రామ సర్పంచ్ గాదరి జయ రాఘవులు,ఉపసర్పంచ్ బచ్చుపల్లి రామాలింగారావు, పంచాయతీ కార్యదర్శి పల్స రజిత పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 62 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 37, గ్రామీణాభివృద్ధి శాఖ 7, మున్సిపాలిటీ 5, హౌసింగ్ 4, ఎంపిడిఓ 2, పంచాయతీ 2, జిల్లా పరిషత్, ఎలక్ట్రిసిటీ, అటవీ శాఖ, విద్య శాఖ, ఆర్‌టిసి, శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. స్టేట్ ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జయమ్మ, జెడ్పీ సిఈఓ శోభ రాణి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగి రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన లక్ష్యాలను నూటికి నూరు శాతం సాధించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈ ఆర్థిక సంవత్సరం ముగియనున్న దృష్ట్యా ఆయా శాఖల ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను నూటికి నూరు శాతం సాధించడంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ చెప్పారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని,పెండింగ్ లో పెట్టుకోవద్దని అన్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సైతం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. హాస్టళ్ల తనిఖీపై నిర్దేశించిన ప్రొఫార్మాలో మండలాల ప్రత్యేక అధికారులు నివేదికను సమర్పించాలని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనున్నందున ఆయా పద్దుల కింద మంజూరైన నిధులు, చేపట్టిన పనులను నిర్దేశించిన సమయంలో గా పూర్తిచేసేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని,బడ్జెట్ వృధా కాకుండా చూడాలని అన్నారు. ఈనెల 15 నుండి 20 మధ్యలో రబీ ధాన్యం కొనుగోలు ప్రారంభం కానున్న దృష్ట్యా మండలాల ప్రత్యేక అధికారులు భాగస్వాములు కావాలన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,ఆర్‌డిఓలు రమణారెడ్డి,శ్రీదేవి,జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

దివంగత శాసన సభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, పలువురు అధికారులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ధ్యానం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు రావొద్దు

### యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** రబీ 2025/26 వరిధాన్య కొనుగోళ్ల విషయమై యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా టోకెన్ పద్ధతి ద్వారా కొనుగోళ్లు జరిపి, ధాన్యం సేకరణ జరిగేలా చూడాలన్నారు. ఎత్తు, పల్లాలు సరిచూసుకుని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో సరియైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ అనగా, వేయింగ్ మెషీన్‌లు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్‌లు, గన్నీ బ్యాగులను సరిపడా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం 50 టార్పాలిన్ షీట్లను అందజేయాలని సూచించారు. అదే విధంగా వేసవి దృష్ట్యా రైతులకు, నిర్వాహకులకు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, నీడ, షెడ్లు, టెంట్లు, కుర్చీలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. అన్ని పిపిసి కేంద్రాలవారు మార్చి 15లోగా తూకపు యంత్రాలు మరియు తేమ యంత్రాలు సంబంధిత అధికారులచే ధృవీకరించుకోవలసినదిగా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు, జిల్లా సహకార అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా మార్కెటింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# మాట తప్పని నేత

## పోరాడి బస్సు తెచ్చిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం!

### లింగంవారిగూడెంలో పండగ వాతావరణం

### స్వయంగా బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్సీ






**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణ పురం :** 'రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం సులభం.. కానీ వాటిని నిలబెట్టుకోవడమే అసలైన నాయకత్వం' అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మరోసారి నిరూపించారు. చాలా కాలంగా రవాణా సౌకర్యం లేక అష్టకష్టాలు పడుతున్న లింగంవారిగూడెం గ్రామస్తుల గోడును ఆలకించిన ఆయ న, కేవలం మాట ఇవ్వడమే కాకుండా, పట్టుబట్టి మరీ ఆర్టీసీ బస్సును ఊరికి రప్పించారు.

**అడ్డంకులు తొలిగాయి.. బస్సు కదిలింది!**

గ్రామంలో బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు కిలోమీటర్ల మేర నడవాల్సి వచ్చేది, రైతులు మార్కెట్‌కు వెళ్లలేక ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను గ్రామస్తులు, సిపిఐ నాయకులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా, 'బస్సు పునరుద్ధరణ నా బాధ్యత' అని ఆయన మాటిచ్చారు. అన్నట్టుగానే అధికారులపై ఒత్తిడి తెచ్చి, సాంకేతిక ఇబ్బందులను తొలగించి బస్సు సర్వీసును ప్రారంభించేలా చేశారు.

**సామాన్యుడిలా బస్సులో ప్రయాణం**

కేవలం జెండా ఊపి ప్రారంభించడమే కాకుండా, తొలిరోజే ఎమ్మెల్సీ స్వయంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించి గ్రామ ప్రజలను ఆశ్చర్యపరిచారు. సామాన్య ప్రయాణికులతో కలిసి కూర్చుని, వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. 'ప్రజాప్రతినిధి అంటే ప్రజల మధ్య ఉండాలి' అని ఆయన చాటి చెప్పిన తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**గ్రామంలో ఘనస్వాగతం**

బస్సు గ్రామానికి చేరుకోగానే ప్రజలు హర్షాతిరేకాల మధ్య ఎమ్మెల్సీకి పూలమాలలు, శాలువాలతో ఘన స్వాగతం పలికారు. 'ఇది కేవలం బస్సు కాదు, మా ఊరి గౌరవం' అని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఆర్టీసీ డిపో మేనేజర్ రమణ, సిపిఐ నాయకులు కె.శ్రీనివాస్, బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, తీర్పారి వెంకటేశ్వర్లు, దుబ్బాక భాస్కర్, బీఆర్ఎస్ నాయకుడు కూసుకుంట్ల సత్తిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కత్తుల లక్ష్మయ్య, సర్పంచ్ కత్తుల జ్యోతి వాసు ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**చౌటుప్పల్‌లో ఎక్సైజ్ కార్యాలయం ఏర్పాటు చేయాలి ఎమ్మెల్సీకి వినతి**

చౌటుప్పల్ పట్టణంలో ఎక్సైజ్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఎక్సైజ్ సంబంధిత పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని దీనివల్ల లైసెన్సులు పునరుద్ధరణలు ఆలస్యం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ పరిసర మండలాలకు కూడా పట్టణం కేంద్ర బిందువుగా ఉండడంతో ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యం కలుగుతుందన్నారు.

## ప్రజాక్షేమమే పరమావధిగా పనిచేసి చరిత్రగా నిలవండి

### భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రజాక్షేమమే పరమావధిగా అభివృద్ధే నినాదంగా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా పనిచేసి చరిత్రలో గొప్ప నాయకులుగా నిలవాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిలు పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, పాలకవర్గానికి దిశా నిర్దేశం చేశారు. భూదాన్ పోచంపల్లి మున్సిపల్, వైస్ చైర్మన్ కొయ్యడ రజినీ శ్రీనివాస్ కౌన్సిలర్లు సోమవారం ఎంపీ, ఎమ్మెల్యే నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిసారు. నూతనంగా ఏర్పడిన మున్సిపల్ పాలకవర్గానికి వారిరువురు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎంపీ, ఎమ్మెల్యేలకు పలు విన్నపాలు విన్నవించారు. ఫార్మ కంపెనీలు, మూసి ఎఫెక్ట్ ప్రాంతం కాబట్టి ప్రజలు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రాథమిక హాస్పిటల్‌ను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల హాస్పిటల్‌గా మార్చి 24 గంటలు వైద్య సదుపాయం ప్రజలకు అందేలా సంపూర్ణ సహకారం అందించాలని ఆకాంక్షను తెలిపారు.

**30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కోసం హెల్త్, మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఎంపీ అధికారిక లేఖ**

మున్సిపల్ చైర్మన్ కోరిన వెంటనే ప్రజలకు అత్యవసర, మెరుగైన వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరిన వెంటనే 30 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటు కోసం అధికారిక లేఖ రాసి నియోజకవర్గం ప్రజల పట్ల ఎంపీ తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఎంపీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రాజ్యాంగ విలువలకు అనుగుణంగా నడుచుకుంటూ ప్రజలకు నిత్యం అందుబాటులో వుండాలని తమ తమ వార్డులో అభివృద్ధిలో ముందుండాలని కోరారు. ముఖ్యంగా పోచంపల్లి నుండి దిల్ సుఖ్ నగర్ వరకు అదనపు బస్సులు నడిపించాలని కోరిన వెంటనే ఎంపీ స్పందిస్తూ టీజీ ఆర్టీసీ ఫుల్ డైరెక్టర్ వై నాగిరెడ్డితో ఫోన్లో మాట్లాడి బస్సులు నడపాలని ఆదేశించారు. టూరిజం శాఖ నుండి కూడా పర్యాటకుల కోసం బస్సులు నడిపించే విధంగా కృషిచేయాలని తెలిపారు. ఏప్రిల్ 18న భూదన్యోదమానికి 75 సం.లు పూర్తి పూర్తికానున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున భూదాన వజ్రోత్సవాలు జరుపుకున్నందున విశిష్ఠ అతిథిగా ముఖ్యమంత్రినీ ఆహ్వానించాలని కోరారు. సీఎం రావటానికి ఎంపీ తనవంతుగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్ కౌన్సిలర్స్ కొండమడుగు ఎల్ల స్వామి, శ్రీరామ మంజుల లింగస్వామి యాదవ్, జంగయ్య యాదవ్, దేవరాయ కుమార్, జినుకల లావణ్య యాదగిరి, నేతాజీ యువజన సమాఖ్య అధ్యక్షులు రమేష్ గౌడ్ ఉన్నారు.

## సహజ రంగులతో హోళీ జరుపుకోండి

### ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** హోళీ పండుగను సహజసిద్ధమైన రంగులతో,సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సూచించారు.రసాయనిక రంగులను ఉపయోగించవద్దని,ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం, నీటి బెలూన్లు విసరడం చేయరాదని హెచ్చరించారు.మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం షీ టీమ్ బృందాలను మోహరించి, ప్రధాన కూడళ్లలో నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదని,డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.యువత అతి వేగం నివారించి జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ఈత రాని వారు చెరువులు, కాలువల వద్దకు వెళ్లరాదని, చిన్నపిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు.

# ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

### ఇసుక క్వారీలలో స్టాప్ రాడర్స్...

### క్వారీల చుట్టూ బుల్లెట్ కెమెరాలు

### 24 గంటల పర్యవేక్షణకు మొబైల్ వ్యాన్ ఏర్పాటు





**ప్రజాపక్షం/సూర్యాపేట :** అక్రమ ఇసుక రవాణా మాఫియాను కట్టడి చేయడంతోపాటు సామాన్యులకు ఇంటి వద్దకే తక్కువ ధరలకు సరఫరా చేసేందుకు ప్రభుత్వం తీసుకవచ్చిన సాండ్ ట్యాక్సీని మైనింగ్ అధికారులు జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాలతో సాండ్ ట్యాక్సీ విధానాన్ని మరింత పటిష్టం చేసేలా ముందుకు సాగుతూ మూసీ నది సమీపంలో ఉన్న జాజిరెడ్డిగూడెం మండలం తుంగగూడెం, నాగారం మండలం పేరబోయినగూడెం వద్ద ఉన్న క్వారీల వద్ద ఇసుక అక్రమంగా తరలిపోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

సాండ్ ట్యాక్సీ విధానాన్ని అమలు చేస్తున్న అధికారులు వినియోగదారులు ఆన్‌లైన్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా అవసరమైన ఇసుకను బుకింగ్ చేసుకునే విధానాన్ని తీసుకవచ్చారు. ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లను, ఇతర వాహనాలను తప్పనిసరిగా మైనింగ్ అధికారుల వద్ద వివరాలను నమోదు చేసుకోవల్సి ఉంటుంది. కిలోమీటర్ల చొప్పున అధికారులు ధరను నిర్ణయించి గతం కన్నా తక్కువ ధరలకే ఇసుకను సరఫరా చేయిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా కొంతమంది అక్రమ రవాణాదారులు అధికారుల కళ్లు కప్పి క్వారీల నుండి దొంగచాటుగా ఇసుకను తోడేసి బహిరంగ మార్కెట్‌లో సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడడంతో పాటు వినియోగదారులకు కూడా నష్టం జరుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాలతో జిల్లా మైనింగ్ ఏడి విజయ రామరాజు పటిష్ఠ చర్యలకు పూనుకున్నారు. దీనిలో భాగంగా జాజిరెడ్డిగూడెం మండలంలోని తుంగగూడెం, నాగారం మండలంలోని పేరబోయినగూడెం క్వారీల వద్ద స్టాప్ రాడర్స్ ఏర్పాటు చేశారు. ఈ రాడర్స్‌ను ఇసుక రవాణా చేసే ద్వారం వద్ద బిగించడం జరిగింది. ఇసుక రవాణా సమయం పూర్తి అయిన తరువాత వీటికి తాళాలు వేస్తున్నారు. దీనితో పాటు క్వారీల చుట్టూ బుల్లెట్ కెమెరాలు ఏర్పాటు చేసి మైనింగ్, రెవెన్యూ, పోలీసు పర్యవేక్షణలో 24 గంటల పాటు మొబైల్ వ్యాన్‌తో గస్తీ ఏర్పాటు చేశారు. క్వారీలో లైటింగ్ సౌకర్యం కోసం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. రెండు కంటే నర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి ఇసుక ట్రాక్టర్, ట్రాలీపై సాండ్ ట్యాక్సీ లేబుల్‌ను అమర్చాలని, పిఓఎస్ యంత్రాలు సక్రమంగా పనిచేసే విధంగా ప్రతి వాహనానికి తప్పనిసరిగా వేబిల్లును జారీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**అక్రమంగా ఇసుకను తోడితే రూ.25వేల జరిమానా : మైనింగ్ ఏడి విజయ రామారావు**



క్వారీల నుండి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే ఒక్క ట్రాక్టర్‌కు రూ.25వేల జరిమానా విధిస్తామని సూర్యాపేట జిల్లా మైనింగ్ ఏడి విజయ రామారావు తెలిపారు. సోమవారం ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ జిల్లాలో మన ఇసుక వాహన / సాండ్ ట్యాక్సీ రీచ్‌ల నిర్వహణకు మార్గదర్శకాలను జారీ చేసినట్లు చెప్పారు. నిరంతర పర్యవేక్షణతోపాటు నిఘా నీడలో సక్రమంగా ఇసుక రవాణా జరిగేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే రూ.25వేల జరిమానతోపాటు వాహనాన్ని బ్లాక్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.



## ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణంలోని పణిగిరి శ్రీ సీతారామచంద్రస్వామి గుట్ట వద్ద ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు అందజేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జిప్లస్ వన్ ఇందిరమ్మ ఇండ్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ సందర్శించి పనులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైతే ఎక్కువ మంది లేబర్‌ను తీసుకుని పనులు పూర్తి చేసి మార్చి మొదటివారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడానికి సిద్ధం చేయాలని అన్నారు. బ్లాక్‌ల మధ్యగల అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, తాగునీరు, మొక్కలు నాటడం, పెయింటింగ్ పనులు, స్ట్రీట్‌లైట్స్ అన్ని రకాల పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు అస్కారం లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్ పిడి సిద్దార్థ, మిషన్ భగీరథ ఇఇ కరుణాకర్‌రెడ్డి, హర్టికల్చర్ పిడి నాగయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి తప్పనిసరిగా హాజరుకావాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజావాణికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ శాఖలలో చాలా కాలం నుండి పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రస్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 83 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, ఇంచార్జి సిఇఓ శిరీష, ఆర్‌డిఓ వేణుమాదవ్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, జిల్లా ఇండ్రస్టీస్ అధికారి సీతారాం నాయక్, డిఇఓ అశోక్, సం క్షేమ అధికారులు నర్సింహారావు, దయానంద రాణి, నరసింహ పాల్గొన్నారు.

## భయాందోళనకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శానిటేషన్ కార్మికులుగా పనిచేస్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. గత 30 సంవత్సరాల నుంచి శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలకు చెందిన కార్మికులు వెయ్యి రూపాయల వేతనం నుంచి సమర్థవంతమైన విధులు నిర్వహిస్తున్నారని, గత రెండు నెలల నుంచి నర్స్‌గా విధులు నిర్వహిస్తున్న స్వర్ణలత సూపర్‌వైజర్ అంటూ కార్మికులను దుర్భాషలాడుతూ ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయమై సూపరింటెండెంట్ స్వర్ణలత చెప్పిందే వినాలని ఆంక్షలు పెడుతూ ఇష్టం ఉంటే పనిచేయండి లేదంటే మానేయండంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ విషయమై వైద్య విధాన పరిషత్ అధికారులు స్పందించి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల కార్యదర్శి అంజనపెల్లి రామలింగం, గోగుల యాదగిరి, ఎస్‌కె.షమీం, జగన్, రహీం తదితరులు పాల్గొన్నారు.




## నాణ్యత లేని బిఇడి విద్యకు చెక్

### హాజరు లేకపోతే స్కాలర్షిప్ రద్దు

### ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బిఈడి విద్యలో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడాలని, 5 శాతం విద్యార్థుల హాజరును కచ్చితంగా అమలు చేయాలని ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పునరుద్ఘాటించారు.సోమవారం నల్లగొండ పరిధిలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని బిఈడి కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బిఈడి కళాశాలలో ప్రిన్సిపాల్‌తో పాటు కనీసం 10 మంది అధ్యాపకులను విధిగా నియమించాలని సూచించారు. అధ్యాపకుల నమోదును ఆధార్ లింక్ ద్వారా నిర్వహించాలని తెలిపారు.75 శాతం విద్యార్థుల హాజరును ఖచ్చితంగా అమలు చేయడానికి ఫేస్ రికగ్నిషన్ యంత్రాల వినియోగాన్ని తప్పనిసరి చేయాలని పేర్కొన్నారు.హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్,స్కాలర్షిప్‌ను నిలిపివేయాలని సూచించారు. విద్యార్థి విద్యలో సమగ్ర సంస్కరణలు అవసరమని తెలిపారు.ఆడిట్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మావేశంలో ఎంజీయూ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ వై. ప్రశాంతి,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి.వివిధ బిఈడి కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# దేశంలో అల్లర్లు జరిగే అవకాశం

## అప్రమత్తంగా ఉండాలని హోంశాఖ ఆదేశాలు




**న్యూఢిల్లీ :** ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధ ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పైనా పడే అవకాశాలపై కేంద్రం అప్రమత్తమైంది. దేశంలో ఎక్కడైనా సామాజిక, మత పరమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. శాంతి భద్రతలపై ప్రభావం చూపొచ్చన్న ఆందోళనల నేపథ్యంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక లేఖ రాసింది. ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య పెరుగుతున్న యుద్ధ వాతావరణం, అలాగే అమెరికా సంయుక్త రాష్ట్రాలు చేపట్టిన సైనిక చర్యల తర్వాత దేశంలో కొన్ని వర్గాలు భావోద్వేగాలకు లోనయ్యే అవకాశం ఉందని కేంద్రం పేర్కొంది. ఫిబ్రవరి 28న రాష్ట్రాలకు పంపిన లేఖలో అప్రమత్తంగా ఉండాలని, ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ముఖ్యంగా మతపరమైన సభలు, సమావేశాలు, ప్రసంగాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించింది.

**రెచ్చగొట్టే ప్రసంగాలపై నిఘా**

హోంశాఖ లేఖలో కీలకంగా ప్రస్తావించిన అంశం రెచ్చగొట్టే ప్రసంగాలు. కొన్ని తీవ్రవాద భావజాలం కలిగిన వ్యక్తులు విదేశీ పరిణామాలను ఉపయోగించుకుని ప్రజలను ప్రేరేపించే ప్రయత్నం చేయొచ్చని హెచ్చరించింది. ఇరాన్‌కు వ్యతిరేక భావజాలంతో ఉన్న కొంతమంది మత ప్రచారకులు ఉద్రిక్తతలు సృష్టించేలా ప్రసంగాలు చేసే అవకాశం ఉందని పేర్కొంది. ఇలాంటి ప్రసంగాలు స్థానికంగా సామాజిక కలహాలకు దారి తీసే ప్రమాదం ఉందని, అందుకే ముందుగానే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర యంత్రాంగాన్ని ఆదేశించింది. సోషల్ మీడియా వేదికల్లో కూడా పుకార్లు, తప్పుడు ప్రచారం వేగంగా వ్యాప్తి చెందే అవకాశముందని, వాటిని వెంటనే అరికట్టాలని సూచించింది.

**ఇంటెలిజెన్స్ భాగస్వామ్యం పెంచాలి**

రాష్ట్ర పోలీస్ విభాగాలు, స్థానిక ఇంటెలిజెన్స్ యూనిట్లు, కేంద్ర ఏజెన్సీల మధ్య సమన్వయం పెంచాలని కేంద్రం తెలిపింది. అనుమానాస్పద సమావేశాలు, గుంపులు, విద్వేషపూరిత పోస్టులు, విదేశీ నిధుల ప్రవాహం వంటి అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకునేలా కంట్రోల్ రూమ్లను సిద్ధంగా ఉంచాలని, సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించాలని ఆదేశాలు ఇచ్చింది.

## 'ఎఐ' సృష్టించిన నకిలీ తీర్పు ఆధారంగా జడ్జిమెంట్...

# ఎపి కింది కోర్టు ఆదేశాలపై 'సుప్రీం' విచారణ

### అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు నోటీసులు జారీ

**న్యూఢిల్లీ :** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సృష్టించిన నకిలీ, ఉనికిలో లేని తీర్పులపై ఆధారపడి కోర్టులు నిర్ణయం తీసుకోవడమనేది కేవలం పొరపాటు మాత్రమే కాదని, అది దుష్ప్రవర్తనకు, న్యాయపరమైన పర్యవసానాలకు దారితీస్తుందని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ పి.ఎస్.నర్సింహ్మా, జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ బెంచ్ ఈ విషయాన్ని లోతుగా పరిశీలిస్తుందని తెలిపింది. అటార్నీ జనరల్ ఆర్.వెంకట్ రమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ)కు నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో సహకరించేందుకు కోర్టు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్‌ను నియమించింది. దీనికి ముందు గతంలో ఒక వివాదాస్పద ఆస్తి విషయంలోఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. ఈ దావా విచారణకు వచ్చే వరకూ, వివాదాస్పద ఆస్తి సంబంధిత లక్షణాలను గమనించడానికి ట్రయల్ కోర్టు ఒక అడ్వకేట్‌కమిషనర్‌ను నియమించిందని ధర్మాసనం తెలిపింది. పిటిషనర్లు కొన్ని అభ్యంతరాలను లేవనెత్తడం ద్వారా అడ్వకేట్‌కమిషనర్ నివేదికను సవాల్‌చేశారని బెంచ్ ఎత్తిచూపింది. ఆగస్టులో జారీచేసిన తన ఉత్తర్వులో కోర్టు అభ్యంతరాలను తోసిపుచ్చిందని, ప్రక్రియలో కొన్ని తీర్పులను పరిగణనలోనికి తీసుకుని హైకోర్టును ఆశ్రయించగా కిందికోర్టు కృత్రిమ మేథ తో సృష్టించిన తీర్పులను పరిగణనలోనికి తీసుకుని తీర్పు ఇచ్చిందని గమనించింది. పిటిషనర్లు ట్రయల్ కోర్టు ఆదేశాన్ని సవాల్ చేస్తూ ప్రస్తావించబడిన, ఆధారపడిన తీర్పులు ఉనికిలో లేవని, నకిలీవని వాదించారు. హైకోర్టు అభ్యంతరాలను పరిగణనలోనికి తీసుకుని, తీర్పులు ఎఐతో రూపొందించబడివని హైకోర్టు గ్రహించిందని సుప్రీంకోర్టు పేర్కొంది. కోర్టులో వాదనలు విన్న తర్వాత హైకోర్టు ఈ కేసును యోగ్యత ఆధారంగా నిర్ణయించిందని, సివిల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసిందని, ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. కాగా హైకోర్టు ఆదేశాన్ని సవాల్ చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.' కేంద్ర న్యాయస్థానం కృత్రిమంగా సృష్టించబడిన, నకిలీ లేదా కృత్రిమంగా ఆరోపించబడిన తీర్పులను అమలు చేయసిందని మేం గ్రహించాం. తీర్పు ప్రక్రియపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్నందున పరిణామాలు, జవాబుదారీతనాన్ని పరిశీలించడానికి ప్రయత్నిస్తాం' అని ధర్మాసనం పేర్కొంది 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సృష్టించిన నకిలీ, ఉనికిలో లేని తీర్పులపై ఆధారపడి కోర్టులు నిర్ణయం తీసుకోవడమనేది కేవలం పొరపాటు మాత్రమే కాదని, అది దుష్ప్రవర్తనకు, న్యాయపరమైన పర్యవసానాలకు దారితీస్తుంది' అని ధర్మాసనం ఫిబ్రవరి 27న జారీచేసిన తన ఆదేశంలో తెలిపింది. జనవరిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ దాఖలైన ఇంజంక్షన్ దావాపై పిటిషన్ దాఖలుకాగా ఈ అంశాన్ని సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ కేసు మెరిట్ కేసుపై తీసుకున్న నిర్ణయం వల్ల కాకుండా, తీర్పు, నిర్ణయప్రక్రియకు సంబంధించినది కాబట్టి ఇది చాలా ఆందోళన కలిగిస్తుందని 'సుప్రీం' ధర్మాసనం పేర్కొంది. 'అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు నోటీసు జారీ చేయండి' అని అత్యున్నతన్యాయస్థానం రిజిస్ట్రీకి సూచించింది. అడ్వకేట్‌కమిషనర్ నివేదిక ఆధారంగా ట్రయల్ కోర్టు ముందుకు సాగకూడదని నిర్దేశిస్తున్నామని తేల్చిచెప్పింది. దీనిపై విచారణను మార్చి 10కి వాయిదా వేసింది. ఫిబ్రవరి 17న ఒక ప్రత్యేక కేసును విచారించిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం 'దయ వర్సెస్ మానవత్వం' వంటి ఉనికిలో లేని తీర్పులను కలిగి ఉన్న కృత్రిమ మేధ టూల్స్‌తో రూపొందించిన పిటిషన్లను దాఖలు చేసే న్యాయవాదుల ధోరణి పెరుగుతున్నట్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.




# కశ్మీర్‌లో రెండోరోజూ నిరసనలు

### పలు చోట్ల ఆంక్షలు, మొబైల్ ఇంటర్నెట్ వేగాన్ని తగ్గించిన అధికారులు



**శ్రీనగర్ :** ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యకు వ్యతిరేకంగా సోమవారం కశ్మీర్‌లోని అనేక ప్రాంతాల్లో కొత్త నిరసనలు వెల్లువెత్తాయి. ప్రజల కదలికలపై అధికారులు ఆంక్షలు విధించారు. మొబైల్ ఇంటర్నెట్ వేగాన్ని తగ్గించారు. శనివారం తెల్లవారుజామున అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త వైమానిక దాడుల్లో ఖమేనీ హత్యకు వ్యతిరేకంగా కశ్మీర్ లోయలో నిరసనలు చెలరేగడం ఇది రెండవ రోజు. నగరంలోని బెమినా, గుండ్ హస్సిభట్, జెహంగీర్ చౌక్ ప్రాంతాలలో, దక్షిణ కశ్మీర్‌లోనిని పుల్వామా పట్టణంలో నిరసనలు చెలరేగాయని అధికారులు తెలిపారు. షియా జనాభా ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతాలలో డజన్ల కొద్దీ నిరసనకారులు ఒక చోటుకు చేరి అమెరికా, ఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలు చేస్తూ వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. కొన్ని ప్రాంతాలలో నిరసనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు స్వల్పంగా లాఠీచార్జ్ చేశారు. నిరసనల దృష్ట్యా, కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలలో ప్రజల కదలికలపై తీవ్రమైన ఆంక్షలు విధించారు. లాల్ చౌక్‌లోని ఐకానిక్ ఘంటా ఘర్ చుట్టూ బారికేడ్లు నిర్మించి మూసివేసినట్లు అధికారులు తెలిపారు. నిరసనకారులు గుమిగూడకుండా నిరోధించడానికి నగరం అంతటా పెద్ద సంఖ్యలో పోలీసులు, పారామిలిటరీ సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని మోహరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ముందు జాగ్రత్త చర్యగా ఆంక్షలు విధించినట్లు అధికారులు తెలిపారు. నగరంలోకి దారితీసే ముఖ్యమైన కూడళ్లలో కాన్సర్టినా వైర్లు, బారికేడ్లను ఉంచినట్లు వారు తెలిపారు. లోయలోని ఇతర జిల్లాల్లోని షియా ప్రాబల్య ప్రాంతాలలో ఈ తరహా ఆంక్షలు విధించారు. ముతాహిదా మజ్లిస్–ఎ–ఉలమా (ఎంఎంయు) చైర్మన్ మీర్‌వైజ్ ఉమర్ ఫరూక్ ఇచ్చిన ఒకరోజు సమ్మె పిలుపు నేపథ్యంలో ఈ ఆంక్షలు అమలు చేస్తున్నారు. ప్రజలు ఐక్యత, గౌరవం, పూర్తి శాంతియుతంగా దీనిని పాటించాలని తాము కోరుతున్నామని మీర్‌వైజ్ అన్నారు. ఎంఎంయు సమ్మె పిలుపుకు ప్రతిపక్ష పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీతో సహా అనేక రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయి. 'ఇరాన్ సుప్రీం లీడర్ మీర్‌వైజ్ ఉమర్ ఫరూక్ బలిదానంపై మీర్‌వైజ్ ఉమర్ ఫరూక్ ఇచ్చిన బంద్ పిలుపుకు పూర్తి మద్దతు, సంఘీభావాన్ని తెలియజేస్తున్నాము. అన్యాయం మొత్తం ముస్లిం ఉమ్మా, సత్యం కోసం నిలబడే వారందరినీ ఎక్కడైనా గాయపరుస్తుందని ప్రపంచానికి గుర్తు చేయడానికి ఇది సంతాప దినం' అని మెహబూబా అన్నారు. విద్యార్థుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందు జాగ్రత్త చర్యగా, అధికారులు ప్రైవేట్ పాఠశాలలతో సహా అన్ని విద్యా సంస్థలను రెండు రోజుల పాటు మూసివేసారు. శాంతిభద్రతలను కాపాడటానికి ముందు జాగ్రత్త చర్యగా, కశ్మీర్ అంతటా మొబైల్ ఇంటర్నెట్ వేగాన్ని తగ్గించారు. సుమారు 15 లక్షల మంది షియాలు ఉన్న కశ్మీర్ ఆదివారం లాల్ చౌక్, సైదా కదల్, బుద్గామ్, బండిపోరా, అనంతనాగ్, పుల్వామాలో ప్రధాన నిరసనలు జరిగాయి.

# 14 మంది జెఎన్‌యు విద్యార్థుల విడుదల



**న్యూఢిల్లీ :** ఎఐ సమ్మిట్ సందర్భంగా గత వారం అర్ధనగ్న నిరసన ప్రదర్శనగా తెలియజేయడంతో అరెస్టు చేసిన 14 మంది జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) విద్యార్థులను విడుదల చేసినట్లు విద్యార్థి నాయకులు తెలిపారు. ఈ పరిణామం విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఉపశమనం కలిగించిందని అన్నారు. విడుదల చేసిన వారిలో జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షురాలు అదితి మిశ్రా, ఉపాధ్యక్షురాలు గోపికా కె బాబు, సంయుక్త కార్యదర్శి డానిష్ అలీ, జెఎన్‌యుఎస్‌యు మాజీ అధ్యక్షుడు నితీష్ కుమార్, ఎఐఎస్‌ఎ ఆల్ ఇండియా అధ్యక్షురాలు నేహా తదితరులు ఉన్నారు. ఇటీవల జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) క్యాంపస్‌లో జరిగిన నిరసన ప్రదర్శనకు సంబంధించి అరెస్టు చేసిన 14 మంది విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని ఢిల్లీ కోర్టు ఆదివారం ఆదేశించింది. పోలీసు సిబ్బందిపై దాడి చేయడం తీవ్రమైన నేరం అయినప్పటికీ, నిందితులు విద్యార్థులు అని పేర్కొంటూ ఫిబ్రవరి 27న కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఫిబ్రవరి 26న జెఎన్‌యు విద్యార్థి యూనియన్ (జెఎన్‌యుఎస్‌యు) సభ్యులు క్యాంపస్‌లోని సబర్మతి టిపాయింట్ వద్ద సమావేశమై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనల అమలు, విద్యార్థి సంఘం ఆఫీస్ బేరర్ల తొలగింపు, ప్రతిపాదిత రోహిత్ వేముల చట్టంపై యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలలో భాగంగా విద్యా మంత్రిత్వ శాఖ వైపు వెళ్లడానికి ప్రయత్నించడంతో వారిని అరెస్టు చేశారు. అయితే, పోలీసు సిబ్బంది భారీగా బారికేడ్లు ఉన్న విశ్వవిద్యాలయ గేట్ల వద్ద నిరసనకారులను అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. విద్యార్థులు భౌతిక దాడికి పాల్పడ్డారని, ఘర్షణ సమయంలో అనేక మంది సిబ్బంది గాయపడ్డారని, ఆ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయబడిందని ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. మొత్తం 51 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. నిర్బంధంలో ఉన్న వారిలో చాలామంది వివిధ రాష్ట్రాలకు చెందిన వారు మరియు విశ్వవిద్యాలయ హాస్టళ్లలో నివసిస్తున్నారని వారు తెలిపారు. కాగా, విద్యార్థుల విడుదల విద్యార్థుల ఉద్యమానికి విజయం అని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) ఒక ప్రకటనలో పేర్కొంది. ఉన్నత విద్యలో సమానత్వ రక్షణలను అమలు చేయడం, జాతీయ విద్యా విధానం ప్రకారం పలుచన చేయబడిన కోర్సులను వెనక్కి తీసుకోవడం వంటి వారి డిమాండ్లు నెరవేరే వరకు నిరసనలు కొనసాగుతాయని వారు తెలిపారు.

## ఓటర్ల తొలగింపులో ఇసి–బిజెపికి మధ్య సంబంధం

### ఎన్నికల కమిషన్‌పై మమతా బెనర్జీ ఆగ్రహం



**కోల్‌కతా:** ఎన్నికల కమిషన్‌పై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) తరువాత ప్రకటించిన జాబితాలో భారీగా ఓట్లు తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజమైన ఓటర్లు ఓటు హక్కు వినియోగించకోకుండా వారిని జాబితా నుంచి తొలగించడం, రానున్న అసెంబ్లీ ఎన్నికలలో కాషాయ పార్టీకి సహాయం చేయడానికి ఎన్నికల సంఘం, బిజెపి మధ్య సంబంధం ఉందని ఆరోపించారు. ఎన్నికలలో ఎన్నికల సమతుల్యతను తనకు అనుకూలంగా మార్చడానికి బిజెపి, ఇసి ఉద్దేశపూర్వకంగా తొలగింపులు చేసిందని పేర్కొన్నారు. 'ఎన్నికల సంఘం ఉద్దేశపూర్వకంగా నిజమైన ఓటర్లను తొలగించింది. నేను షాక్ అయ్యాను. ఇది చాలా విచారకరమైన, అమానవీయ పరిస్థితి' అని ఆమె అన్నారు. సర్ తర్వాత జాబితాలో 63.66 లక్షల ఓటర్లను తొలగించారని, ఇది ఓటర్లలో 8.3 శాతం అని, మొత్తం ఓటర్ల సంఖ్య 7.04 కోట్లకు కొద్దిగా తగ్గిందన్నారు. 60.06 లక్షలకు పైగా ఓటర్లు ఇంకా విచారణలోనే ఉన్నారన్నారు. తన సొంత నియోజకవర్గమైన భబానీపూర్‌లో కూడా భారీ తొలగింపులు జరిగాయని పేర్కొంటూ, సవరణ స్థాయితో సంబంధం లేకుండా తాను విజయం సాధిస్తానని బెనర్జీ స్పష్టం చేశారు.

# ఎస్‌బిఎల్ ఎనర్జీ లిమిటెడ్ నిర్లక్ష్యం వల్లే...

*• పేలుడు పదార్థాల తయారీదారు భద్రతా చర్యలు పాటించలేదు • ప్రాథమిక విచారణలో వెల్లడి : మంత్రి బవాంకులే*



**నాగ్‌పూర్:** మహారాష్ట్ర నాగ్‌పూర్‌కు చెందిన ఎస్‌బిఎల్ ఎనర్జీ లిమిటెడ్ నిర్లక్ష్యం కారణంగానే 19 మంది ప్రాణాలు కోల్పోయారని, పేలుడు పదార్థాల తయారీదారు భద్రతా చర్యలు పాటించలేదని ప్రాథమికంగా తేలిందని మహారాష్ట్ర మంత్రి చంద్రశేఖర్ బవాంకులే తెలిపారు. పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పెసో), పారిశ్రామిక భద్రత, ఆరోగ్య డైరెక్టరేట్ (డిష్), కార్మిక కమిషనరేట్ కూడా ఈ ప్రాంతంలోని పేలుడు పదార్థాల తయారీ యూనిట్లలో భద్రతా పద్ధతులను నిర్ధారించడంలో విఫలమయ్యాయని, వాటి జవాబుదారీతనాన్ని పరిష్కరించాలని బవాంకులే మీడియాకు చెప్పారు. జిల్లాలోని కటోల్ తహసీల్‌లోని రౌల్‌గావ్ మైనింగ్, పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ సంస్థ అయిన ఎస్‌బిఎల్ ఎనర్జీ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఆదివారం జరిగిన పేలుడులో 19 మంది మరణించగా, 23 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో 13 మంది పరిస్థితి విషమంగా ఉందని జిల్లా మంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.75 లక్షలు, గాయపడిన వారికి రూ.25 లక్షల పరిహారం చెల్లిస్తామని ఆయన చెప్పారు. అంతేకాకుండా, కేంద్రం రూ. 2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలు మృతుల కుటుంబాలకు అందజేస్తుందని బవాంకులే తెలిపారు. ఈ ఘటనలో శారీరక వైకల్యం ఉన్నవారికి పునరావాస ప్యాకేజీని కూడా రూపొందిస్తామని ఆయన తెలిపారు. ఎస్‌బిఎల్ ఎనర్జీ లిమిటెడ్ డిటోనేటర్ అసెంబ్లీ ప్లాంట్‌లో పేలుడు సంభవించిందని మంత్రి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి రాష్ట్ర మంత్రి ఆశిష్ జైస్వాల్, రాంటెక్ ఎంపి శ్యామ్ కుమార్ బార్వే, కటోల్ ఎమ్మెల్యే శరద్ సింగ్ ఠాకూర్, డివిజనల్ కమిషనర్, జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, పెసో, డిష్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ ఘటనకు సంబంధించి పేలుడు పదార్థాల తయారీ సంస్థకు చెందిన తొమ్మిది మంది డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. పేలుడు పదార్థాల కంపెనీ నిర్లక్ష్యం వహించిందని, భద్రతా చర్యలు సరిగ్గా పాటించలేదని ప్రాథమిక నివేదిక (భద్రతా సంస్థల ద్వారా) సూచించిందని బవాంకులే అన్నారు. ఒక నెలలో వివరణాత్మక నివేదిక అందుతుందన్నారు. కంపెనీతో పాటు, పెసో, డిష్ అధికారులు, లేబర్ కమిషనర్ కూడా జవాబుదారీతనంగా ఉండాలని సమావేశంలో నిర్ణయించినట్లు రెవెన్యూ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా వారు తనిఖీ విధులు, భద్రతా చర్యలను సరిగ్గా పాటించలేదని, అందువల్ల, డివిజనల్ కమిషనర్, కలెక్టర్, ఎస్‌పి బాధ్యతను నిర్ణయిస్తారని, అవసరమైతే, భద్రతా సంస్థల అధికారులపై కేసులు నమోదు చేస్తారని ఆయన అన్నారు.

## ఇపిఎఫ్ వడ్డీ 8.25 శాతంగా కొనసాగింపు




**న్యూఢిల్లీ :** ఉద్యోగ భవిష్య నిధి (ఇపిఎఫ్)పై ఇచ్చే వడ్డీని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) 8.25 శాతంగా కొనసాగించాలని ఇపిఎఫ్ఒ నిర్ణయించింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ నేతృత్వంలో జరిగిన 239వ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీల (సిబిటి) సమావేశంలో సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలోనూ ఇంతే వడ్డీరేటు అందించగా.. ఈసారి కూడా ఎలాంటి మార్పులు చేయకపోవడం గమనార్హం. "2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను భవిష్య నిధి చందాదారుల నిధిపై 8.25% వడ్డీ రేటు జమ చేయాలని సోమవారం జరిగిన సమావేశంలో సిబిటి నిర్ణయించింది" అని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. వడ్డీ రేటుకు సంబంధించి సిబిటి ప్రతిపాదనను కేంద్ర ఆర్థికశాఖకు పంపనున్నారు. ప్రభుత్వం అధికారికంగా వడ్డీరేటును నోటిఫై చేశాక, ఇపిఎఫ్ చందాదారు ఖాతాలకు వడ్డీ మొత్తం జమవుతుంది. ప్రస్తుతం ఇపిఎఫ్ఒలో 7 కోట్ల మందికిపైగా చందాదారులున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో భవిష్య నిధిపై వడ్డీ రేటు 8.15 శాతం కాగా, 2023–24లో 8.25 శాతానికి పెంచారు. అప్పటి నుంచి అదే వడ్డీరేటును కొనసాగిస్తున్నారు. నిస్తేజంగా ఉన్న ఖాతాల్లోని ఇన్ క్లెయిమ్డ్‌డిపాజిట్లకు సంబంధించి కూడా సిబిటి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. తొలి దశలో రూ.వెయ్యి కంటే తక్కువ మొత్తాలు కలిగిన 1.33 లక్షల ఖాతాలను గుర్తించారు. మొత్తం రూ.5.68 కోట్లను సెటిల్ చేయనున్నారు.

# గగనతలాల మూసివేత

**న్యూఢిల్లీ :** ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ సైనిక ఘర్షణ నేపథ్యంలో చాలా పశ్చిమాసియా దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. ఈ జాబితాలో ఇరాన్, ఇజ్రాయెల్‌తో పాటు ఇరాక్, సిరియా, ఖతర్, బహ్రెయిన్, కువైట్ ఉన్నాయి. ఇక పాక్షికంగా గగనతలాన్ని మూసివేసిన దేశాల లిస్టులో యుఎఇ, సౌదీ అరేబియా, జోర్డాన్ ఉన్నాయి. ఇరాన్, ఇరాన్ సమర్థిత మిలిటెంట్లు అరబ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలతో పాటు ఎయిర్ పోర్టులు, హోటళ్లపైనా డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులు చేస్తున్నారు. దీంతో దుబాయ్, అబుదాబి, దోహా సహా గల్ఫ్ దేశాల్లోని చాలా ఎయిర్‌పోర్టులను మూసివేశారు. 1,000కిపైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. దీనివల్ల ప్రతిరోజు సగటున 90వేల మంది ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో వేలాది మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయారు. వీరిలో ఉద్యోగాలు చేస్తున్న వారు, టెక్ నిపుణులు, విద్యార్థులు, పర్యాటకులు ఉన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధం విస్తరిస్తున్న తరుణంలో అక్కడున్న భారతీయుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.



# ఆయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి

### భారతీయ మెరైన్ మృతి



**మస్కట్:** ఒమన్ తీరంలో ఆయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు చెలరేగాయి. ఈ దాడిలో భారతీయుడైన మెరైన్ సిబ్బంది మరణించినట్లు ఒమన్ ధృవీకరించింది. ఆయిల్ ట్యాంకర్‌లోని మిగతా సిబ్బందిని రెస్క్యూ చేసినట్లు పేర్కొంది. అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ఇరాన్ ధీటుగా స్పందిస్తున్నది. ప్రతి దాడులకు పాల్పడుతున్నది. ఈ నేపథ్యంలో ఒమన్ సముద్ర జలాల్లో ఉన్న మార్షల్ దీవులకు చెందిన ఆయిల్ ట్యాంకర్ ఎంకెడి వియోమ్‌పై ఈనెల1న డ్రోన్ దాడి జరిగింది. ప్రధాన ఇంజిన్ గదిలో పేలుడు సంభవించడంతో మంటలు చెలరేగాయి. కాగా, ఆ ఆయిల్ ట్యాంకర్‌లో 21 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 16 మంది భారతీయులు, నలుగురు బంగ్లాదేశీయులు, ఒకరు ఉక్రేనియన్. అయితే డ్రోన్ బాంబు దాడి వల్ల జరిగిన పేలుడులో భారత్‌కు చెందిన ఒక మెరైన్ సిబ్బంది మరణించినట్లు ఒమన్ అధికారులు సోమవారం ధృవీకరించారు. మృతుడి వివరాలను వెల్లడించలేదు. ప్రాణాలతో బయటపడిన మిగతా వారిని పనామాకు చెందిన కార్గో షిష్‌లోకి తరలించినట్లు వివరించారు.

# బంగ్లాదేశ్ ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవి

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో కొత్తగా కొలువుదీరిన బిఎన్‌పి ప్రభుత్వం పార్లమెంటులో డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇచ్చేందుకు సిద్ధపడింది. కొత్తగా ఎన్నికైన పార్లమెంటు మొదటి సమావేశం త్వరలోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో,దేశంలో శాంతి,సుస్థిరత, సర్వసమానత్వ భావన, ఆర్థిక సమస్యల పరిష్కారం వంటి సమస్యల పరిష్కారానికి అధికార ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సి ఉందని ప్రధానమంత్రి తారిఖ్ రెహ్మాన్ గట్టి అభిప్రాయంతో ఉన్నారు. ఈ ఆదాన ప్రదానాలలో భాగంగా డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వజూపారు. హోంమంత్రి సలాహుద్దీన్ అహ్మద్ సోమవారం ఈ విషయం చెబుతూ, జులై నేషనల్ ఛార్టర్‌ను తమ ప్రభుత్వం ఎంతో గౌరవిస్తోందని, దానిని అమలు చేసే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏకాభిప్రాయం ద్వారా రాజకీయ అవగాహనకు వచ్చి ఈ ఛార్టర్‌ను అమలు చేస్తామన్నారు. జులై ఛార్టర్‌ను అవమానించిన దేశాధ్యక్షుడిని పదవీచ్యుతుణ్ణి చేయాలని కోరుతూ న్యాయస్థానంలో దాఖలైన రిట్ పిటిషన్ గురించి పాత్రికేయులు ప్రశ్నించగా అలాంటి రిట్ పిటిషన్ గురించి తనకు తెలియదన్నారు.

# అరుణాచలం, మధురైకి హైదరాబాద్ నుంచి రెగ్యులర్ రైళ్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ ప్రయాణికులకు రైల్వే బోర్డు శుభవార్త వినిపించింది. హైదరాబాద్, కాచిగూడ నుంచి రాకపోకలు సాగించే రెండు ప్రత్యేక, వీక్లీ రైళ్లను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనలకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఫలితంగా తమిళనాడులోని పలు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించాలనుకునే వారికి మరింత మెరుగైన కనెక్టివిటీని కల్పించినట్టయింది.

**కాచిగూడ– నుంచి తూత్తుకూడి వరకు..**

కాచిగూడ నుంచి మధురై వరకు మాత్రమే నడుస్తోన్న ఈ రైలును ఇకపై తూత్తుకూడి (ట్యుటికోరిన్) వరకు పొడిగించారు. కాచిగూడ మధురై స్పెషల్ ఎక్స్ ప్రెస్ 07191/07192 కు రెగ్యులర్ సర్వీస్ నంబర్ కేటాయించారు. దీని కొత్త నంబర్ 17615/17616 కాచిగూడ తుత్తుకుడి ఎక్స్‌ప్రెస్‌గా రూపుదిద్దుకుంది. కాచిగూడ మధురై ప్రత్యేక రైలు సమయాల్లో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కాచిగూడ నుండి బయలుదేరే నంబర్ 17615 ఎక్స్‌ప్రెస్ మరుసటి రోజు రాత్రి 10:45 నిమిషాలకు తూత్తుకుడికి చేరుకుంటుంది. ప్రతి బుధవారం ఉదయం 7:45 నిమిషాలకు తూత్తుకుడి నుండి బయలుదేరే నంబర్ 17616 ఎక్స్ ప్రెస్ గురువారం మధ్యాహ్నం 1:25 నిమిషాలకు కాచిగూడకు చేరుకుంటుంది. షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల్, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె రోడ్, పీలేరు, పాకాల, చిత్తూరు, కాట్పాడి, వెల్లూరు కంటోన్మెంట్, తిరువణ్ణామలై (అరుణాచలం), విల్లుపురం, పన్రుటి, కడలూరు పోర్ట్, చిదంబరం, సర్కాజీ, మైలాడుతురై, కుంభకోణం, పాపనాశం, తంజావూరు, తిరుచిరాపల్లి, దిండిగల్, మధురై, విరుదునగర్, సత్తూర్, కోవిల్పట్టి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

**హైదరాబాద్ నుంచి– కన్యాకుమారి..**

నంబర్ 07229/07230 హైదరాబాద్ కన్యాకుమారి మధ్య రాకపోకలు సాగిస్తోన్న ప్రత్యేక రైలు కూడా రెగ్యులర్ సర్వీస్ అయింది. వీటి నంబర్ 17069/17070గా మారింది. హైదరాబాద్ నుండి ప్రతి బుధవారం సాయంత్రం 5:20 నిమిషాలకు బయలుదేరే నంబర్ 17069 ఎక్స్ ప్రెస్ రెండో రోజు వేకువ జామున 2:30 గంటలకు కన్యాకుమారికి చేరుకుంటుంది.

# ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ఆటవిక యుద్ధం

ఇరాన్ అణు కార్యక్రమంపై ఒకవైపు ఒమన్ మధ్యవర్తిత్వంతో చర్చలు జరుగుతుండగానే, రెండ్రోజుల్లో ఒప్పందంపై సంతకాలు జరుగుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతుండగానే అమెరికా, దాని తొత్తు ఇజ్రాయెల్ సైనిక దళాలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ముందుగా ఎంపిక చేసుకున్న లక్ష్యాలపై బాంబులవర్షం కురిపించటం అంతర్జాతీయ రాజకీయ వ్యవస్థలో బందిపోటుతనానికి నిదర్శనం. కొన్ని మాసాల క్రితం అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఇరాన్ అణుశక్తి పరిశోధనా కేంద్రాలపై బాంబులు వేసి కొంత నష్టం కలుగజేశాయిగాని పూర్తిగా ధ్వంసం చేయలేకపోయాయి. ఆ తదుపరి యుఎఇ, ఒమన్ వంటి అరబ్ రాజ్యాల చొరవతో అమెరికా – ఇరాన్ మధ్య అణుచర్చలు జరుగుతున్నాయి. అవి ఫలప్రదమైతే ట్రంప్–నెతన్యాహుల 'ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు' వ్యూహం నెరవేరదు. అందుకే ట్రంప్ అధికారం మార్పుకు పిలుపు ఇచ్చాడు – అంతర్గత నిరసనకారుల ఆందోళనకు మద్దతు ఇస్తూ 'మీ వెనుక మేమున్నాం' అని భరోసా ఇచ్చారు. ఇరాన్ ప్రభుత్వం హింసను ప్రయోగించి ఆ నిరసనలను అణచివేసింది.

ఈ నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ శనివారం టెహరాన్, ఇతర కీలక లక్ష్యాలపై అప్రకటిత యుద్ధానికి దిగి బాంబుదాడులకు ఒడిగట్టాయి. ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ నివాస ప్రాసాదాలపై బాంబులు వేయటంలోనే ట్రంప్–నెతన్యాహు దుష్టబుద్ధి బహిర్గతమైంది. ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులు, మరికొందరు ఉన్నతాధికారులు బాంబు ప్రేలుళ్లలో హతులైనట్లు మరునాడు ధృవీకరణ జరిగింది. ట్రంప్ ఆశించినట్లు ఇరాన్ ప్రభుత్వం కుప్పకూలలేదు, ప్రజలు తండోపతండాలుగా వీధుల్లోకి వచ్చి అమెరికా అనుకూల ప్రదర్శనలు చేయలేదు. అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌లలో లాగా బలప్రయోగం ద్వారా ఇరాన్‌లో అధికారమార్పిడి జరగలేదు – అంటే అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పడలేదు. ఇరాన్ అణుకార్యక్రమం పశ్చిమాసియాలో తమ ప్రయోజనాలకు ముప్పు అని ట్రంప్, తమ దేశం ఉనికికి ప్రమాదకరమని ఇజ్రాయెల్ టెర్రరిస్టు ప్రధాని నెతన్యాహూ కుంటిసాకులతో తమ యుద్ధోన్మాదాన్ని ప్రపంచంముందు సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఇరాన్ అణు కార్యక్రమాన్ని చూపి ట్రంప్, నెతన్యాహు విద్రోహచర్యలకు పాల్పడటం ఇది మొదలుకాదు. ఇరాన్ అణుబాంబు తయారు చేయకుండా నిరోధించేందుకు అమెరికా, రష్యా, చైనా తదితర అరడజను అగ్రరాజ్యాలు 2015లో సాధించిన అంతర్జాతీయ ఒప్పందం నుంచి ట్రంప్ తన తొలి అధ్యక్ష పదవీకాలంలో–2018లో అమెరికాను ఉపసంహరించుకుని వెన్నుపోటు పొడిచాడు. 2025 జూన్‌లో, ఇరాన్ అమెరికాతో చర్చలు జరుపుతుండగా, ఇజ్రాయెల్ ఏకపక్షంగా దాడులకు పాల్పడింది – అది 12రోజుల యుద్ధంగా పరిణమించింది. ఈ పర్యాయం, అణుబాంబు తయారుచేయబోమని, అణుశక్తి పరికరాలు నిల్వచేయబోమని ఇరాన్ హామీ ఇచ్చే ప్రాతిపదికపై అమెరికాతో ఒప్పందం కుదరబోతోందని ఒమన్ విదేశాంగమంత్రి బదర్ ఫిబ్రవరి 27న ప్రకటించగా, ఆ మరునాడే అమెరికా, ఇజ్రాయెల్ బాంబుదాడులకు ఒడిగట్టటంలో స్పష్టత – వారికి కావలసింది శాంతి ఒప్పందం కాదు, ప్రభుత్వం మార్పు. ఇరాన్ ప్రజలకు 'స్వేచ్ఛ' కల్పించేందుకు దాడిచేసినట్లు ట్రంప్, ఇరాన్ దాడిని ముందుగా వమ్ము చేయటానికి దాడికి పాల్పడినట్లు నెతన్యాహు కల్లబొల్లి ప్రకటనలు ప్రపంచాన్ని మోసగించలేవు. ఈ దాడి ఆటవికమైనది, దురుద్దేశపూర్వకమైన బందిపోటు చర్య, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమైన బలప్రయోగం.

పర్యవసానం? ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఏడెనిమిది గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, ఆయిలు కేంద్రాలు లక్ష్యంగా డ్రోన్‌లు, క్షిపణులు ప్రయోగిస్తూ ప్రతీకారంతో రగిలిపోతోంది. ఇరాన్ దాడులు జెరూసలెంను తాకాయి. మరోవైపున అమెరికా తరఫున యుద్ధంలో చేరిన బ్రిటన్‌కు సైప్రస్ (యూరప్)లో ఉన్న నావికా స్థావరంపై దాడిచేసి యుద్ధ విస్తరణకు సైతం తాము సిద్ధమన్న సంకేతం ఇచ్చింది. ఆయిలు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధిని మూసివేసింది. అమెరికా యుద్ధ నౌకలకు ఆయుధాలు తీసుకెళుతున్న భారీ ఓడను క్షిపణులతో ధ్వంసం చేసింది. అమెరికా, ఇజ్రాయెల్ ప్రతిదాడులు చేస్తున్నాయి. గల్ఫ్‌లోని అమెరికా సైనికదళ స్థావరాలను ధ్వంసం చేయటం తమ లక్ష్యంగా ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ తమ దేశాలపై దాడులు ఆపకపోతే ఆత్మరక్షణ చర్యలు తీసుకుంటామని అరడజను గల్ఫ్‌రాజ్యాలు సోమవారం హెచ్చరించాయి.

ట్రంప్ ఐక్యరాజ్యసమితిని, ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలను లక్ష్యపెట్టకుండా 'ప్రపంచ నియంత'గా యుద్ధోన్మాదిగా వ్యవహరిస్తున్నాడు. అమెరికా–ఇరాన్ యుద్ధం ఆగకపోతే ప్రపంచవ్యవస్థ తలక్రిందులవుతుంది. అప్పుడే మొదలైన ఆయిలు ధరలు పెరుగుదల మరింతగా రెక్కలు తొడిగి ఆర్థిక వ్యవస్థలు అల్లకల్లోలమవుతాయి. అంతర్జాతీయ నౌకా, విమాన ప్రయాణాలకు విఘాతం ఏర్పడి ప్రపంచంలో సంక్షోభం ఆవహిస్తుంది. కోవిడ్ తర్వాత పడుతూ లేస్తూ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆర్థిక వ్యవస్థలు మళ్లీ మాంద్యంలో కూరుకుపోతాయి. అందువల్ల ఈ యుద్ధాన్ని తక్షణం ఆపాలి. అమెరికా చర్చలకు రావాలి. ఇరాన్ విదేశాంగమంత్రి ఉదయాన్నే చర్చలు ప్రతిపాదించినట్లు, రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మధ్యాహ్నం తిరస్కరించినట్లు పరస్పర విరుద్ధ వార్తలువచ్చాయి. ఇరాన్ నాయకత్వంలో పలువురు ప్రముఖులు మరణించినందున పాలకులు కూడదీసుకునే అవకాశమివ్వాలి. ఇరాన్‌తో భారత్‌కు సాంప్రదాయకంగా, అధునాతనకాలంలో సత్సంబంధాలున్నప్పటికీ ఈ సంక్షోభ సమయంలో వారికి మద్దతుగా ప్రధాని మోదీ నోరు మెదపలేకపోవటం మన దేశం దురవస్థ. ఫిబ్రవరి 26, 27 తేదీల్లో ప్రధాని ఇజ్రాయెల్ వెళ్లి ఆలింగన దౌత్యం నెరపటం దేశం పరువు తీసింది. అలీనోద్యమానికి నాయకత్వం వహించిన దేశం బిజెపి పాలనలో అమెరికా, ఇజ్రాయెల్‌కు లొంగిపోవటం అవమానకరం. కొరగాని హితవులు మాని క్రియాశీల వైఖరులు తీసుకోవటమే వర్ధమాన ప్రపంచంలో భారత్ ప్రతిష్టను ఇనుమడింపజేస్తుంది. ●



## జెఎన్‌యు కులతత్వ విసి రాజీనామా చేయాలి

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, యుజిసి సమానత్వ నిబంధనల అమలు కోసం జెఎన్‌యులో ఒక ఉద్యమం ప్రారంభమైంది. అయితే, మా వైస్ ఛాన్సలర్ ఈ నిబంధనలు అసంబద్ధమైనవి అని పేర్కొన్నారు.. మేము మూడు డిమాండ్లతో విద్యా మంత్రిత్వ శాఖ కార్యాలయానికి ప్రదర్శనగా బయలుదేరాం. యుజిసి సమానత్వ నియంత్రణ అమలు, మా కులతత్వ విసి రాజీనామా, విశ్వ విద్యాలయ నిధులపై కోతలను నిలిపి వేయడం.. మేము సబర్మతి టి – పాయింట్‌కు చేరుకున్నప్పుడు, విశ్వవిద్యాలయ గేటు గొలుసులతో మూసివేసినట్లు చూశాం. మేము ఆ తాళాలను పగలగొట్టాము, రాత్రికి రాత్రే, క్యాంపస్ ఒక కంటోన్మెంట్‌లాగా మారిపోయింది. ప్రభుత్వం విద్యార్థులను నేరస్థులుగా ముద్ర వేయడానికి నిశ్చయించుకుంది, విద్యార్థులను అదుపులోకి తీసుకుని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినప్పటికీ, మేము మా పోరాటాన్ని కొనసాగించాము.

– జెఎన్‌యు విద్యాసంఘం అధ్యక్షురాలు అదితి మిశ్రా



## దుష్టశక్తుల్ని దహనం చేస్తూ రంగుల పండుగ చేసుకుందాం!

హోలికా దహన్ చెడుపై మంచి లేదా రాక్షసత్వంపై మానవత్వం గెలిచిన రోజుగా హిందూ సమాజం భక్తిపూర్వకంగా మహదానందంతో జరుపుకుంటుంది. జీవితంలో అహంకారం, దుష్టశక్తుల రూపంలో వచ్చే కష్టనష్టాలనే చీకట్లను కాల్చివేస్తూ భక్తి, దేవుడి పై నమ్మకం, మంచి వెలుతురు వైపు నడిచే రోజుగా హోలికా దహన పర్వదినాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. 03 మార్చిన రాత్రి ప్రదోష వేళల్లో హోలికా దహనం, 04 మార్చి ఉదయం హోలీ రంగుల పండుగను జరుపుకోవడం కొనసాగుతూ వస్తున్నది. ఒడిసా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో హోలీకి ముందు రోజు డోల్ పూర్ణిమ వేడుకలను జరుపుకుంటూ కృష్ణుడు, రాధల విగ్రహాలను తీసుకువచ్చి, రంగు ధూళితో మసకబార్చి, వీధుల నిండా ముగ్గులు వేసి పర్వదిన ప్రేమామృత సారాన్ని ఆస్వాదిస్తారు. ఈ ఏడాది 03 మార్చి రోజున చంద్రగ్రహణం కూడా ఏర్పడనుందని గమనించాలి.

**హోలికా (భోగి మంటలు) దహన పర్వదినం :** హోలికా దహనంతో దుష్టశక్తులు, వ్యాధుల వ్యాప్తి, ఆర్థిక ఇబ్బందులను కాల్చి బూడిదచేసే మంటలుగా హోలికా దహనాన్ని నిర్వహిస్తూ ఎండు కర్రలు, పిడకలు, ఎండు ఆకులు లాంటివి వేసి మండిస్తూ, ఆ మంటల చుట్టు సంతోషంగా నాట్యాలు, ప్రదక్షిణలు/ప్రార్థనలు చేయడం, హోలికా బొమ్మను మంటల్లో వేసి దుష్టశక్తులను దహనం చేయడం సాంప్రదాయంగా వస్తున్నది. పుష్కలంగా పంట దిగుబడి రావాలని, చీడపీడలు తొలిగి పోవాలని రైతులు వేడుకుంటారు. హోలికా మంటలు పర్యావరణ శుద్ధికి, వ్యాధి కారక చెడు సూక్ష్మ జీవుల దహనానికి, ఆ బూడిదను ఒంటికి పూసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరగడానికి కూడా సహకరిస్తాయని నమ్ముతారు. చలికాలం పోతూ వసంత రుతువు ఆగమనానికి గుర్తుగా కూడా ఈ పండుగను పరమానందంతో భక్తిపూర్వకంగా వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. హోలికా దహనం రోజున మంటల్లో హోలికా బొమ్మను కూడా దహనం చేస్తూ చెడు ను పారద్రోలడం ఒక సదాచారం.

**హోలీ రంగుల పర్వదినం:** భారత్‌లో ప్రతి ఏట ఫాల్గుణ మాస పౌర్ణమి పుణ్య గడియల్లో మార్చి 04, 2026న హోలీ పండుగను పెద్ద ఎత్తున నిర్వహించుకోవడం జరుగుతున్నది. హోలీ పండుగ ముందు రోజు 03 మార్చి 2026న హోలికా దహనం నిర్వహిస్తారు. హోలీ పండుగ రోజు సరదాగా రంగులు చల్లుకుంటూ ఆనందంగా అందరూ కలిసి సంబరాలను చేసుకుంటారు. చెడుపై మంచి విజయం, శీతాకాల ముగింపును హోలీ సూచిస్తుంది. హోలీ రోజు ఉదయం రంగు పొడులను పూసుకోవడం, స్వీట్లు పంపిణీ చేసుకోవడం, భంగ్ లేదా తండై తాగడం, పలు రకాల స్నాక్స్ తినడం, నృత్యాలు చేయడం, రోడ్ల వెంట, ఇంటి ముందర, ఊరువాడల్లో బంధువులు, స్నేహితులు సప్తవర్ణాల రంగులను చల్లుకుంటూ, డప్పు వాయిద్యాల నడుమ నీటి తుపాకులతో రంగు నీటిని పిచికారీ చేసుకుంటూ ప్రజలంతా సమూహాలుగా చేరి పరమానంద భరితంగా పర్వదినాన్ని ఆస్వాదిస్తారు. మనలో దాగిన చెడు ఆలోచనలు, ప్రతికూల భావాలను హోలికా లేదా భోగి మంటల్లో దహనం చేస్తూ మంచి బాటన నడవడానికి నేడే శ్రీకారం చుడదాం, ఇతరుల దురాలోచనలను సహితం అగ్నికి అర్పిస్తూ, రంగుల పండుగ మన జీవితాల్లో ఆనందాలు నింపాలని కోరుకుంటూ, సమాజ శాంతికి గొడుగులు పడదాం.

*(03 మార్చి హోలికా దహనం, 04 మార్చి హోలీ పర్వదినం సందర్భంగా)*

# మార్చి 9న ఢిల్లీలో 'రైతు – కార్మికుల పార్లమెంట్'

జగ్‌మోహన్ థాకెన్

భారత– అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ఐక్యపోరాటానికి భారత రైతు సంఘాలు నడుము బిగించాయి. హర్యానాలోని కురుక్షేత్రలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) వేదిక కింద ప్రధాన సంఘాలు గత మంగళవారం సమావేశమయ్యాయి. ఇతర కీలక సమస్యలతో సహా భారత అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా విజయం సాధించే వరకు భారతదేశ వ్యాప్తంగా నిరంతర ఐక్య పోరాటానికి ప్రణాళిక వేశాయి.

ఆ వివరాలను ఎస్‌కెఎం నాయకుడు, ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు ఇంద్రజీత్ సింగ్ వెల్లడిస్తూ "అమెరికాతో ఒప్పందం అని పిలవబడే ఒప్పందం వాస్తవానికి జాతీయ ప్రయోజనాలు, సార్వభౌమాధికారం, కీలకమైన వ్యవసాయ రంగం, విస్తృత శ్రేణి పారిశ్రామిక వస్తువులను నిస్సిగ్గుగా అమ్మేయడమే. అమెరికాకు దిగుమతి సుంకాలను భారతదేశం రద్దుచేసి సున్నాగా చేయగా, భారత వస్తువుల ఎగుమతులపై అమెరికా 18 శాతం విధించాలి. ట్రంప్ సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని తేల్చిన తర్వాత కూడా, భారతదేశం ఏకపక్ష స్వేచ్ఛా వాణిజ్య ప్రకటనకు వ్యతిరేకంగా తన వైఖరిని నొక్కి చెప్పలేదు. ఇప్పుడు భారతదేశం ఈ ఒప్పందంపై సంతకం చేయకూడదు. దక్షిణార్థ భూగోళంలోని ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో, బ్రిక్స్, షాంఘై కోఆపరేషన్ వంటి కూటములతో జతకట్టాలి. ఎందుకంటే గత వారం న్యూఢిల్లీలో బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా సరైన రీతిలో సూచించినట్లుగా అభివృద్ధి చెందిన దేశాలతో సంయుక్తంగా చర్చలు జరపాలి" అని అన్నారు.




అన్ని ప్రధాన డిమాండ్లు సాధించే వరకు స్వతంత్ర పోరాటాలను, అలాగే కార్మికులతో ఐక్య పోరాటాలను తీవ్రతరం చేయాలని ఎస్‌కెఎం జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అవి అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై భారత్ సంతకం చేయవద్దని, విద్యుత్ బిల్లును వెనక్కి తీసుకోవాలని, విత్తన బిల్లు, నాలుగు కార్మిక కోడ్లు, గ్రామ్‌జి చట్టం, ఎంఎస్‌పి@సి2+50% కోసం చట్టపరమైన హామీ, రుణ మాఫీ, భూసేకరణ, పునరావాస చట్టం 2013 అమలు వంటి ప్రధాన డిమాండ్లు. ట్రేడ్ యూనియన్‌లు, వ్యవసాయ కార్మిక సంఘాల వేదికతో ఎస్‌కెఎం సమన్వయ సమావేశాలను నిర్వహించి ఐక్య పోరాటాల తుది ప్రణాళికను నిర్ణయించనుంది.

రైతుల సంఘాలు మార్చి 9 వరకు బహిరంగ సమావేశాల ద్వారా గ్రామాలకు పోరాటాన్ని తీసుకువెళ్ళాలని ఎస్‌కెఎం నిర్ణయించింది. వాణిజ్య మంత్రి పియూష్ గోయల్‌ను తొలగించాలని, దేశ వ్యతిరేక భారత–అమెరికా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయవద్దని ప్రధానమంత్రిని ఆదేశించాలని, గోధుమ, వరి రైతులకు బోనస్‌ను ఆపేయాలనే డిఒ లేఖను ఉపసంహరించుకోవాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను భారత రాష్ట్రపతి ఆదేశించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని ఖరారు చేసింది. భారత రాష్ట్రపతికి బహిరంగ లేఖలు పంపేందుకు రైతులు పోస్టాఫీసులకు ఊరేగింపులు నిర్వహిస్తారు. ఆపిల్, సోయాబీన్, పత్తి, మొక్కజొన్న వంటి ప్రభావిత పంటలను పండించే గ్రామాల్లో ప్రచారాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

మోదీ ప్రభుత్వం అధికార కేంద్రీకరణపై పోరాడాలని, రాష్ట్రాల సమాఖ్య హక్కులను కాపాడాలని, రాష్ట్రాల పన్నుల అధికారాన్ని పునరుద్ధరించడానికి జిఎస్‌టి చట్టాన్ని సవరించాలని పార్లమెంటును కోరాలని, సెస్,సర్‌ఛార్జ్‌తో సహా రాష్ట్రాలకు పన్నుల వాటాలో ప్రస్తుత 33% వాటాకు బదులుగా 60% వాటాను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను, ప్రతిపక్ష నాయకులను ఎస్‌కెఎం ప్రతినిధులు కలుస్తారు.

మార్చి 9న ప్రారంభమయ్యే పార్లమెంటు తదుపరి సమావేశాల మొదటి రోజు, ట్రేడ్ యూనియన్లు, వ్యవసాయ కార్మికుల వేదికలతో కలిసి జంతర్ మంతర్‌లో కార్మిక– రైతు పార్లమెంటును నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

పంజాబ్, హర్యానా, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళతో సహా 9 రాష్ట్రాల నుండి 150 మంది పాల్గొన్న ఎస్‌కెఎం సమావేశం, మార్చి 10 నుండి పంజాబ్‌లోని బర్నాలా నుండి ఏప్రిల్ 13 (జలియన్‌వాలా దినం) వరకు భారతదేశం అంతటా మహాపంచాయతీలను నిర్వహించాలని అన్ని రాష్ట్ర సమన్వయ కమిటీలకు పిలుపునిచ్చింది. ఈ మహాపంచాయతీలు పదివేల మంది రైతులను సమీకరించి, భారత అమెరికా వాణిజ్య ఒప్పందం, మోదీప్రభుత్వ ఇతర కార్పొరేట్ అనుకూల విధానాల ప్రమాదాలను వివరిస్తాయి. భవిష్యత్తులో సుదీర్ఘ పోరాటానికి సిద్ధం చేస్తాయి.

మార్చి 23న అమరవీరుల దినోత్సవాన్ని భారతదేశం అంతటా 'సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవం'గా పాటిస్తామని, దీనికోసం రాష్ట్ర స్థాయిలో సమగ్ర ప్రణాళికను రూపొందిస్తామని ఎస్‌కెఎం దుదల వెల్లడించింది. పంజాబ్, ఒడిశా, మహారాష్ట్రలలో రైతుల ఆందోళనలపై పోలీసులు అమలు చేసిన అణచివేతను ఖండించే తీర్మానాన్ని కూడా సమావేశం ఆమోదించింది.

జోగిందర్ సింగ్ ఉగ్రహన్, రాకేష్ తికాయత్, డాక్టర్ అశోక్ ధావలే, ఆశిష్ మిట్టల్, జగ్మోహన్ సింగ్, రాజన్ క్షీరసాగర్,జోగిందర్ సింగ్ నైన్ లతో కూడిన ఏడుగురు సభ్యుల ప్రెసిడియం అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా నాన్ పొలిటికల్ (ఇండియా) పంపిన లేఖను చర్చించి, జోగిందర్ సింగ్ ఉగ్రహన్, యుధ్ వీర్ సింగ్, పి.కృష్ణప్రసాద్, రామిందర్ సింగ్ పాటియాలా, బల్దేవ్ సింగ్ నిహల్గర్ లతో కూడిన ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎంఎస్‌పి, సంబంధిత అంశాలపై రైతుల డిమాండ్లపై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీని కలవడానికి 15 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు.

ఎస్‌కెఎం మార్గదర్శకాలకు అనుగుణంగా, కురుక్షేత్రలో మంగళవారం జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ సమితి ఇచ్చిన పోరాటాల పిలుపులను ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) హర్యానా రాష్ట్ర కమిటీ ఆమోదించింది.

ఫిబ్రవరి 26న జరిగిన మాస్టర్ బల్బీర్ సింగ్ అధ్యక్షత వహించిన రాష్ట్ర సమావేశంలో ఆఫీస్ బేరర్లు ,జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు ఇంద్రజిత్ సింగ్ ప్రసంగిస్తూ అమెరికాతో ఏకపక్ష,రైతు వ్యతిరేక వాణిజ్య ఒప్పందం అసమాన ఒప్పందం కింద విస్తారమైన భారత మార్కెట్‌ను ముంచెత్తిన నేపథ్యంలో ఇప్పటికే సంక్షోభంలో ఉన్న రైతులకు ఎలా హానికరమో వివరించారు. వరదల వల్ల పంట నష్టాలకు నిజమైన పరిహారం నిరాకరించడం, ప్రైవేట్ బీమా కంపెనీల అవినీతి కుంభకోణాలను రక్షించడం, నకిలీ వరి సేకరణ కుంభకోణంలో నిష్క్రియాప్రియత్వం వంటి హర్యానా ప్రభుత్వ నేరపూరిత వైఖరి కూడా తీవ్ర విమర్శలు చేశారు.

ఎస్‌కెఎంతో ఐక్యతను చాటుతూ కిసాన్ సభ కార్యకర్తలు మార్చి 9వ తేదీకి ముందు రాష్ట్రవ్యాప్తంగా రైతులను కలిసి, దిగుమతి సుంకాలను రద్దు చేయడం ద్వారా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల కలిగే ముప్పుల గురించి వారికి అవగాహన కల్పిస్తారు. మార్చి 9న జంతర్ మంతర్‌లో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు తిరిగి ప్రారంభమవుతాయి. అదే రోజు కార్మిక సంఘాలు, ఎస్‌కెఎం సంయుక్తంగా నిర్వహించే రైతులు – కార్మికుల 'సమాంతర సమావేశంలో' ఎఐకెఎంఎస్ పాల్గొంటుంది. దేశ వ్యతిరేక భారతదేశం–అమెరికా వాణిజ్య ఒప్పందం, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవడం, విత్తనాల బిల్లు, కార్మిక కోడ్లను ఉపసంహరణ, మహాత్మాగాంధీ నరేగా పునరుద్ధరణపై సంతకం చేయవద్దని భారత రాష్ట్రపతి ప్రధానమంత్రిని ఆదేశించాలని డిమాండ్ చేస్తారు.

మార్చి 9న, పార్లమెంటు తదుపరి సమావేశాల మొదటి రోజు, ట్రేడ్ యూనియన్‌లు, వ్యవసాయ కార్మికుల వేదికలతో పాటు జంతర్ మంతర్‌లో 'కార్మిక–రైతు పార్లమెంటు'ను నిర్వహించాలని ఎస్‌కెఎం నిర్ణయించింది. వారు ఢిల్లీలోకి ప్రవేశించడంలో విజయం సాధిస్తారా? మూడు వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన సందర్భంగా 13నెలలు రైతుల ప్రవేశాన్ని అడ్డుకున్న బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతులను అలా చేయడానికి అనుమతిస్తుందా? ఇది మళ్ళీ రైతులకు, ప్రభుత్వానికి మధ్య మరో యుద్ధం అవుతుందా? ప్రశ్నలకు మార్చి 9న సమాధానాలు లభిస్తాయి.

# హిందువులంతా బంధువులేనా?



సంపతి రమేష్
7989579428

భారత రాజ్యాంగం సమానత్వం అనే మహోన్నత విలువలపై నిర్మించబడింది. ఆ పునాదులకు రూపశిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్. కానీ ఇప్పటికీ రాజ్యాంగం ఆశించిన సమానత్వం ఆమడ దూరంలోనే ఉన్నది. అయితే, హిందువులంతా బంధువులమనే భారతీయ సమాజంలో దేవాలయం దగ్గర కులం పేరుతో జరిగిన దాడి మరోమారు హిందూధర్మంలో అసమానతలను నొక్కి చెబుతుంది. ఇదీ హిందుత్వానికి మాయని మచ్చ. ఇటీవల నాగర్ కర్నూలు జిల్లా, కుమ్మెర గ్రామంలో మల్లన్న స్వామి జాతరలో బిసి చాకలి కుటుంబంపై జరిగిన దాడి దేశాన్ని కుదిపేస్తుంది.

రెండు నెలల పసిబిడ్డ ను అత్యంత క్రూరంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారుల ఆధిపత్యం మానవత్వానికి మచ్చగా మిగిలింది. ఒక శిశువు ప్రాణం కుల అహంకారానికి బలి కావడం కేవలం నేరమే కాదు, అది మానవత్వంపై జరిగిన దాడి. దేవాలయ ప్రవేశం, ఆధ్యాత్మిక హక్కుల విషయంలో సబ్బండ కులాలపై వివక్ష – ఆధునిక భారతదేశంలోనూ బహిర్గతమవుతుంది. శివుని సమానత్వానికి ప్రతిరూపమైన మల్లన్న దేవుడి గుడిలో జరిగిన ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఇది కేవలం ఒక గ్రామ సమస్య కాదు, ఆధ్యాత్మిక నిర్మాణంలో దాగి ఉన్న అసమానతలకు ప్రతిబింబంగా నిలిచింది. ఈ అన్యాయంపై మొట్టమొదట గళమెత్తిన నాయకుడు బిసి, ఎస్‌సి, ఎస్‌టిల విముక్తి ఉద్యమ రథసారధి డాక్టర్ విశారదన్ మహరాజ్. ఆయన హిందూ ధర్మంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి ల వాటా ఎంత? అని వేసిన ప్రశ్న పలువురుని ఆలోచింపచేస్తుంది. దళిత, బహుజన వర్గాల రక్త మాంసాలతో ఈ దేశంలోని గుళ్ళు, గోపురాలను నిర్మించారు. వేల ఏళ్లుగా హిందు ధర్మాన్నీ కాపాడుతున్నారు. అయినా వారిని దేవుని గర్భగుడిలోకి అనుమతించకపోవ డం, ఆంక్షలు విధించడంపై ప్రశ్నించాడు. ఆనాడు అంబేద్కర్ కాలారామ్ దేవాలయం ముందు నిలబడి ప్రశ్నించినది ఇదే. పెరియార్ వైకోం సత్యగ్రహంలో గళమెత్తినది కూడా ఇదే. నేడు కుమ్మెర గ్రామంలో డాక్టర్ విశారదన్ ప్రశ్న కూడా అదే.

**హిందూత్వంలో అణగారిన వర్గాల వాటా ఎంత?**

ప్రపంచానికే విద్య, విజ్ఞానం, సంస్కృతి పంచిన గొప్ప దేశం మనది. 'హిందువులంతా బంధువులు అనే నినాదం మహోన్నతమైనది. కానీ ఆ నినాదం వాస్తవ జీవితంలో ప్రతిబింబిస్తుందా? అనేది ప్రశ్నార్థకమే! కుమ్మెర గ్రామ ఘటన దీనికి సజీవ సాక్ష్యం.

వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న వర్ణ–కుల వ్యవస్థ ఈ దుర్ఘటనకు మూలకారణం. మేమే అధిపతులం అనే మనస్తత్వం పెరిగి, అది బలహీనులపై బలవంతుల దౌర్జన్యానికి పురిగొల్పుతుంది. దీంతో ప్రజాస్వామ్య ఆలోచనలను పాతరేస్తూ ప్రతిచోట కులస్వామ్య కోరలు రాజ్యమేలుతున్నాయి. ఇదీ దేవాలయాల నిర్వహణ కమిటీలో, పీఠాధిపతుల్లో, ప్రధాన పూజారి స్థానాల్లో, ఆధ్యాత్మిక నిర్ణయ కేంద్రాల్లోనూ స్ఫురిస్తోంది. ఈ ఆధ్యాత్మక ప్రదేశాలలో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం లేకపోవడమే ఈ ఆధిపత్యానికి నిదర్శనం. ఏ దేవుడైనా సమానత్వం బోధిస్తాడు. కానీ అగ్రకులాలు ఆధిపత్యం ఒక వ్యవస్థను నిర్మించుకొని బిసి, ఎస్‌సి, ఎస్‌టిలను శూద్రులుగా, బానిసలుగా చూస్తున్నారు. అయినా దళిత, బహుజనులు హిందువులంతా బంధువులుగానే భావించుకుంటూ వేల సంవత్సరాలుగా హిందూ మతాన్ని కాపాడుతున్నారు. చారిత్రకంగా వారికి ఆయుధం, భూమి, సంపద, విద్య వంటి ప్రధాన వనరులపై సమాన హక్కులు లభించలేదు. ఈ సామాజిక కట్టుబాట్లు, అసమానతల వల్ల దేశ రక్షణ, ఆర్థిక స్థితి, సామాజిక ఐక్యత దెబ్బతిన్నది.

ఉదాహరణకు భారతీయ హిందురాజు పృథ్వీరాజ్ చౌహాన్ కాలంలో జరిగిన యుద్ధాలలో మహమ్మద్ గోరి భారతదేశాన్నీ ఆక్రమించాడు. ఈ యుద్ధంలో బహుజనుల భాగస్వామ్యం లేకపోవడం వలన దేశం ఆక్రమణకు గురైంది. వారి చేతిలో అధికారం ఉండి ఉంటే ఎవరూ కూడా కన్నెత్తి చూసే సాహసం చూపేవారు కాదు.

ఇప్పటికీ కూడా భారతదేశంలో కొన్ని కులాల చేతిలో అధికారం కేంద్రీకృతం కావడం వల్లనే అభివృద్ధి సాధించలేకపోతుంది. దీనికి ప్రధానకారణం హిందూమతంలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు అధికారం ఇవ్వకపోవడమే. అఖండ భారతదేశాన్ని పరిపాలించిన బహుజన రాజులైన అశోకుడు, మరాఠా రాజ్యాన్ని పాలించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ సమానత్వానికి పెద్దపీట వేయడం వల్లనే చరిత్రలో గొప్పగా వర్ధిల్లారు.

**శివుని సమానత్వంతో పోరాడినప్పుడే...**

నేటికీ గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు హిందూ ధార్మిక కార్యక్రమాలలో అగ్రకులాధిపత్యం రాజ్యమేలుతుందనడానికి కుమ్మెర ఘటన మనకు ఒక గట్టి హెచ్చరిక. ఇది ఆధునిక భారతదేశంలో మానవ హక్కుల ఉల్లంఘన. దేవాలయం ఒక వర్గం సొత్తు కాదు, భక్తి కులాన్ని అడగదని, దేవుడు జాతి పత్రం చూడడు అనే మాటలు 'ఆదర్శాలు' గానే మిగులుతున్నాయి. రోజురోజుకు భయంకరమైన కులం కుట్రలు చాప కింద నీరులా విజృంభిస్తున్నాయి. వెనుకబడిన కులాలను తమ ఆధీనంలో ఉంచుకోవాలనే ఆధిపత్య పోకడలు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ అక్కడక్కడ గ్రామాల్లో అట్టడుగు కులాల ఆలయ ప్రవేశాన్నీ అడ్డుకోవడం, సామాజికంగా బహిష్కరించడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తుండడం ఇందుకు ఉదాహరణ. అదేవిధంగా ఆ వర్గాలు రాజ్యాంగం కల్పించిన అధికారాన్ని కూడా చెలాయించడాన్ని ఓర్చుకోలేక పోతున్నారు. ఈ క్రమంలో కుమ్మెర ఘటనలో డాక్టర్ విశారదన్ పోరాటం హిందు స్వాభిమానానికి, మానవ గౌరవానికి, రాజ్యాంగ ఆత్మకు సంబంధించిన పోరాటంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన నిక్సాన పోరాటానికి పలువురు సామాజిక ఉద్యమకారులు, మేధావులు, రాజకీయ పార్టీలు మద్దతిస్తున్నాయి. సమాజం ముందుకు వెళ్లాలంటే అగ్రకులాలు ఆధిపత్య భావాలను విడిచిపెట్టి ప్రజాస్వామ్య గణతంత్ర విలువలను గౌరవించాలి.

రాజ్యాంగ సమానత్వం పేజీల్లో మాత్రమే కాకుండా ఆలయ గర్భగుడిలోనూ, మన హృదయాల్లోనూ ప్రతిఫలించాలి. ఇందుకై సంస్థాగత మార్పులు అవస రం. దేవాలయాల నిర్వహణలో సమాన ప్రాతినిధ్యం కావాలి. కుల ఆధారిత అహంకారాన్ని సామాజికంగా ఖండించే ధైర్యం ప్రతి ఒక్కరిలో రావాలి. కుమ్మెర గ్రామ ఘటనలో చాకలి కుటుంబంపై దాడిచేసిన నిందితుల్ని వెంటనే శిక్షించి బాధితులకు న్యాయం చేయాలి. ఆధ్యాత్మిక ప్రపంచంలో అణగారిన వర్గాలను భక్తులుగా మాత్రమే చూడడం సరికాదు. వారికి నాయకత్వం, నిర్ణయాధికారం, గౌరవప్రదమైన ప్రాతినిధ్యం లభించినప్పుడే హిందువులంతా బంధువులు అవుతారు.

అదే విధంగా అట్టడుగు వర్గాలు కేవలం భక్తులుగా మిగిలిపోతే సరిపోదు. శివుని సామాజిక సమానత్వం, సమ్మక్కసారలమ్మల, చాకలి ఐలమ్మల పోరాటం బాటలో నడిచినప్పుడే ఆధిపత్యం అంతమవుతుంది. అప్పుడే రాజ్యాంగం కోరుకున్న సమానత్వం అమలవుతుంది. లేదంటే బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు అంధభక్తులుగా మిగిలి ఆధిపత్య వర్గాల చేతుల్లో బలవడమే అవుతుంది.

ఇప్పటికైనా అట్టడుగు వర్గాలంతా మేల్కొని కుమ్మెర ఘటనలో న్యాయంకోసం ఉద్యమించాలి. లేదంటే చరిత్రలో తప్పు చేసిన వాళ్ళుగా మిగిలిపోతారు.

## ఎఒతో పాటు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంపై ఫిర్యాదు




**ప్రజాపక్షం/వీణవంక:** మండల ఎఒ గణేష్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, ఆగ్రోస్ సేవా కేంద్రంలో ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ కరీంనగర్ జిల్లా వీణవంక మండల రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాకు ఫిర్యాదు చేశారు. ఎఒ రైతులకు అందుబాటులో ఉండకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు. వ్యవసాయానికి సంబంధించిన దరఖాస్తుల సమస్యలు పరిష్కరించకుండా వేధిస్తున్నాడని పేర్కొన్నారు. వీణవంకలోని ఎరువుల దుకాణాదారులతో వత్తాసు పలుకుతూ వారితో కుమ్మక్కై యూరియా, డిఎపి, ఇతర ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. గత డిసెంబర్‌లో డిఎపి ధర రూ.1350 కాగా ప్రస్తుతం రూ.1450 లకు అమ్ముతున్నారని చెప్పినా పట్టించుకోవడం లేదని, ఎఒ నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని రైతులు వాపోయారు. ఆగ్రోసేవా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తన ఇష్టం వచ్చినట్లుగా ప్రైవేట్ దుకాణం మాదిరిగా రైతులు ఎరువులు కొన్నప్పుడు రశీదులు ఇవ్వకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. ధరల పట్టిక ఏర్పాటు చేయడం లేదని, ఈ విషయమై ఎఒకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నీల శ్రీనివాస్, కంకల సంతోష్, కూచనపల్లి గణేష్, కూచనపల్లి కుమారస్వామి, గాజుల సంపత్ తదితరులున్నారు.

## తాడిచెట్టు పై నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన ఇల్లందుల రవి గౌడ్ వృత్తిరీత్యా ఆదివారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు మోకుజారి కింద పడటంతో రవి గౌడ్ కి తీవ్ర గాయాలు కాగా మూడు చోట్ల విరిగిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. గాయపడ్డ రవి గౌడ్ ని హుటాహుటిన కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తాటి చెట్టు ఎక్కి మోకు జారిపడ్డ రవి గౌడ్‌కి ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి,గౌడ సంఘం నాయకులు ఇల్లందుల తిరుపతి గౌడ్, దాసరి శ్రీనివాస్ గౌడ్, దాసరి సుధాకర్ గౌడ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి గౌడ్ కోరారు.

## డబుల్ బెడ్‌రూం ఇండ్ల సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను తొలగించాలి

సిపిఐ జగిత్యాల జిల్లా కార్యవర్గ సభ్యుడు వెన్న సురేష్



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల పట్టణ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తక్షణమే తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ జగిత్యాల జిల్లా కార్యవర్గ సభ్యుడు వెన్న సురేష్ డిమాండ్ చేశారు. జగిత్యాల మున్సిపల్ నిర్వాహణలో ఉన్న డంపింగ్ యార్డును తొలంగించాలని కోరుతూ సిపిఐజగిత్యాల జిల్లా కార్యవర్గ సభ్యుడు వెన్న సురేష్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల సమీపంలో డంపింగ్ యార్డు పర్యావరణ పరిరక్షణ చట్టం 1986, తెలంగాణ మున్సిపల్ యాక్ట్ 2019ని ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. జనావాసాలకు కనీసం 500 నుండి 1000 మీటర్ల దూరంలో డంపింగ్ యార్డు ఉండాలనే నిబంధన ఉందని కేవలం 250 మీటర్ల ఇండ్లకు సమీపంలో యార్డు ఉందన్నారు. డంపింగ్ యార్డు నుంచి వస్తున్న దుర్వాసనతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 విరుద్ధంగా డంపింగ్ యార్డును మున్సిపల్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారన్నారు. కలెక్టర్ తక్షణమే విచారణ జరిపించి జనావాసాలకు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తొలంగించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సమితి పట్టణ అధ్యక్షుడు మాడిశెట్టి కిరణ్ తదితరులు ఉన్నారు.

## నేడు ధర్మపురి దేవాలయం మూసివేత

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రం,జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం మూసివేయనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మంగళవారం చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 9 గంటలకు ప్రదానాలయం తోపాటు అన్ని అనుబంధ దేవాలయాలను మూసివేసి తిరిగి మరునాడు బుధవారం ఉదయం సంప్రోక్షణ గ్రహణ హోమం,అభిషేకం అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతి ఇవ్వనున్నట్లు ఇఒ శ్రీనివాస్ తెలిపారు.కాగా బ్రహ్మోత్సవాలలో ప్రధాన వేడుకైనా శ్రీ యోగ నరసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం మంగళవారం జరగనుండగా సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా తెప్పోత్సవాన్ని ఆలయ అధికారులు రద్దుచేసారు. డోలోత్సవాన్ని సైతం సాయంత్రం సమయంలో కాకుండా ఉదయం 6 నుండి 7 మధ్య నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి భక్తులకు అనుమతి నిరాకరించడంతో ఉత్సవాలకు తరలివచ్చిన నర్సన్న భక్తులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు.

## ప్రజావాణి సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి త్వరగా పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ప్రజావాణి అర్జీల సమస్యలను అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే ఇ పరిష్కరించేందుకు అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలసి సమీకృత జిల్లా కార్యాలయం సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందచేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించేదిశగా అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 165 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. అంతకు ముందు జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని గురుకులాలు, హాస్టళ్లలో భోజనం, వసతి, ఇతరత్ర విషయాలను పర్యావేక్షణ చేయటానికి జిల్లా. మండల స్థాయి అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిఆరఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ధర్మపురిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రఎస్‌సి,ఎస్‌టి,వికలాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురికిమంజూరైన డిగ్రీ కళాశాల నూతన భవనంకోసం సోమవారం మంత్రి అడ్లూరి అధికారులతో కలిసి పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలోని స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ.. ధర్మపురిని చదువుల నిలయంగా మార్చడానికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ధర్మపురిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరగా వెంటనే కళాశాల మంజూరు చేశారని అన్నారు.2026–27 విద్యా సంవత్సరం నుండి ధర్మపురి డిగ్రీ కాలేజీలో తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు.మొదట బిఎ,బికాం కంప్యూటర్ అప్లికేషన్స్,బిఎస్‌సి లైఫ్ సైన్స్,బిఎస్‌సి ఫిజికల్ సైన్స్ కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని,మొత్తం నాలుగు కోర్సుల్లో 240 సీట్లు కేటాయించినట్లు మంత్రి అడ్లూరి వివరించారు. డిగ్రీ కళాశాలను తాత్కాలికంగా జూనియర్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసి ఏడాదిలోగా పక్కా భవనం నిర్మాణం జరుపుతామన్నారు.ఇంటర్ పూర్తి చేసే విద్యార్థులు డిగ్రీలో చేరేందు కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని అడ్మిషన్లు పొం దాలని మంత్రి పేర్కొన్నారు. గతంలో దూరాభారంతో ఆడపిల్లలు ఇంటర్‌తో చదువు ఆపేసే వారని అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల గురించి పట్టించుకోలేదని అన్నారు.ఇచ్చిన మాట ప్రకారం డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తున్నామని మిగిలిన బస్సు డిపో,రెవెన్యూ డివిజన్ కార్యాలయం,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వంటి హామీలు అమలు చేస్తామని మంత్రి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. అంతేకాకుండా భవిష్యత్తులో ధర్మపురిలో బిఇడి,బిఫార్మసీ,లాకాలేజీలు తీసుకువచ్చి చదువుల తల్లి నిలయంగా మార్చుతానని మంత్రి చెప్పారు.2027 గో దావరి పుష్కరాలకు అధికారులు సుమారు రూ.944 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారని,పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి ధర్మపురిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని మంత్రి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఐ.రామయ్య,ఎస్కెఎన్ ఆర్ ప్రిన్సిపాల్ అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎస్.దినేష్,వేముల రాజేష్,చిలుముల లక్ష్మ ణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలకు డబ్బులు అడగొద్దు

కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్లతో కలిసి టౌన్ ప్లానింగ్ అధికారులతో బండి సమీక్ష



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఒక్క ఛాన్స్ ఇవ్వండి కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బిజెపికి అప్పగించండి. మార్పు చూపిస్తా, అవినీతికి తావు లేకుండా కరీంనగర్ ను అభివృద్ధి చేస్తా, మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఇదే ప్రధాన అస్త్రంగా చేసుకుంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన ప్రచారమిది. బండి సంజయ్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కరీంనగర్ ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బిజెపికి అత్యధిక స్థానాలను అప్పగించి మేయర్ పీఠాన్ని కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ ఇచ్చిన మాటకు కట్టుబడి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రక్షాళనకు నడుం బిగించారు. అందులో భాగంగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో కలిసి సోమవారం కరీంనగర్ ఎంపి కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగం డిసిపి, ఎసిపిలుసహా సిబ్బంది అంతా హాజరైన ఈ సమావేశంలో సిసి ఇప్పటిదాకా ఒక లెక్క. ఇకపై మరో లెక్క, ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల కోసం డబ్బులు అడగొద్దు...బాధితులను ఇబ్బంది పెట్టొద్దు. అవినీతికి తావు లేకుండా ఇంటి అనుమతుల కోసం వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇచ్చేలా చేయాల్సిందే.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ పూర్తి పారదర్శకతతో పనిచేయాలని, మీరు నిజాయితీగా, నిబంధనల ప్రకారం పనిచేస్తూ ఇంటి పర్మిషన్ల కోసం మీ వద్దకు వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇచ్చే విషయంలో మీకు పూర్తిగా స్వేచ్ఛనిస్తున్నానని అన్నారు. టౌన్ ప్లానింగ్ అంటేనే కరప్షన్ అనే భావన ప్రజల్లో పేరుకుపోయిందని, టౌన్ ప్లానింగ్ లో కరప్షన్‌పై మీడియాలో వార్తలు వస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే సులువుగా అనుమతి ఇవ్వాలే తప్ప రూల్స్ పేరుతో రకరకాల కొర్రీలు పెట్టి ప్రజలను ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిప్పించుకోవద్దని, బ్రోకర్లతో, ఏజెన్సీలతో పని లేకుండా వాళ్లకు పైసలిచ్చుకునే పని లేకుండా ఈజీగా ఇంటి నిర్మాణం కోసం అనుమతులు ఇవ్వాలని సూచించారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో కేంద్రం లోని ఇం టర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం తనిఖీ చేశారు. జిల్లా కేం ద్రం లోని ప్రభుత్వ సైన్స్ వింగ్ కళాశాల, భగత్ నగర్‌లోని ఆల్ఫోర్స్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష కేంద్రాలను త నిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌ కర్యాలను, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, హాల్ టికెట్ల తనిఖీ, బందోబస్తు ఏర్పాట్లు తదితర విషయాలపై ఆరా తీశారు. మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## హోలీ సురక్షిత వాతావరణంలో జరుపుకోవాలి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లా ప్రజలు హోలీ పండుగను ఆనందభరితంగా, సురక్షిత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచించారు.హోలీ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరఫున భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. యువకులు అత్యుత్సాహం ప్రదర్శించకుండా ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ , స్టంట్లు చేయడం, ముగ్గురు లేదా నలుగురు ఒకే వాహనంపై ప్రయాణించడం, బైక్‌లకు సైలెన్సర్ తొలగించి నడపడం వంటి చర్యలు ప్రమాదకరమని,వీటిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని, హోలీ రోజున మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వారి తల్లిదండ్రులపై, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఇతరులపై బలవంతంగా రంగులు వేయడం, అసభ్యంగా ప్రవర్తించడం, మహిళలను వేధించడం, గొడవలు సృష్టించడం, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హోలీ అనంతరం స్నానాల కోసం చెరువులు, కాల్వలు, అధిక నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలు, లోతైన నీటిలోకి వెళ్లడం ప్రమాదకరమని, గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## ప్రజలకు పోలీస్‌శాఖను చేరువ చేయడమే లక్ష్యం



**ప్రజాపక్షం/జగిత్యాల :** ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యమని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్‌పి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి 15 మంది హాజరై తమ ఫిర్యాదులను ఎస్పీకి అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరిస్తామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో పోలీస్ సిబ్బంది, అధికారులు మర్యాదతో మాట్లాడి వినతులు స్వీకరించి సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**హోళి పండుగను సురక్షింతగా జరుపుకోవాలి..**

హోళి పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా చర్యలు పేపడుతున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులు అత్యుత్సాహం ప్రదర్శించకుండా ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే పట్టుకుని తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించబడుతాయని వివరించారు. బలవంతంగా రంగులు చల్లడం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తంచడం, వేధించడం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. చెరువులు, కుంటలు, లోతైన నది ప్రాంతాల్లో స్నానాలు చేయడం ప్రమాదకరమన్నారు. మత సామర్యంతో ప్రజలు హోళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్‌పి సూచించారు.

## సమష్టి సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా దుబ్బాక

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి




**ప్రజాపక్షం/దుబ్బాక:** దుబ్బాక మున్సిపాలిటీని ప్రజాప్రతినిధులు,ప్రజలు, అధికారులతో కలిసి రాష్ట్రంలోని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మ పర్సన్ సంగీత అధ్యక్షతన ఏర్పాటు చేసిన పురపాలిక తొలి పాలకవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన పాలక వర్గం సభ్యులను సన్మానించారు. పట్టణ సమస్యలపై విస్తృత చర్చ జరిపారు. డబుల్ బెడ్ రూమ్ గృహాల ప్రాంతాల్లో డైనేజీ సమస్యలు, మురికి కాల్వల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. రోడ్డు మరమ్మతు చేయాలని, ఐటీఐ కాలెజీకి రహదారి బాగుచేయాలని సూచించారు. వీధి కుక్కల పెరుగుదలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పరిశుద్ధ సిబ్బంది పనితీరుపై కఠిన పర్యవేక్షణ ఉండాలని, సిబ్బంది విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిబంధనల ప్రకారమే నియామకాలు ఉండాలని స్పష్టం చేశారు. పట్టణంలో తాగునీటి వృధా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మ పర్సన్ ఆశ సులోచన, కమిషనర్ రమేశ్‌కుమార్, కౌన్సిలర్ నందాల శ్రీకాంత్, బదుగు రాజు, వనం రమేశ్, నిరోషా, బాలకిషన్, రమ్య, సురేష్, బండి శ్రీలేఖ తదితరులు ఉన్నారు.

## భూదాన్ భూముల నిర్వాసితులకు శాశ్వత గృహాలివ్వాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఖమ్మం జిల్లా భూదాన్ భూముల్లో నిరుపేద ప్రజలు కష్టపడి కట్టుకున్న ఇండ్లను ఎలాంటి నోటీస్ లు ఇవ్వకుండా ప్రభుత్వం కూల్చివేయడాన్ని తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. సోమవారం రోజున విడుదల చేసిన పత్రిక ప్రకటన లో తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య పెద్దలకు,కార్పొరేట్ శక్తులకు పరిశ్రమలు, ఇతర పనుల కోసం లీజుల పేరుతొ ఎకరాకు రూపాయి, వంద రూపాయలు నామమాత్రపు ఫీజులతో కారుచౌకగా వందలాది ఎకరాల భూములను ధారాదత్తం చేస్తున్న ప్రభుత్వాలు నిరుపేదల పట్ల ఇంత అమానవీయంగా వ్యవహరించడం సరికాదని అన్నారు . ఖమ్మం కలెక్టరేట్ సమీపంలోని వెలుగుమట్లలో 147, 148, 149 సర్వే నెంబర్ లలో 1953లో కల్వలు రాజారావు అనే వ్యక్తి 31.7 ఎకరాల భూమిని భూదాన్ బోర్డుకు అప్పగించినట్లు ఇందులో 5 ఎకరాల్లో కస్తూర్బా పాఠశాల, మరో 5 ఎకరాల్లో గురుకుల పాఠశాల నిర్మించినట్లు మీడియా కథనాల ద్వారా తెలుస్తున్నట్లు పేర్కొన్నారు .రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం మాట్లాడుతూమిగిలిన భూమిలో నిరుపేదలుసుమారు 600 వరకు రేకుల షెడ్డు వేసుకుని వినోబా కాలనీ పేరిట అక్కడ కొన్ని ఏళ్లుగా నివాసం ఉంటున్నారని, అన్ని హక్కు పత్రాలు, కోర్ట్ ఆర్డర్ ఉన్నా కూడా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా జెసిబిలతో ఇండ్లను నేలమట్టం చేయడం, కట్టు బట్టలతోని వారిని వెళ్లగొట్టడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరించడమేనని అన్నారు.ఇప్పటికైన ప్రభుత్వం కల్పించుకొని నిర్వాసితులకు శాశ్వత గృహాలు కట్టించి ఇవ్వాలని, నష్టపరిహారంగా ఒక్కొక్క ఇంటికి 20 లక్షల రూపాయలు చెల్లించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత..డ్రైవర్ పరారీ



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని దుమాల గ్రామశివారులో ఎల్లమ్మగుడి వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకతో ట్రాక్టర్‌ను పట్టుకొని ఎల్లారెడ్డిపేటలోఠాణాకు తరలించి సీజ్ చేశారు.అనంతరం కేసు నమోదు చేశారు ట్రాక్టర్ ను పట్టుకునే సమయంలో ట్రాక్టర్ పారిపోయిట్లు గా ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్‌రెడ్డి మీడియాతో తెలిపారు.

## నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందించాలి: కలెక్టర్





**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** కాచాపూర్ పాఠశాల స్ఫూర్తిగా ప్రతి పాఠశాల విద్యార్థులకు మెరు గ్గా మధ్యాహ్నం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం స మీకృత జిల్లా కలెక్టరేట్‌లో మధ్యాహ్న భోజనం అందించడంలో మంచి పని తీరు కనపరిచి రాష్ట్రస్థాయి పురస్కారం పొందిన కాచాపూర్ పాఠశాల సిబ్బందిని అభినందించారు.ఈ సందర్భంగా మా ట్లాడుతూమధ్యాహ్న భోజనంలో భాగంగా ఉత్తమ నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశీలనలో మ ధ్యాహ్న భోజనం ఉత్తమంగా నిర్వహిస్తున్న మూ డు పాఠశాలలకు రాష్ట్ర స్థాయిలో పురస్కారాలు ల భించగా ,అందులో మన పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల కాచాపూర్ ఉందని, ఇది మన జిల్లాకు ఎంతో గర్వకారణం అని అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు అత్యుత్తమంగా ఎండిఎం నిర్వహణ జరగాలని కోరుతూ పాఠశాల సిబ్బందిని అభినందించారు.అనంతరం అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్. పీఎం షేక్, జూలపల్లి మండల విద్యాధికారి సరస్వతి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ ఉపాధ్యాయులు రాజేందర్ రెడ్డి లను జిల్లా కలెక్టర్ సన్మానించారు.

**పుష్కర ఏర్పాట్ల ప్రతిపాదనలు ఫైనల్ చేయాలి**

గోదావరి పుష్కరాలకు సంబంధించి జిల్లాలో చేయాల్సిన ఏర్పాట్ల పై ప్రతిపాదనలు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, పార్కింగ్,ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి కు ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో గోలివాడ, మంథని, గోదావరిఖని, సుందిళ్ల వంటి ప్రాంతాలలో గోదావరి నది ప్రవాహం ఉంటుందని అక్కడ చెయ్యాల్సిన ఏర్పాట్లు పై ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని, ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రాం రెడ్డి, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## మనోహరాబాద్ ఎంపిడిఒగా ప్రీతిరెడ్డి

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** నార్సింగ్ మండలం నుండి బదిలీపై మనోహరాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి నూతన ఎంపీడీవోగా నియమితులైన ప్రీతి రెడ్డి సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శిల జిల్లా ఫోరం అధ్యక్షులు కాయితి సంతోష్ ఆధ్వర్యంలో కార్యదర్శులు అంతా కలిసి ఎంపిడిఒ ప్రీతి రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, టిపిఎస్‌డిఎఫ్ (టిఎన్‌జిఒస్) మనోహరాబాద్ మండలం అధ్యక్షుడు బండి రమేష్, జిల్లా కార్యవర్గం సభ్యులు వైస్ ప్రెసిడెంట్ రజిత, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడు వేణుగోపాల్ రెడ్డి, వీరితోపాటు మనోహరాబాద్ మండల పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని, శాఖల వారీగా పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని, అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి, అనంతరం అధికారులతో శాఖలవారీగా పనితీరుపై సమీక్షించారు. ముందుగా ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని, ప్రతి సోమ వారం ప్రజల సమస్యలపై ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో ప్రజావాణి యథాతథంగా కొనసాగుతుందన్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులపై క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు పరిష్కారం దిశగా కృషిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ భుజంగరావు, జెడ్పి సిఇఒ ఎల్లయ్య, డిఆర్‌డిఒ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎఒ యూనస్ వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నక్షాబాట ప్రకారమే రోడ్డు నిర్మించండి

అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ శివారులోని సర్వేనంబర్ 25లో ప్రయివేట్ సర్వే చేసి పాతిన కడీలను రైతులు విజయ రాంనాథ్‌రెడ్డిలు ఆదివారం పరిశీలించారు. శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామానికి చెందిన దొంతిరెడ్డి నర్సింహారెడ్డికి విజయ, శశిరేఖ కుమారుడు ప్రభాకర్‌రెడ్డి, స్వరూప, సబిత సంతానం, మా తండ్రి నర్సింహా రెడ్డి ఆస్తులు పంచుకున్న ఏ ఒక్కరు కూడా ఆయన బాగోగులు చూసిన పాపాన పోలేదని, గత నాలుగు సంవత్సరాల నుంచి ఆయన జీవనం, వైద్య ఖర్చులు మొత్తం తానే భరిస్తున్నాని బందె విజయ తెలిపారు. తండ్రి దొంతి రెడ్డి నర్సింహారెడ్డి పేరు మొదట ఫిబ్రవరి 26న స్వర్గీయ అని పొరపాటున ప్రచురితమైందని, ఆయన జీవించే ఉన్నారని కావల్సుకొని కొందరు దీనిపై వివాదం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. అలాగే గ్రామ శివారులోని సర్వే నంబర్ 22, 23, 24, 25, 26లలో నుంచి బంగారమ్మ వరకు నక్షబాట రోడ్డు ఉండగా మమ్మల్ని పూర్తిగా అన్యాయం చేయాలని మా సొంత భూమి లోనే మొత్తం రోడ్డు నిర్మించడం దుర్మార్గమన్నారు. సర్వేనంబర్ 25లో నావంతు వాటాగా 8ఎకరాల 22 గుంటల భూమి వచ్చిందని, అలాగే సర్వే నంబర్ 283లో ఎకరం 20గుంటల భూమి నా వంతు వాటాకు రాగా అట్టి భూమిని సబిత అక్రమంగా ఆక్రమించిందని విజయ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూ వివాదంపై రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని నాకు న్యాయం చేయాలని బందె విజయ రామనాథ్‌రెడ్డి దంపతులు విజ్ఞప్తి చేశారు.



## మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సిహెచ్ బాలేష్ డిమాండ్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సిహెచ్ బాలేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆసిఫాబాద్‌లో జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎల్ అండ్ టి యాజమాన్యం ప్రతినిధి శ్రీనివాస్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలేష్ మాట్లాడుతూ వేతనాలు అందక కార్మికుల కుటుంబాలు పస్తులుంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం కాలయాపన చేయకుండా ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని, కనీస వేతనం 26,000 రూపాయలతో పాటు బోనస్, పెట్రోల్ అలవెన్సు కల్పించాలని కోరారు. ఈపిఎఫ్, ఈఎస్ఐ వివరాలు వెల్లడించని పక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమార్, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

## బైక్‌పై తరలిస్తున్న దుంగల పట్టివేత

**ప్రజాపక్షం/దండేపల్లి :** దండేపల్లి మండలం ఊట్ల గిరిజన గూడెం నుండి అక్రమంగా బైక్ పై తరలిస్తున్న నాలుగు దుంగలను సోమవారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. తాళ్ళపేట రేంజర్ సుష్మారావు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు సెక్షన్ ఆఫీసర్ రాజేందర్, బీట్ ఆఫీసర్ మధుకర్, బేస్ క్యాంప్ సభ్యుడు చిన్నయ్య అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బైక్ పై దుంగలతో వస్తున్న వ్యక్తి అధికారులను గమనించి వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. పట్టుబడిన కలప విలువ సుమారు 25 వేల రూపాయలు ఉంటుందని రేంజర్ పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న కలప, మోటార్ సైకిల్‌ను తదుపరి విచారణ నిమిత్తం రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో అటవీ శాఖ సిబ్బంది రాజేందర్, మధుకర్, చిన్నయ్య పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

కలెక్టర్ పి.ప్రావీణ్య

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని ముఖాభివృద్ధిలో వీరి పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు (నాలుగు మండలాలకు చెందిన 40వ బ్యాచ్‌గా నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణా కార్యక్రమానికి సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్పంచ్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో గ్రహించి శిక్షణలో నేర్చుకున్న అన్ని విషయాలు గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామానికి మంచి చేయాలన్న గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా చట్టపరమైన నిబంధనల మేరకు అమలు చేయాలని తెలిపారు. గ్రామాలలో ఉన్న సమస్యలను ఏలా గుర్తించాలి వాటిని ఎలా పరిష్కరించాలి అందుబాటులో ఉన్న నిధులను ఎలా సక్రమంగా వినియోగించుకోవాలని వంటి అంశాలపై ఈ శిక్షణ ద్వారా స్పష్టత లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా పనిచేయాలని సర్పంచులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులకు సంబంధించిన మేటీరియల్‌తో కూడిన బ్యాగులను జిల్లా కలెక్టర్ సర్పంచ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్పీలు, ఎంపిడిఒలు , మాస్టర్ ట్రైనర్లు, డి.డబ్ల్యుఒ లలిత కుమారి ,ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.





**ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలి :**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వర పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ,అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి కలసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్జీదారులు, భూ సమస్యలు తదితర అంశాలతో పాటు పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, వ్యవసాయ, విద్య, వైద్యా ఆరోగ్య, డిడబ్ల్యు ఒడిసిఎస్ఒ పశుసంవర్ధక శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్‌కు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. ప్రజావాణిలో 56 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్‌ల్ అధికారులు వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టరేట్ ఎఒ, ప్రజలు పాల్గొన్నారు.



## ఇంటిని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రిటైర్డ్ టీచర్ తీగల నర్సింహులు

**ప్రజాపక్షం/పాపన్నపేట :** పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో తన నివాసయోగ్యమైన ఇంటిని జేసీబీతో కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు తీగల నర్సింలు జిల్లా పోలీసు సూపరింటెండెంట్, జిల్లా పంచాయతీ అధికారి, పాపన్నపేట పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 2 గంటల ప్రాంతంలో జేసీబీ తో అక్రమంగాఇంటిని కూల్చారని సీసీ ఫుటేజ్ లను పరిశీలించి, నిందితులను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని నర్సింలు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి

ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ

**ప్రజాపక్షం/మందమర్రి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో మాజీ స్పీకర్ స్వర్గీయ డి. శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, యూనియన్ నాయకులు, కార్యాలయ సిబ్బంది కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. శ్రీపాదరావు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప ప్రజా నాయకుడని ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఆయన సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజాస్వామ్య విలువలను కాపాడారని గుర్తుచేసుకున్నారు. ఆయన నిబద్ధత, పరిపాలనా నైపుణ్యం, ప్రజాసేవా దృక్పథం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. శ్రీపాదరావు జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒటు జిఎం జివిఎల్. ప్రసాద్, ఎఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) అశోక్, సింగరేణి మైనింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ రవి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జి.ఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ రమణ పాల్గొన్నారు.




## ఆమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండ ఆపాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎ.రహెమాన్

యుద్ధోన్మాద దిష్టిబొమ్మ దగ్ధం



**ప్రజాఫక్షం /సంగారెడ్డి :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి వర్దిల్లాలని యుద్ధాలను ఆపాలని యుధోన్మాద దిష్టిబొమ్మను స్థానిక కొత్త బస్టాండ్ వద్ద దహనం చేయడం జరిగింది. ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేపట్టిన దాడులను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండిస్తోంది. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎ రహెమాన్ మాట్లాడుతూ మధ్య ప్రాచాత్య ప్రాంతంలో శాంతి భద్రతలను భంగం కలిగించే విధంగా సామ్రాజ్య వాద శక్తులు వ్యవహరించడం ప్రపంచం శాంతికి తీవ్రమైన ముప్పుగా మారుతుందన్నారు. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ అమెరికా దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం ఈ దాడుల వల్ల అమాయక ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయన్నారు. సమస్యలను సైనిక దాడుల ద్వారా కాకుండా దౌత్యపరమైన చర్యల ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా కేవలం దేశాలలో ఉన్న ఖనిజ సంపదను దోచుకోవడం కోసమే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. 2003 వ సంవత్సరంలో కూడా ఇలాగే ఇరాక్ పై యుద్ధం ఆ దేశ అద్యక్షుడు సద్దాం హుస్సేన్ ను ఉరితీసీ అద్యక్ష సంపదను దోచుకున్నారు రన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యుదోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్న అమెరికా ఇజ్రాయిల్ చర్యలను ఐక్యరాజ్య సమితి తక్షణమే ఖండించి జోక్యం చేసుకోవాలని భారత ప్రభుత్వం కూడా స్పష్టమైన వైఖరి తీసుకుని ప్రపంచ శాంతి పరిరక్షణకు కృషి చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. శాంతి ,సౌభాగ్యం, ప్రజల జీవన హక్కుల కోసం పోరాడే శక్తులన్ని ఈ దాడులకు వ్యరిరేకంగా ఐక్యంగా నిలవాలని పిలుపు నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి బి. వెంకట్రాజ్యం ,బాబు జగ్జీవన్ రామ్, సమతా, సంఘం వేణుగోపాల్ సిపిఐ సంగారెడ్డి జిల్లా నాయకులు సయోద్ , సమద్, శివశంకర్, సంతోష్, కుమార్, గుప్తా, శివ యదుల్, లక్ష్మి , అనసూజ తదితరులు పాల్గొన్నారు.



## అత్యంత విశిష్టమైన పండగ హోలీ

ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** హోలీ పండుగ అత్యంత ఆనందమయమైన పండుగని, చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరు సంతోషంగా నిర్వహించుకొనే ఒకే ఒక్క పండగ హోలీ పండగ అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కామదహన కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
హిందూ పండగలు ఎన్ని ఉన్నప్పటికి దేని విశిష్టత దానికే ఉంటుందని అందులో ముఖ్యంగా హోలీ పండగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కామదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నగర ప్రజలు సుఖ సంతోషాలతో, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ ఛైర్‌పర్సన్ ముక్కా దేవేందర్ గుప్తా, పొల్దె లక్ష్మీ కాంతం, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు దన్‌పాల్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల ప్రభాకర్, కమిటి సభ్యులు, మహిళా సంఘం కమిటి సభ్యులు, వివిద అనుబంధ సంస్తల, గల్లి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, పట్టణ ఆర్యవైశ్య సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం పురస్కరించుకుని మార్చి 8, 2026న మావల మండలం కొమురం భీం కాలనీలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) రాష్ట్ర, జిల్లా నాయకులు పిలుపునిచ్చారు.ఆదివారం నిర్మల్‌లో ఆదివాసి సంఘం నాయకులతో కలిసి సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య మాట్లాడుతూ.. మహిళలకు పూర్తిస్థాయిలో స్వేచ్ఛ, సమానత్వం, స్వయం పరిపాలన హక్కుల కల్పించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.
సమాజ అభివృద్ధిలో మహిళలపై పాత్ర ఎంతో కీలకమని,అయితే నేటికీ మహిళలపై అణచివేత,వరకట్న హత్యలు,భ్రూణ హత్యలు గృహహింస వంటి ఘటనలు నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉండటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా గళమెత్తడానికి,మహిళా సాధికారతను చాటిచెప్పడానికి ఏర్పాటు చేసిన ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా మహిళలు,ప్రజాస్వామికవాదులు,మేధావులు,బుద్ధిజీవులు, కార్మిక కర్షక వర్గాలు,ఆదివాసీలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్,దుర్వ నగేష్ ప్రధాన పురోహిత్ సేవావ సంఘం రాష్ట్ర నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ సుంచు శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి తోడసం గోవర్ధన్,జిల్లా సంయుక్త కార్యదర్శి సురపు సాయన్న,జిల్లా నాయకులు మంద మల్లేష్,లింగన్న,పోతు రాజు శ్రీనివాస్,భీమేష్,రామకృష్ణ,ఫిరాజి పెందుర్ మాధవ్ మెస్రం నగేష్ సాకారం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## సేంద్రియ వ్యవసాయంతో మేలైన ఫలితాలు

**ప్రజాపక్షం/దహేగాం/కాగజ్‌నగర్ :** సేంద్రియ వ్యవసాయాన్ని అవలంబించి రైతులు మంచి ఫలితాలు సాధించాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగావ్ మండలంలోని గిరవెల్లి రైతు వేదికలో ఎన్ఎంఎన్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, మట్టి ఆరోగ్య పరిరక్షణ, రసాయనాల వినియోగం తగ్గించడంపై రైతులకు వివరించారు. జీవామృతం, ఘనజీవామృతం, వర్మి కంపోస్ట్ తయారీ విధానం ఉపయోగాలను ఆయన తెలియజేశారు. మట్టి పరీక్షల అవసరం, సమతుల్య ఎరువుల వినియోగం, పంటల సుస్థిర సాగు విధానాలపై చర్చించారు. ఆర్గానిక్ పంటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ విస్తరణ అధికారి సుస్మిత, సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీస్ ప్రతినిధి వెంకటేష్, ఏఈఓలు ఆనంద్, లావణ్య, రోహిణి, ఆదిత్య, సిఆర్పీలు అంజన్నపాల్గొన్నారు.



## ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు స్పీకర్‌గా దుద్దిళ్ల శ్రీపాదరావు పనిచేసిన సమయంలో వారినిజాయితీ, నిరాడంబరత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అదనపు డిసిపి (అడ్మిన్) జి. బస్వారెడ్డి అన్నారు. సోమవారం నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు డిసిపి (అడ్మిన్) జి. బస్వారెడ్డి ఆద్వర్యంలో స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు డిసిపి మాట్లాడుతూ దుద్దిళ్ళ శ్రీపాదరావు సౌమ్య మనస్తత్వంగల నాయకుడిగా ప్రజల మద్యనే ఉండి వారి కష్టనష్టాల్లో భాగస్వాములై ప్రజానాయకునిగా గుర్తింపు పొందారని అన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌లు శంకర్, బషీర్, శ్రీనివాస్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పిసిఆర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వీరయ్య, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ సతీష్, సిఎస్‌బి సిబ్బంది, ఐటికోర్ సిబ్బంది, సెంట్రల్ కంప్లయింట్ సెల్ సిబ్బంది, సిసిఆర్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

## అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా నిరసన

**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని జామ మస్జీద్‌లో సోమవారం మధ్యాహ్నం నమాజ్ అనంతరం అమెరికా,ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ దేశం పైన జరిపిన దాడులకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు.ఈ దాడిలో ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా ఖామినీయి మృతి పట్ల తీవ్ర సంతాపం తెలియజేశారు.ఈ సందర్భంగా అమెరికా,ఇజ్రాయెల్ దేశాలు ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తూ ఇస్లామిక్ దేశాల పైన నిరంతరం దాడులు చేయడాన్ని ముక్త కంఠంతో ఖండించారు.అమెరికా,ఇజ్రాయిల్ దేశాలు ఇతర దేశాలపైన తమ పెత్తనం చూపడాన్ని,ఇతర దేశాల సార్వభౌమాత్వాన్ని హరించడాన్ని ఖండించారు.ఐక్య రాజ్య సమితి వెంటనే అమెరికా,ఇజ్రాయెల్ దేశాల పైన చర్యలు తీసుకొని ప్రపంచ శాంతిని నెలకొల్పాలని తెలిపారు.

## బాల్య వివాహ నిర్మూలన ప్రచార రథం ప్రారంభం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన,100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని,సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు.బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో బాల్య వివాహ రహిత భారత కార్యక్రమంలో భాగంగా ఈ ప్రచార రథాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రచార రథం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలు,విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.విజన్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ శరత్ కుమార్, రాజు, బాలల పరిరక్షణ అధికారి మురళి,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వహీద్,చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ గంగాధర్,మిషన్ శక్తి సిబ్బంది,విజన్ సంస్థ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దిలీప్‌కుమార్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా (స్థానిక సంస్థలు) దిలీప్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్‌గా కొనసాగిన ఐఎఎస్ అధికారి అంకిత్‌కు పదోన్నతి కల్పిస్తూ ఇటీవలే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసిన విషయం విధితమే. ఆయన స్థానంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్‌ను నియమించారు .ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించిన మీదట మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దిలీప్‌కుమార్‌ను పలువురు జిల్లా అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళా సమాఖ్య భవన పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/మామడ :** మామడ మండల పరిధిలోని ఆరెపల్లి గ్రామంలో నూతన మహిళ సమాఖ్య భవనానికి సోమవారం గ్రామ సర్పంచ్ జంగిలి రాజవ్వ మల్లయ్య భూమి పూజ చేశారు.సర్పంచ్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కొరకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ సహాయంతో 10 లక్షల రూపాయల నిధులతో నూతన భవనాలను నిర్మిస్తుందని తెలిపారు.ఇందులో ఉపసర్పంచ్,ప్రేమ సింగ్,పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్,సిఎ మాదవి,ప్రశాంత్,జంగిలి భీమేష్,జాదవ్ ప్రకాష్ వార్డు సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## వారం రోజులుగా నిలిచిన భగీరథ నీరు

**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండలంలోని పలు కాలనీల్లో వారం రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లాల ద్వారా నీరు రాకపోవడంతో దైనందిన అవసరాలకు కూడా కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం పవిత్ర రంజాన్ మాసం కొనసాగుతుండటంతో ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లిం సోదరులు తాగునీరు, వంట నీటి కోసం మరింత ఇబ్బంది పడుతున్నారు. నీటి సరఫరా లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో మహిళలు, వృద్ధులు దూర ప్రాంతాల నుంచి నీటిని మోసుకొస్తున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# కోహ్లీని తలపించిన శాంసన్

## సంజూపై మాజీ ఆటగాళ్ల ప్రశంసలు



క్వార్టర్ ఫైనల్ లాంటి మ్యాచ్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ శివాలెత్తిన తీరుపై మాజీ ఆటగాళ్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈడెన్ గార్డెన్స్‌లో విధ్వంసక ఆటతో చివరిదాకా నిలబడి భారత్‌ను గెలిపించిన హీరో సంజూను ఆకాశానికెత్తేస్తున్నారు. మాజీ పేసర్ ఇర్ఫాన్ పఠాన్ సైతం శాంసన్‌ను ఎంతో మెచ్చుకున్నాడు. భారీ ఛేదనలో ఆరంభంలోనే రెండు వికెట్లు పడినా.. అదరక బెదరక చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన శాంసన్ తన ఆటతో విరాట్ కోహ్లీని గుర్తు చేశాడని ఇర్ఫాన్ పేర్కొన్నాడు. చావోరేవో పోరులో భారత జట్టును గట్టెక్కించిన సంజూ శాంసన్ ఒక్కసారిగా నెట్టింట సెన్సేషన్‌గా మారిపోయాడు. వరల్డ్ కప్ లీగ్ దశలో బెంచ్‌కే పరిమితమైన ఈ కేరళ బ్యాటర్.. కీలక మ్యాచ్‌లో తన సత్తా చాటాడు. ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్ బౌలర్లను ఉతికేసి భారత్‌ను సెమీస్‌కు తీసుకెళ్లాడు. 196 పరుగుల ఛేదనలో శాంసన్ ఖతర్నాక్ ఇన్నింగ్స్‌తో విరాట్ కోహ్లీని తలపించాడని ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. 'ఈడెన్ గార్డెన్స్‌లో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లో సంజూ శాంసన్ తన సామర్థ్యానికి న్యాయం చేశాడు. విన్నింగ్ షాట్ కొట్టిన తర్వాత అతడు మైదానంలోనే కూలబడి.. ఆకాశంకేసి చూస్తూ చేసుకున్న సెలబ్రేషన్ అతడెంత గొప్పవాడో చాటింది. మనం చాలాసార్లు శాంసన్ బ్యాటింగ్ గురించి మాట్లాడుకున్నాం. ఈసారి అతడు 20 ఓవర్లు వికెట్ కాపాడకుంటూ విధ్వంసరచన చేశాడు. ఇది అతడి పిట్‌నెస్‌కు నిదర్శనం. నువ్వు మ్యాచ్‌ను ముగించిన తీరు మాకు.. విరాట్ కోహ్లీని గుర్తు చేసింది. పవర్ ప్లేలో అతడు.. 20, 25, 28 పరుగుల వద్ద ఉన్నప్పుడు గేర్ మార్చి బౌండరీలు రాబట్టిన తీరును ఆతృతగా గమనించాను. దాదాపు 200ల లక్ష్యాన్ని ఛేదిస్తున్నప్పుడు మాస్టర్ క్లాస్ ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా విరాట్ కోహ్లీ నుంచి మనం అలాంటి ఆటే చూశాం. ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌పై సంజూ సైతం అచ్చం అలాంటి ఇన్నింగ్సే ఆడాడు. కోహ్లీతో పోల్చితే శాంసన్ ప్రత్యేకమైన ఆటగాడు. అతడు రిస్క్ ఎక్కువ తీసుకుంటాడు. కండబలాన్నంతా ఉపయోగించి అలవోకగా పెద్ద షాట్లు ఆడతాడు. కాబట్టి.. అతడిని నిలువరించడం ఎవరికైనా కష్టమే' అని ఇర్ఫాన్ వెల్లడించాడు.
బిగ్ మ్యాచ్‌లో 10 పరుగులే చేసి.. అభిషేక్ శర్మ విఫలమైన వేళ.. గెలుపు బాధ్యతను భుజాన వేసుకున్న శాంసన్ తన ఎంపికకు న్యాయం చేశాడని ఈ మాజీ పేసర్ అన్నాడు. చెప్పాలంటే తనకు తాను కూడా న్యాయం చేసుకున్నాడని అతడు తెలిపాడు. ఇకపై పొట్టి ప్రపంచకప్‌లో టీమిండియా ప్రదర్శన గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా సంజూ శాంసన్ 97 నాటౌట్ ఇన్నింగ్స్ గురించి కచ్చితంగా మాట్లాడుకుంటాం అని ఇర్ఫాన్ పఠాన్ వివరించాడు.
**వెస్టిండీస్‌ను చిత్తు చేసి...**జింబాబ్వేపై విజయంతో సెమీస్ రేసులో నిలిచిన టీమిండియా.. ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లో సంజూ శాంసన్(97 నాటౌట్) అర్ధ శతకంతో విరుచుకుపడగా విండీస్ ఆశలన్నీ ఆడియాశలయ్యాయి. ఆఖర్లో పాండ్యా(17) ఔటౌనా.. శివం దూబే(8నాటౌట్) అండగా సంజూ లాంఛనం ముగించాడు. దాంతో.. గ్రూప్‌‌-ఎ నుంచి టీమిండియా రెండో బెర్తు ఖరారు చేసుకోగా, రెండుసార్లు ఛాంపియన్ వెస్టిండీస్ ఉసూరుమంటూ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# ఒలింపిక్ విజేత కలకు అడ్డుపడుతున్న యుద్ధం..

పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావంతో దుబాయ్ లో చిక్కుకుపోయిన భారత స్టార్ షట్లర్ పివి. సింధు కీలక టోర్నీకి దూరం కానుంది. ఇరాన్ క్షిపణుల దాడులతో వణికిపోతున్న దుబాయ్‌కు విమాన రాకపోకలు నిలిచిపోయిన నేపథ్యంలో ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో సింధు ఆడడంపై సందేహాలు నెలకొలన్నాయి. ఈ ఏడాదైన టైటిల్తో మురవాలనుకున్న తెలుగు తేజం కలలు కల్లలయ్యేలా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో భారత బృందానికి లక్ష్యసేన్ సారథ్యం వహించే అవకాశముంది. బ్యాడ్మింటన్ ఆటలో ఆల్ ఇంగాండ్ టోర్నమెంట్ చాలా ప్రసిద్ధి. ఈసారి బర్మింగ్హమ్ వేదికగా మార్చి 3నుంచి ఈ సూపర్ టోర్నీ ప్రారంభమవ్వనుంది.



మంగళవారం నుంచే ఈవెంట్ షురూ కానున్నందున భారత బృందంలోని పలువురు ఇంగ్లాండ్ చేరుకున్నారు. పురుషుల సింగిల్స్ స్టార్ లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి.. డబుల్స్ ద్వయం సాత్విక్ చిరాగ్.. మిక్స్డ్ డబుల్స్ ప్లేయర్లు ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టో.. రోహన్ కపూర్, రుత్వికా శివాని గడ్డెలు కొందరు ఇతర మార్గాల్లో(ఆఫ్రికా, సింగపూర్ మీదుగా) బర్మింగ్హమ్లో దిగారు. సింధు మాత్రం కోచ్ ఇర్వన్స్యాహ్ అది ప్రటమాన్ సహా దుబాయ్‌లో చిక్కుకుపోయింది. ఈ నేపథ్యంలో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య దుబాయ్‌లోని పరిస్థితులను గమనిస్తోంది. సింధు సహ అక్కడ చిక్కుకుపోయిన క్రీడాకారులను ఇతర మార్గాల్లో సురక్షితంగా తరలించేందుకు ప్రయత్నిస్తోంది.
**ఆ ఇద్దరే విజేతలు..**ఇప్పటివరకూ ప్రకాశ్ పదుకొనే(1980లో), పుల్లెల గోపిచంద్(2001లో).. ఈ ఇద్దరు మాత్రమే ఆల్ ఇంగ్లండ్ టోర్నమెంట్లో ఛాంపియన్గా నిలిచారు. ఆ తర్వాత సైనా నెహ్వాల్(2015లో), లక్ష్య సేన్(2022లో) టైటిల్‌కు చేరువగా వచ్చినప్పటికీ రన్నరప్‌గా వెనుదిరిగారు.

## యువతరంగం

# యుపిఎస్‌సిలో కీలక దశలు..




యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్ష (సిఎస్ఇ) కోసం సిద్ధమవడం అనేది దీర్ఘకాలికమైన, కఠినమైన ప్రక్రియ. ఇందులో తెలివైన వ్యూహం, నిరంతర శ్రమ, భావోద్వేగ స్థైర్యం అవసరం. ఇది కేవలం జ్ఞానం సేకరించడం మాత్రమే కాదు. ఒక సివిల్ సర్వెంట్‌గా ఆలోచించే మనస్తత్వాన్ని అభివృద్ధి చేయడం. ఈ క్రమంలోనే అభ్యర్థులు గమనించాల్సిన ముఖ్యాంశాలు...
**1. ప్రాథమిక అంశాల అవగాహన...** సిలబస్‌పై పూర్తి అవగాహన: సిలబస్ మార్గదర్శక దీపంలాంటిది. ప్రతి అంశాన్ని విశ్లేషించి పూర్తిగా కవర్ చేయాలి. ప్రశ్నలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సిలబస్‌కు సంబంధించినవే ఉంటాయి. కాగా, పరీక్షా విధానం, దశలు: మూడు దశలు ఉంటాయి – ప్రిలిమ్స్ (ఆబ్జెక్టివ్/క్వాలిఫైయింగ్), మెయిన్స్ (వివరణాత్మక/మెరిట్ ఆధారితం), ఇంటర్వ్యూ (వ్యక్తిత్వ పరీక్ష). ఎన్‌సిఇఆర్‌టి పునాది: చరిత్ర, భూగోళశాస్త్రం, రాజ్యాంగం, ఆర్థిక శాస్త్రం వంటి ప్రధాన విషయాలకు 6–12 తరగతుల ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలతో బలమైన పునాది నిర్మించాలి.
**2. అధ్యయన వ్యూహం...** అందుబాటులో ఉండాల్సిన వనరులను పరిమితం చేసి, పునశ్చరణను గరిష్టం చేయాలి. ఎక్కువ మెటీరియల్ చూసి గందరగోళానికి లోనవకూడదు. ప్రతి సబ్జెక్టుకు ఒక ప్రామాణిక పుస్తకం తీసుకుని 10–15 సార్లు పునశ్చరణ చేయాలి. ప్రతిరోజూ విశ్వసనీయ పత్రిక చదవాలి. స్థిరమైన అంశాలను సమకాలీన పరిణామాలతో అనుసంధానించాలి. **సంక్షిప్త నోట్స్ తయారీ:** కీలక పదాల ఆధారంగా చిన్న నోట్స్ తయారు చేయాలి. కరెంట్ అఫైర్స్‌ను స్టాటిక్ సబ్జెక్టులతో కలపడం ముఖ్యం. **ఐచ్ఛిక విషయం ఎంపిక :** మీ ఆసక్తి, విద్యాపరమైన నేపథ్యం, మార్గదర్శకత్వం లభ్యత ఆధారంగా ఐచ్ఛిక సబ్జెక్ట్ ఎంపిక చేయాలి. ఇది మెయిన్స్‌లో 500 మార్కులు కలిగి ఉంటుంది.
**3. సమాధాన రచన, అభ్యాసం...** రోజువారీ సమాధాన రచన (మెయిన్స్): ప్రతిరోజూ సమాధానాలు రాయాలి. అందులో పరిచయం, విశ్లేషణ, ముగింపు అనే నిర్మాణాన్ని పాటించాలి. పద పరిమితిని గౌరవించాలి. ఎక్కువ పదాలు వినియోగించడం వల్ల సమగ్రత లోపించడమే గాక, ఎక్కువ తప్పులు దొర్లే ప్రమాదం కూడా ఉంటుంది. **గత ప్రశ్నపత్రాల విశ్లేషణ :** గత 10–15 సంవత్సరాల ప్రశ్నలను విశ్లేషించి ధోరణి, క్లిష్టత స్థాయి, ముఖ్య అంశాలను గుర్తించాలి. **మాక్ టెస్ట్ సిరీస్:** ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటికీ మాక్ టెస్టులు (మాదిరి పరీక్షలు) రాయాలి. సమయ నిర్వహణ, వేగం, బలహీన ప్రాంతాల గుర్తింపుకు ఇవి సహాయపడతాయి. 7–5–3 నియమం (మెయిన్స్ ): ప్రధాన భాగంలో 7 పాయింట్లు, 5 పేరాల నిర్మాణం, 3 కోణాలు (సామాజిక, రాజకీయ, ఆర్థిక) కవర్ చేయడం వంటి క్రమబద్ధమైన విధానం అనుసరించాలి.
**4. ముఖ్యంగా దృష్టి కేంద్రీకరించాల్సిన అంశాలు...** సిఎస్‌ఎటి (ప్రిలిమ్స్ పేపర్ II): ఇది క్వాలిఫైయింగ్ అయినప్పటికీ క్లిష్టత పెరుగుతోంది. గణితం, తర్కశక్తి, పాఠ్య అవగాహనపై సాధన అవసరం. **ఎథిక్స్ మరియు ఎస్సే (మెయిన్స్):** నైతిక విలువలపై బలమైన అవగాహన కలిగి ఉండాలి. వ్యాసం (ఎస్సే)లో సమతుల్య, విశ్లేషణాత్మక దృక్పథంతో విభిన్న కోణాలు చూపాలి. **మ్యాప్ ఆధారిత ప్రశ్నలు:** భారత దేశం మరియు ప్రపంచ భూగోళంపై మ్యాపింగ్ సాధన చేయాలి.
**5. మనస్తత్వం..నిర్వహణ...** ప్రేరణ కంటే క్రమశిక్షణ ముఖ్యము : ప్రేరణ తాత్కాలికం, క్రమశిక్షణ శాశ్వతం. ప్రతిరోజూ ఒక స్థిరమైన అధ్యయన పట్టిక ఉండాలి. శారీరక, మానసిక ఆరోగ్యం: బర్నౌట్ నివారించేందుకు విరామాలు తీసుకోవాలి. వ్యాయామం, సరైన ఆహారం అవసరం. ఎప్పటికీ వదులుకోని ధోరణి: ఈ ప్రక్రియలో విజయాపజయాలు సహజం. తప్పిదాల నుంచి నేర్చుకుని లక్ష్యంపై దృష్టి నిలుపుకోవాలి. సమయ నిర్వహణ: రోజువారీ, వారాంత, నెలవారీ లక్ష్యాలతో ప్రణాళిక రూపొందించాలి.
**6. ఇంటర్వ్యూ (వ్యక్తిత్వ పరీక్ష)...** డిఎఎఫ్ అధ్యయనం: మీ విద్య, జన్మస్థలం, హాబీలు, ఉద్యోగ అనుభవం వంటి వివరాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. **నిజాయితీ:** తెలియని ప్రశ్నకు అబద్ధం చెప్పకూడదు. తెలియదని అంగీకరించడం ఉత్తమం. ఈ విధానలను అనుసరించడం అనేది ప్రధానంగా యుపిఎస్‌సి సిద్ధతను పరీక్షా సన్నాహంగా కాకుండా వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియగా చూడాలని సూచిస్తుంది. సిలబస్ కేంద్రబిందువు. వనరుల పరిమిత వినియోగం, పునశ్చరణ ఎక్కువసార్లు చేయడం విజయానికి కీలకం. మెయిన్స్‌లో రచనా నైపుణ్యం, ఇంటర్వ్యూలో నిజాయితీ, మొత్తం ప్రయాణంలో క్రమశిక్షణ అనే ఈ మూడు స్తంభాలు ముఖ్యమైనవి.

# కుతూహలం నుంచి శాస్త్రీయ విప్లవం వరకూ..

## యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..



కుతూహలం ఎలా శాస్త్రీయ విప్లవంగా మారుతుందో ఎన్రికో ఫెర్మి జీవితం మనకు స్పష్టం చేస్తుంది. 1915లో రోమ్‌లోని ఒక చిన్న పుస్తకాల దుకాణంలో 14 ఏళ్ల ఫెర్మి ఒక పాత లాటిన్ భాషా భౌతికశాస్త్ర పుస్తకాన్ని కొనుగోలు చేశాడు. ఆ గ్రంథాన్ని ఆధారంగా చేసుకుని ఆయన స్వయంగా కాల్కులస్, క్లాసికల్ మెకానిక్స్, జ్యామితి వంటి అంశాలను అభ్యసించాడు. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఫెర్మికి ప్రత్యేక సౌకర్యాలు లేకపోయినా, పరిశోధనా స్వభావం అపారంగా ఉండేది. తన అన్న మరణం తర్వాత ఫెర్మి శాస్త్రాన్వేషణలో మరింత నిమగ్నమయ్యాడు. 17వ ఏట ఇటలీలోని ప్రతిష్టాత్మక 'స్కూలా నార్మలే సుపీరియోర్ డి పిసా'లో ప్రవేశం పొందాడు. ప్రవేశ పరీక్షలో ఆయన రాసిన వ్యాసం అసాధారణ మేధస్సుకు నిదర్శనంగా నిలిచింది. విశ్వవిద్యాలయంలో బోధన తన స్థాయికి తగ్గదని భావించిన ఫెర్మి, సమాన ఆలోచనలున్న మిత్రులతో చర్చా వేదికలను ఏర్పాటు చేశాడు. 21వ సంవత్సరాలకే క్వాంటం మెకానిక్స్, గణాంక భౌతికశాస్త్రంలో ప్రముఖ పరిశోధనలు చేసి అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. 1938లో ఆయనకు భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

# సమగ్ర సాంస్కృతిక విధానం రూపొందించాలి

## రాష్ట్ర బడ్జెట్‌లో కళాకారుల సంక్షేమానికి రూ.వెయ్యికోట్ల నిధులు కేటాయించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ్ డిమాండ్



యాదాద్రి, భువనగిరిలో...



నాగర్‌కర్నూల్‌లో...

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రాష్ట్ర బడ్జెట్‌లో కళాకారుల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనర్సింహ్ డిమాండ్ చేశారు. సోమవారం సమగ్ర సాంస్కృతిక విధానం రూపొందించడంతో పాటు కళారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి బాలనర్సింహ్ హాజరై అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ తర్వాత కళాకారులను అన్ని విధాలుగా అదుకుంటామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయిందని, ఈ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి అదుకుంటామని చెప్పి రెండు సంవత్సరాలు గడిచినా, నేటికి మాట నిలబెట్టుకోలేక పోయిందన్నారు. 50 సంవత్సరాలు నిండిన అర్హులైనా కళాకారులకు రూ.5 వేల పెన్షన్ అందించాలని, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు, సాంస్కృతిక కోటాలో ఉద్యోగాలు, ఉచిత బస్సు పాస్‌లు, రైలులో 50 శాతం రాయితితో కూడిన రవాణా సౌకర్యం, అరోగ్య కార్డులు, గుర్తింపు కార్డులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు తన్నీరు మల్లయ్య, కార్యదర్శి పెబ్బేటి విజయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కూశమల్ల శివకృష్ణచ కళాకారులు పర్వతాలు, సలేశ్వరం, చందు, యాదగిరి, ఉషన్న గౌడ్, కందూరి కేశవులు, పటేల్‌రాముడు, నాగరాజు, చిన్నరాముడు, బాలస్వామి, జ్యోతి, మనిషా, వెంకటస్వామి, సువర్ణ, కల్పన, పద్మ, సంపూర్ణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల హక్కుల కోసం పోరాటం

**యాదాద్రి :** అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడడు కురిమిద్ద శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని కళాకారుల సమస్యలపై సోమవారం యాదాద్రి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్ అనురాగ్ జయంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో కళాకారుల సేవలను వాడుకుంటూ కనీస గౌరవ వేతనం ఇవ్వకపోవడం అన్యాయమని, ప్రతి కళాకారుడికి గుర్తింపు కార్డు ఇచ్చి, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ మాట్లాడుతూ యాదాద్రి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో కళాకారులకు ప్రదర్శన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నేతలు ఎండి.ఇమ్రాన్, చిగుర్ల లింగం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు భూషిపాక నరసింహ, ఉపాధ్యక్షులు పిట్టల శంకర్, హేమలత, యాదగిరి, సహాయ కార్యదర్శి పోతు ప్రవీణ్‌తో పాటు పెద్ద సంఖ్యలో కళాకారులు పాల్గొన్నారు.
**పాల్వంచ :** తెలంగాణ కళాకారుల సమస్యలను పరిష్కరించి వారికి గుర్తింపు, హెల్త్ కార్డులు, ఉద్యోగాలు ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కొండలరావు డిమాండ్ చేశారు. సంఘం పిలుపులో భాగంగా భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, జిల్లా అధ్యక్షుడు శనగారపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కమటం కొమరయ్య, భాషా, జిల్లా నాయకులు కె.క్రిష్ణ, డి.లక్ష్మి, రాజేశ్వరి, కె.రామారావు, పి.సంజీవరావు, అల్లి వెంకటేశ్వర్లు, హెచ్.వెంకన్న, ఇ.రామారావు,భూక్యా బిక్కూలాల్, కోట సుందర్‌రావు, తాటి నాగరాజు పాల్గొన్నారు.
**హనుమకొండ టౌన్ :** కళాకారుల సమస్యలను పరిష్కరించాలని ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టేపాక రవి మాట్లాడుతూ కళాకారులకు ప్రాధాన్యత గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సాంస్కృతిక కోటా కింద ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కళాకారులు పెండ్యాల గట్టయ్య, తాటికాయల మమత, భూషణం, రొంటాల దేవా, కరుణాకర్ తదితర కళాకారులు పాల్గొన్నారు.
**కుత్బుల్లాపూర్ :** కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం సమగ్ర సాంస్కృతిక విధానం రూపొందించి అమలు చేయాలని ప్రజానాట్య మండలి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ప్రమీల, వెంకటాచారి, రాములు, బాబు, సైదమ్మ, బాపురాజు, మాధవి, రామాతార, మణెమ్మ, భారతి, ఐలమ్మ, వెంకటమ్మ, అండాలు పాల్గొన్నారు.



పాల్వంచలో...



హన్మకొండలో...



మేడ్చల్, కుత్బుల్లాపూర్...

# మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడుదాం

## ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి




**ప్రజాపక్షం/హనుమకొండ :** మహిళలు, పసిపాపలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదా లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో బాలసముద్రంలోని మహిళా సమాఖ్య జిల్లా కార్యాలయంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాస మల్ల దీన అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా నేదునూరి జ్యోతి హాజరై మాట్లాడుతూ సమాజంలో మహిళల హక్కులే మానవ హక్కులుగా ప్రకటించి ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలలో జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు భాగస్వామ్యం కల్పించినప్పుడే సమాజాభివృద్ధి, మహిళల సాధికారిత సాధించబడుతుందన్నారు. సనాతన ధర్మం పేరుతో మహిళలకు హక్కులు లేకుండా చేసి, మహిళా శక్తిని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన హామీ అమలుకు ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. మార్చి 1వ తేదీ నుంచి పదో తేదీ వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం, పసిపిల్లలపై జరుగుతున్న హింస అత్యాచారాలకు వ్యతిరేకంగా, మహిళా సాధికారిత, ప్రపంచశాంతి కొరకు ఉద్యమించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ సమితి పిలుపునిచ్చిందని తెలిపారు. సమావేశంలో జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ గ్రామాలలో మద్యం ఏరులై పారుతుందని, మద్యం మత్తులో మహిళలపై హింస, వేధింపులు పెరిగిపోతున్నాయని, చిన్న వయసులోనే మహిళలు వితంతువులుగా మారుతున్నారని, మహిళలకు హింసకు కారణమైన బెల్ట్ షాపులను నిషేధించాలని, మద్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల రమాదేవి మాట్లాడుతూ అర్హులైన పేద మహిళలందరికీ పెన్షన్లు ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, భూమి లేని వారికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, గోపాల్ పూర్ గ్రామ సర్పంచ్ కర్రె లక్ష్మి, విద్యార్థి నాయకురాలు జ్యోతి, సలాకుల స్వరూప, మంగా, తిరుమల, ఉమా స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు

## యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న అన్నిరంగాల మెడికల్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 25 సంవత్సరాలకు పైగా పారిశుధ్య, పేషెంట్ కేర్ కార్మికుడిగా సేవలందిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పి.యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు రంగన్న,బి. చెన్నయ్య, బాలకోటి, గోపాల్ నాయక్, బుచ్చన్న, రామకృష్ణ, అంజి, యాదయ్య, శంకర్, బాలరాజ్, మున్నా, కొండయ్య, రాఘవేందర్, శ్రీను, కృష్ణ, చిన్నయ్య, యాదయ్య, రామకృష్ణ, పద్మ, సత్యమ్మ, నాగమ్మ, ఎల్లమ్మ, అలివేల, సునీత, జ్యోతి, వెంకటమ్మ, లక్ష్మి, ఇందిరా, యాదమ్మ, నరసింహ, కవిత, సుధా, లక్ష్మమ్మ, బాలమణి పాల్గొన్నారు.
**నారాయణపేట్ :** కాంట్రాక్ట్ కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేసే కాంట్రాక్ట్ ఏజెన్సీల విధానం రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు అందించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాల కాంట్రాక్టు పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ విభాగాల కార్మికుల విస్తృత సమావేశం నారాయణపేట మెడికల్ కళాశాలలో జరిగింది. సమావేశంలో ఎస్.సంతోష్, లక్ష్మయ్య, దయానంద్, కరుణాకర్, శ్రీను, ప్రకాష్, యాదేశ్, వెంకటేష్, రాజు, వెంకట్ రాములు, వెంకటేష్, అంబిక, అశ్వినీ, దేవిక, గాయత్రి, పల్లవి, కవిత, సత్యమ్మ, లక్ష్మి , అనురాధ పాల్గొన్నారు.





## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/వరంగల్:** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యా రాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, హౌసింగ్ పీడీ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించి, దరఖాస్తుదారుల సమక్షంలో సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన వినతులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా సమయపాలనతో పని చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మొత్తం 163 దరఖాస్తులు అందాయని తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 67, జీడబ్ల్యూఎంసీ కి సంబంధించినవి 38, మిగతా శాఖలకు చెందినవి 58 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చినందున వాటిని సంబంధిత తహసీల్దార్లకు ఎండార్స్ చేసి త్వరిత పరిష్కారం కల్పించాలని ఆదేశించారు. వృద్ధుల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను శిశు సంక్షేమ మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రీవెన్స్ దరఖాస్తుల్లో ముఖ్యంగా రెవెన్యూ, జీడబ్ల్యూఎంసి, పోలీస్ శాఖలకు సంబంధించినవి అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ లేకుండా పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డిసిఓ నీరజ, డిబిసిడిఓ పుష్పలత, వివిధ శాఖల అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌ను కలవడం ఆనందంగా ఉంది: ధన్వంతి

**ప్రజాపక్షం/జనగామ:** డిసిసి అధ్యక్షుల శిక్షణ శిభిరం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని కలవడం ఆనందంగా ఉందని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి అన్నారు. డిసిసి అధ్యక్షుల శిక్షణ శిభిరం హైదరాబాద్‌లో జరుగుతుండగా సోమవారం రాహుల్ సందర్శించారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా అధ్యక్షురాలు ధన్వంతి తన భర్త టిపిసిసి సభ్యులు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్ పిల్లలతో కలిసి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో గ్రూప్ పోటో దిగారు. ఈ సందర్భంగా ధన్వంతి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి, కోఆర్డనేషన్ గురించి రాహుల్‌గాంధీ అనేక విషయాలు చెప్పారన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ఎన్నికల్లో పార్టీని గెలిపించడం గురించి వివరించారన్నారు. రాహుల్‌గాంధీ ప్రసంగం తనను ఆకట్టుకుందని, రాహుల్ గాంధీ ప్రధాని లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంతో పాటు అభివృద్ధిని వివరించడం, గ్రామ, మండల, జిల్లా స్థాయి నాయకత్వాన్ని సమన్వయం చేసుకొని జిల్లాలో పార్టీని ముందు వరుసలో నిలుపుతానన్నారు. రాష్ట్ర ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ల సహకారంలో పార్టీని ముందుకు తీసుకుపోతానన్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ డిసిసి అధ్యక్షురాలు ధన్వంతి కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడారు.

## సిసి కెమెరాల ఏర్పాటుతో నేరస్తులపై చర్యలు: ఎసిపి



**ప్రజాపక్షం/కమలాపూర్:** మండలంలోని గూడూరు గ్రామంలో కాజీపేట ఏసిపి పింగిళి ప్రశాంత్ రెడ్డి ప్రోత్సాహంతో ఒక సాధారణ రైతు గాజుల రమేష్ (చిన్న) ఇటీవల కమలాపూర్ మండల పరిధీలో జరుగుతున్న మోటర్ దొంగతనాలు దృష్ట్యా వాటిని అరికట్టాలనే ఉద్దేశ్యంతో సిసి టీవిలను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో తన గ్రామంలో 12 సిసి కెమెరాలు రూ. 92వేల సొంత ఖర్చులతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సిసి కెమెరాలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాజీపేట ఏసిపి పింగిళి ప్రశాంత్ రెడ్డి, కమలాపూర్ ఇన్స్పెక్టర్ పులిగిల్ల నవీన్, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఝాన్సీ రాణి రవీందర్, సబ్ ఇన్స్పెక్టర్ వడ్డే దిలీప్, మండల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిసి కెమెరా యొక్క ప్రాధాన్యత గురించి, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, నైతిక విలువలు, ట్రాఫిక్ నిబంధనలు, గంజాయి వాడకం వలన జరుగు అనార్థాలు మొదలగు విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

## పరీక్షా కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ములుగు:** మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధ్యక్షతన జిల్లాలోని లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జి వివిధ శాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షా కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని విద్యార్థులకు పరీక్ష రాయడానికి ఎటువంటి అసౌకర్యం కల్గకుండా చూడాలని అన్నారు. పరీక్ష కేంద్రంలోని ఏ అధికారికి కూడా సెల్‌ఫోన్‌తో అనుమతి లేదని, పరీక్షా కేంద్రం సందర్శించడానికి వచ్చిన అధికారులు ఎవరైనా కూడా వారి యొక్క మొబైల్ ఫోన్లు పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసినటువంటి క్లాక్ రూమ్ వద్ద డిపాజిట్ చేసిన అనంతరం మాత్రమే పరీక్షా కేంద్రంలోకి వెళ్ళాలని సూచించారు. చీఫ్ సూపరింటిడెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు కూడా సెల్‌ఫోన్ తీసుకు రాకూడదని తెలిపారు. పోలీస్ డిపార్ట్మెంట్ ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఇద్దరు సిబ్బందిని ఉంచాలని, పోలీస్‌స్టేషన్ నుండి ప్రశ్నాపత్రం పరీక్ష కేంద్రానికి తీసుకు వెళ్లేటప్పుడు, పరీక్ష అనంతరం సమాధాన పత్రాలను పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసే సమయంలో తప్పకుండా పోలీస్ సిబ్బంది సమక్షంలోనే జరగాలని అన్నారు.జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్ఎంతో పాటుగా మెడికల్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశం జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్దార్థరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడగా సమావేశానికి డిపిఓ, ఎలక్ట్రిసిటీ అధికారి, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్, ఆర్‌డిఓ, పోలీస్ డిపార్ట్మెంట్ నుండి సిఐ, ఆర్‌టిసి అధికారులు, రూరల్ వాటర్ సప్లయి అధికారి, డిటిఓ కార్యాలయ సిబ్బందితో పాటుగా ఏసిజిఈ వినోద్ కుమార్, కోఆర్డినేటర్లు రాజు, శ్యాంసుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఒకే రోజు రూ.9.37 కోట్ల పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం రోజున 48, 49 డివిజన్ల పరిధిలో సుమారు రూ.9.37 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.7.50 కోట్ల వ్యయంతో ఎన్ఐటీ నుంచి లోటస్ కాలనీ వరకు ఆర్అండ్ బి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ రహదారి రెండు వైపులా సెంటర్ లైటింగ్ వ్యవస్థతో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 48వ డివిజన్‌లో రూ.50 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం, రూ.1.37 కోట్లతో లోలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా,హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కూడా పాల్గొన్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయిని, నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశారు. శంకుస్థాపనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఎన్ఐటీ రహదారి పనులు ప్రారంభం కావడంతో ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు.అన్ని డివిజన్లలో అంతర్గత రోడ్లు, సీసీ డ్రైనేజీ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కాజీపేట దర్గా పరిసర ప్రాంతాలు దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, ఇప్పుడు ఆ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. దర్గా రైల్వే ట్రాక్ అవతల నివసించే ప్రజల గేట్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు.ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటూ ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేసే మాయమాటలను నమ్మకుండా, పనిచేసే వారిని గుర్తించి భవిష్యత్తులో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మానస రాంప్రసాద్, సత్రాజ్ బేగం, అబూబకర్, సీనియర్ నాయకులు అమర్, కట్ట రఘుపాల్ రెడ్డి, మట్టెడ కుమార్, డివిజన్ అధ్యక్షులు సింగరపు రవి ప్రసాద్, మల్లారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

## అన్మాండ్ కార్మికుల సమస్యలపై లంచ్ అవర్ నిరసన



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** తెలంగాణ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం కంపెనీ అధ్యక్ష కార్యదర్శుల పిలుపుమేరకు ములుగు జిల్లా అధ్యక్షుడు మాదాటి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు ములుగు సర్కిల్ కార్యాలయంలో లంచ్ అవర్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసన అనంతరం సర్కిల్ ఎస్ ఈ ఆనందంని కలిసి అన్మాండ్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని విధులు నిర్వర్తిస్తున్న అన్మాండ్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారికి ట్రావెల్ అలవెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. 2004లో అప్పటి భారత జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వకాలంలో 7114మందిని డిపార్ట్మెంట్‌లో విలీనం చేసి కాంట్రాక్టు జూనియర్ లైన్మెన్‌లుగా గుర్తించిన విధంగానే, మిగిలిన 1607 మంది అన్మాండ్ కార్మికులను కూడా కాంట్రాక్టు జూనియర్ లైన్మెన్‌లుగా డిపార్ట్మెంట్‌లో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఉపాధ్యక్షుడు దేవరకొండ రాజు, కార్యదర్శి పోతన, వేణి, సతీష్, సంజీవరెడ్డి, అశోక్, సంతోష్, అంజయ్య, సురేష్, రమేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు. ములుగు సర్కిల్ పరిధిలోని అన్మాండ్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యతను ప్రదర్శించారు.

## గాదె ఇన్నయ్య తండ్రికి సిపిఐ సంతాపం



**ప్రజాపక్షం/జనగామ :** మా ఇల్లు ప్రజాదారణ ఆశ్రమ నిర్వాహకులు, సామాజిక ఉద్యమ నాయకులు గాదె ఇన్నయ్య తండ్రి గాదె సాల్మోహన్‌రెడ్డి మృతి చెందగా సిపిఐ రాష్ట్ర సమితి తరుపున ఆ పార్టీ ఎక్స్‌క్యూటీవ్ సభ్యులు, జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి సోమవారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి సిపిఐ రాష్ట్ర సమితి తరుపున సంతాపం ప్రకటించారు. జఫర్‌గడ్ మండలం సాగరంలో మండల కార్యదర్శి జువారి రమేష్‌తో కలిసి నివాళ్లు అర్పించిన అనంతరం రాజారెడ్డి మాట్లాడారు. గాదె ఇన్నయ్య ప్రజల కోసం, ప్రజా హక్కుల కోసం పనిచేస్తున్నారన్నారు. ఆయనను ఉపా చట్టం కింద అరెస్ట్ చేయడం సరియైంది కాదన్నారు. పాలకులు ప్రజాహక్కుల్ని హరిస్తున్నారని, ప్రజా పోరాటాలన్ని అనిచివేస్తున్నారని మండిపడ్డారు. ఇన్నయ్య అరెస్ట్‌ను తట్టులేక ఆయన తల్లి ఇటీవల మృతి చెందగా 45 రోజుల్లోనే ఆయన తండ్రి చనిపోయారన్నారు. ఇలాంటి సంఘటనలు పాల్పడం సరియైంది కాదని హెచ్చరించారు. గాదె ఇన్నయ్య సిపిఐ అండగా ఉంటుందన్నారు.

## 4న చలో భూపాలపల్లి

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** కేజీబివి సమస్యల సాధనకు ఈ నెల 4 వ తేదీన నిర్వహించే చలో భూపాలపల్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిటిఎఫ్ మండల కమిటీ పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా సోమవారం మండలకేంద్రంలోని మానవ విద్యావనరుల కేంద్రం వద్ద కరపత్రాన్ని ఆవిశ్కరించారు. అనంతరం డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ కేజీబివిలు సమస్యలకు నిలయంగా మారాయని అన్నారు.కేజీబివి పాఠశాలల్లో విద్యార్థులు,అధ్యపకులు, ఇతర సిబ్బంది అనేక సమస్యలతో సతమతమౌతున్నారని అన్నారు. గెస్ట్ టీచర్లకు వినిమం టైం స్కేల్ అమలుతో పాటు 28 రోజుల సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మద్కు మధు, రాజయ్య, సమ్మయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, వీరేశం, పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే

గుడిసె వాసులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ :** దేశంలోని పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. సోమవారం పలువేల్పుల గ్రామంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వేసుకున్న గుడిసెల కేంద్రం వద్ద సిపిఐ శాఖ సమితి సమావేశం ఆ పార్టీ శాఖ కార్యదర్శి గొర్రె నందిని అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఆచరణలో అరాకొర అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నాయని, స్థానికంగా కనీస మౌలిక సదుపాయాలు సైతం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. పేదల కోసం పోరాటం చేసేది ఒక కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు. పేదలు ప్రభుత్వ భూములలో నిలువ నీడ కోసం గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని, వారికి ఇంటి పట్టాలు ఇచ్చి ఇల్లు నిర్మించాలని గత అనేక దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్న పాలక ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప పేద ప్రజలకు మాత్రం ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పట్టాలు అందని ద్రాక్షగానే మిగిలాయని అన్నారు. పాలకులు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి దామెర సుదర్శన్, నాయకులు గూగులోత్ సురేష్, పాకాల సంతోష్, పులి ముత్తయ్య, నతనీయల్, బొక్క ఈశ్వర, పులి యశోద, దేవరకొండ జయ, గుగులోతు పర్ణిక, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగాలి



**ప్రజాపక్షం/జనగామ :** పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం జనగామ పట్టణంలోని ఎబివి ప్రైయివేట్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సోమవారం ఉదయం ఆకస్మికంతా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పరశీలించిన విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, హాజరు వివరాలు, సిసి కెమెరాల పనితీరు, తాగునీరు, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వయించడం వలన విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు వ్రాసే అవకాశం ఉంటుందన్నారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కళాశాల నిర్వాహకులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించాలని పోలీసులను ఆదేశించారు.

**శ్రీపాదరావుకు ఘన నివాళి**

దివంగత శాసనసభ స్పీకర్ శ్రీపాదరావు జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. దుద్దిళ్ల శ్రీపాదరావు స్పీకర్‌గా చేసిన సేవల్ని కొనియాడారు. ఆయన ప్రజల హక్కుల కోసం పనిచేశారన్నారు. దుద్దిళ్ల శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించిన వారిలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎంఇఓను సస్పెండ్ చేయాలి

బిట్స్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎఐఎస్ఎఫ్ నాయకులు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిట్స్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, మూసి వేసిన పాఠశాలకు అనుమతులు ఇచ్చిన చిట్యాల ఎంఈఓ ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొతుకు.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, బిట్స్ పాఠశాల యాజమాన్యం ఇంకో బ్రాంచ్ కోసం పది సంవత్సరాల నుండి మూసివేసిన శాంతినికేతన్ పాఠశాలకు అనుమతులు తీసుకొని జిల్లా ప్రజలను, అధికారం మోసం చేశారని తెలిపారు. చిట్యాల ఎంఈఓ భూపాలపల్లికి మండల ఎంఈఓ ఇన్చార్జిగా బాధ్యతలు తీసుకున్న క్రమంలో బిట్స్ పాఠశాల యాజమాన్యంతో కుమ్మక్కై అవినీతికి పాల్పడి నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలకు గుర్తింపు ఇచ్చారని తెలిపారు. వెంటనే ఎంఈఓను సస్పెండ్ చేయాలని,శాంతినికేతన్ పాఠశాల పర్మిషన్ తీసుకొని బిట్స్ పాఠశాల అని చెప్పి విద్యార్థులను తల్లిదండ్రులను మోసం చేసి పాఠశాల నడుపుతున్నారని వెంటనే ఆ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పలుసార్లు జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఏ మాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. బిట్స్ యాజమాన్యం శాంతినికేతన్ పాఠశాల పేరు మీద పర్మిషన్ తీసుకొని ఆ పాఠశాల పేరు మీద కాకుండా బిట్స్ పాఠశాల బోర్డు పెట్టి విద్యార్థులకు టై బెల్ట్ యూనిఫామ్ స్టడీ సర్టిఫికెట్ ఫీజు రిసిప్ట్ల మీద కూడా బిట్స్ పాఠశాల అని తప్పుడు పేరు రాసి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నిడుతుందని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్ కావాలంటే ఏ పాఠశాల పేరు మీద ఇస్తున్నారు. తెలవక ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఉంటుందని తెలిపారు. కావున ఎంఈఓ, బిట్స్‌యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన పోరాటాలు చేస్తామని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జోసెఫ్, రాజుల శివకుమార్, పవన్ రాజేశ్వరి పాల్గొన్నారు.

## పజావాణి అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు: కలెక్టర్

**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయా మండలాల తహసీల్దారులతో కలసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలను అందజేస్తూ కలెక్టర్ అదనపు కలెక్టర్లకు విన్నవించారు. ప్రజలు అందించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించి అక్కడే ఉన్న సంబంధిత అధికారులను వాటి పరిష్కారానికి చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో గృహ నిర్మాణ, రెవెన్యూ, పౌరసరఫరాలు, విద్యా, మున్సిపల్, జిల్లా పంచాయతీ, ఆర్ అండ్ బి, మెప్మా, తదితర శాఖలకు సంబంధించి ప్రజలు 222 అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, జడ్పీ సీఈవో శేషాద్రి, డిఆర్డిఓ మేన శ్రీను , ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి

కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశం



**ప్రజాపక్షం/ములుగు:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావులతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 59 దరఖాస్తులు రాగా వాటిలో భూ సమస్యలు 14, ఇందిరమ్మ ఇళ్లు 14, పెన్షన్ 14, ఉద్యోగాల కల్పన 04, ఇతర శాఖలకు సంబంధించినవి 13 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వారి స్థాయిలో ప్రతి దరఖాస్తున్న పరిష్కరించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి దరఖాస్తు పై విచారించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం, పెండింగ్ వంటి అంశాలను సమీక్షిస్తామని తెలిపారు. దరఖాస్తులను తమ వద్ద పెండింగ్‌లో ఉంచవద్దని అన్నారు. అనంతరం ఇందరిమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు స్లాబ్ లెవెల్ పూర్తి అయిన ఇళ్లను వెంటనే మిగతా పనులు పూర్తి అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని పనులు పూర్తయిన ఇండ్లను వారానికి 10 చొప్పున గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా నాయకుడు శ్రీపాదరావు: కలెక్టర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి నిష్పక్షపాతంగా వ్యవహరించిన గొప్ప ప్రజానాయకుడు మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కొనియాడారు. సోమవారం మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు 87వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి నిష్పక్షపాతంగా వ్యవహరించిన గొప్ప ప్రజానాయకుడని తెలిపారు. స్పీకర్ హోదాలో ఆయన చూపిన క్రమశిక్షణ, పారదర్శకత, నైతిక విలువలు ప్రతి ఒక్కరికి ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన చిరస్మరణీయులని అన్నారు. ఈతరం యువత ఆయన సేవాభావం, నాయకత్వ లక్షణాలు మరియు ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ఎంతో ప్రధానమని ఆయన తెలిపారు. మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కూనంనేని

ప్రజా సమస్యల పరిష్కారంలో సహకరించాలని వినతి



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లా కలెక్టర్‌గా నూతనంగా విధుల్లోకి చేరిన అంకిత్‌ను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్‌లతో కలిసి ఆయన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలిపారు. ఈ భేటీలో ప్రధానంగా కొత్తగూడెం నియోజక వర్గ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రజల ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమ స్యలపై చర్చించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి చొర వచూపాలని ఎంఎల్‌ఏ కలెక్టర్‌ను కోరారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతి నిధుల సమన్వయంతో కొత్తగూడెం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లా లని వారు ఆకాంక్షించారు. పాలనలో, సమస్యల పరిష్కారం మరింత వేగం పెరుగుతుందని కూనంనేని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ భౌగోళిక పరిస్థితులు, పారిశ్రామిక ప్రాముఖ్యతను కలెక్టర్‌కు వివరించిన ఎంఎల్‌ఏ ప్రజా సమస్యలపై ఎళ్ల వేళలా స్పందించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

## స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్వచ్ఛమైన తాగునీటిని నగర ప్రజలకు అందించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మంచినీటి పథకాల నిర్వహణపై దృష్టి సారించాలని ఆయన అధికారులను కోరారు. వేసవి అంటే నీటి ఎద్దడి ఏర్పడు తుందని ఇందుకు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నగ రంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రకటనను విడుదల చేసిన వారిలో జ్వాలా నర్సింహారావు, ఎండి రెహ్మాన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## గంజాయి మత్తులో యువత వీరంగం

నడిరోడ్డుపై ఒకరిపై ఒకరు కర్రలతో దాడులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** గంజాయి మత్తులో యువకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. వైరా– మధిర ప్రధాన రహదారిపై ఈ ఘటన చోటు చేసుకోవడంతో వాహనాలపై వెళ్తున్న వారు భయభ్రాంతులకు గుర య్యారు. సోమవారం వైరా రోడ్డులోని కియా షోరూం సమీపంలో ప్రధాన రహదారిపై ఐదారుగురు యువకులు గంజాయి మత్తులో కర్రలతో దాడులు చేసుకున్నారు. ఓ యువకుడు రక్తపు మడుగులో నడిరోడ్డుపై పడి పోయాడు. సమీపంలోని వాహనాలపై దాడి చేస్తారని వణికిపోయారు. మొత్తంగా గంజాయి మత్తులో యువకులు చేసిన హల్‌చల్ దాదాపు గంట పాటు భయోత్పాతం సృష్టించింది.

## పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ 6వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ సోమవారం పర్యటించారు. వార్డులోని స్తూపం బజార్‌లో డ్రైనేజీ క్లియరెన్స్, పారిశుద్ధ్యంపై శానిటేషన్ అధికారి వీరన్నతో మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చంద్రకళ వార్డులోని పారిశుద్ధ్య పనులపై అక్కడున్న కార్మికులకు పలు సూచనలు చేశారు ప్రజలకు పనుల విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగవద్దని, ప్రతిరోజు వార్డులో చెత్త సేక రించి ఆటోలు తిరగాలి, డ్రైనేజీలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తోటకూర శ్రీకాంత్, యు.పూర్ణ, జవాన్, గాజుల శ్రీను, నంద్రు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలపై బురద చల్లే ప్రయత్నం తగదు

కాంగ్రెస్ నేతలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అభివృద్ధికి మారుపేరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై ప్రతిపక్షాలు బురద చల్లే ప్రయత్నం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నర్సింహారావు లు మాట్లాడుతూ అభివృద్ధి ప్రధాత అయిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై ప్రతిపక్షాలు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాయని వీటిని మానుకోవాలన్నారు. మచ్చ లేని నాయకు నిగా తుమ్మల నాగేశ్వరరావు ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అక్రమార్కులు, దళారులు పేదల వద్ద డబ్బులు తీసు కుని ప్లాట్లు కట్టబెట్టారన్నారు. నాడు కెటిఆర్, అజయ్‌కుమార్ మంత్రు లుగా ఉండి భూదాన్ భూముల్లోని నిరుపేదలకు పట్టాలు ఎందుకు ఇవ్వలే దని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారుల ద్వారా భూదాన్ భూముల్లో గుడి సెలు కోల్పోయిన బాధితులకు సంబంధించి సర్వే చేయించడం జరుగు తుందని అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెడద సత్యనా రాయణ, దొడ్డా అశోక్, తాళ్లూరి హన్మంతరావు, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, కొత్తా సీతారాములు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ గాడిన పడేనా?

**ఉపాధ్యాయుల్లో కొరవడిన అంకితభావం ప్రభుత్వ విద్యపై ప్రభావం చూపుతుంది. పాఠశాల సమయాల్లో బోధనేతర విషయాలపై దృష్టి సారిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది, మౌలిక వసతులు ఉన్నా తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. బడిబాట లాంటి కార్యక్రమాలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. అర్హత లేని వారు విద్యాబోధన చేస్తున్నా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరుతుంటే ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వ విద్యను గాడిన పెట్టేందుకు విద్యాశాఖాధికారులు నిబంధనలు పాటించని ఉపాధ్యాయులపై చర్యలకు ఉపక్రమించారు. ఈ చర్యలతోనైనా ప్రభుత్వ విద్య గాడిన పడుతుందా వేచి చూడాలి.**

ఉపాధ్యాయుల్లో కొరవడిన అంకిత భావం
బోధనేతర విషయాలపై దృష్టి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** గతేడాది గ్రామ పంచా యతీ ఎన్నికలు జరుగుతున్న సమయం అది. పోలింగ్ కేంద్రాలను పరిశీలించే క్రమంలో మం డల అధికారులు పాఠశాలకు విచ్చేశారు. మం డల అధికారులు వెళ్లే సమయానికి అక్కడ ఉపా ధ్యాయులు తరగతి గదిలో ఉండి విద్యార్థులను పట్టించుకోకుండా ఫోన్ మాట్లాడుతున్నారు. బ రాబర్ రిజిస్ట్రేషన్ అవుతుంది, సూ పర్ బిట్, రూపాయి వచ్చేది మీకు చూపిస్తా నాలుగు గం టలకు కలుద్దామని ఫోన్ మాట్లాడుతున్నారు. సౌమ్యుడైన ఆ మండల అధికారి ఇదేం పని అంటూ మందలించి వదిలేశాడు. ఇది ఒక ఉదా హరణ మాత్రమే. చాలా మంది ఉపాధ్యాయు లపై పాఠశాల సమయాల్లో బోధన మరిచి ఆ దాయ విషయాలపై ఫోన్ల ద్వారా మాట్లాడుతు న్నారు. రియల్ ఎస్టేట్ మొదలు అనేక ఆదాయ వనరుల పైన దృష్టిసారిస్తున్నారు. మరి కొందరు బిల్లు, బెల్లుకు పరిమితమవుతున్నారు. సమయా నికి పాఠశాలకు వచ్చామా నెల వేతనం తీసుకు న్నామా అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇ ప్పటికీ కొందరు ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠ శాలలను ప్రైవేటుకు దీటుగా నడుపుతున్నారు. సొంత డబ్బులతో మౌలిక వసతులు కల్పించ డం, పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని రంగాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తయారు చేస్తున్నారు. వీరు అభినందనీయులు కానీ వీరి సంఖ్య ఏడా దికి ఏడాది తగ్గిపోతుంది. ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో చాలా మంది సమయ పాలన పాటించకపోవడం, పాఠశాలకు వచ్చినా సరిగ్గా పనిచేయకపోవడం ఇతరత్రా వ్యవహారాలపై దృ ష్టిసారించడం చేస్తున్నారు. ఇటువంటి వారిపై విద్యాశాఖ దృష్టిసారించింది. సుమారు 50 మం ది ఉపాధ్యాయులకు నోటి తాఖీదులు ఇచ్చింది. క్షీణ దశకు చేరుకుంటున్న ప్రభుత్వ విద్య బలో పేతానికి ఉపాధ్యాయుల్లో మార్పు తీసుకు రావ డంతో పాటు తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిం చాలి. విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు విద్యా సంస్థలపై ప్రభుత్వం కఠిన వైఖరిని అవ లంభించాలి. ఫీజుల దోపిడీని అరికట్టాలి. మొ త్తంగా సామాన్యులకు అత్యుత్తమ విద్యను బోధించాలి.

## అంకుబాబు సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ఎంపిడిఒగా అంకుబాబు ప్రజలకు చేసిన సేవలు అభినందనీయమని, తన పదవీ కాలంలో ప్రజలకు అందించిన సేవలు కల కాలం గుర్తుండిపోతాయని ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివరావు అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన అంకుబాబు పదవీ విరమణ కార్యక్రమంలో చాతకొండ రోడ్‌లోని ఓ సాయి ఫంక్షన్ హాల్లో సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా కూనంనేనితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా హాజరై అంకుబాబు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ ప్రభుత్వాధికారిగా సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మండలాభివృద్ధిలో కీల కపాత్ర పోషించారని చెప్పారు. ప్రజల మనస్సు గెలుచుకున్న అధికారిగా ఆయన సేవా నిరతిని అంతా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నిబద్ధ తతో పనిచేసే అధికారుల వల్ల ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతాయని, అంకుబాబు తన పదవీ కాలంలో ఎక్కడా రాజీ లేకుండా పనిచేశారని ప్రశంసిం చారు. సుదీర్ఘ సర్వీసు పూర్తి చేసుకున్న ఆయన శేషజీవితం సుఖ సంతోషాలతో హాయిగా సాగాలని ఆకాంక్షించారు.

## సహజ సిద్ధ రంగులతోనే హోలీ జరుపుకోవాలి

ఎస్‌పి రోహిత్ రాజ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** హోలీ పండుగ ప్రశాంతమైన వాతా వరణంలో, సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలని ఎస్‌పి రోహిత్ రాజ్ సూచించారు. హోలీ అదే క్రమంలో పరస్పరం గౌర ప్రదమైన వాతావరణంలో నిర్వహించుకోవా లన్నారు. హానికరమైన రసాయ నాలు వాడటం ద్వారా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందని, బలవం తంగా రంగులు పూయడం, బెలూన్లు విసరడం వంటివి చర్యలు చేయరా దన్నారు. ప్రజలు, వాహన దారులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవ ర్తించడం మంచిది కాదన్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్ప డితే కఠిన చర్యలు తీసుకుంటామని, పండుగ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వాహనాలు అతివేగంగా నడు పుతూ ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, అప్రమత్తంగా వ్యవహరించడం మంచిదన్నారు. హోలీ సందర్భంగా చెరువులు, కుంటలు, వాగులు, నదుల వద్దకు వెళ్లరాదని, అంటువంటి ప్రదేశాలకు పిల్లలను కూడా తీసు కెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ప్రశాంతంగా, గౌరవప్రదంగా హోలీ పండుగను నిర్వహించుకోవాలని ఎస్‌పి సూచించారు.

## విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరుకావాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
పదవ తరగతి విద్యార్థులకు
మోటివేషన్ కార్యక్రమం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరు కావా లని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. పదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాల విద్యా ర్థుల కోసం శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో సోమవారం ఏర్పాటు చేసిన మోటివేషన్ కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవి తంలో పదవ తరగతికి చాలా ప్రాముఖ్యత ఉందని విద్యార్థులు ఎటువంటి ఒత్తిడిలు లేకుండా పరీక్ష లకు హాజరు కావాలన్నారు. భయపడితే చదివింది కూడా మరిచిపోతామని పరీక్షలకు మరో రెండు వారాల గడువు ఉందని, ఉన్న సమయాన్ని విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలి పారు. భయం లేకుండా పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థులు వీలై నంత వరకు గతేడాదిలో వచ్చిన ప్రశ్నాపత్రాలకు సొంతంగా పరీక్షలు రాసి పరీక్షించుకోవాల న్నారు. ఎన్ని ప్రాక్టీస్ టెస్టులు రాస్తే అంత మెరుగ్గా ఫైనల్ ఎగ్జామ్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారని తెలిపారు. ఒలంపిక్ క్రీడాకారులు ఎలాగైతే ప్రతి రోజు ప్రాక్టీస్ చేస్తారో అదేవిధంగా విద్యార్థులు కూడా ప్రాక్టీస్ చేయాలన్నారు. ఏ సబ్జె క్టులో వీక్‌గా ఉన్నామో తెలుసుకుని అధిగమించేం దుకు ఆ సబ్జెక్టుకు కొంత అధిక సమయం కేటా యించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యా ర్థులు నిద్ర లేకుండా ఉండవద్దని ప్రతిరోజు కనీసం ఆరు నుంచి ఏడు గంటల నిద్ర ఉండాలన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో బయట ఆహారం తీసుకోవద్దని, ఎక్కువగా తిరగవద్దని, మంచినీరు తగినంత త్రాగాలని కలెక్టర్ సూచిం చారు. అనంతరం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు కలెక్టర్ పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ కార్యక్ర మంలో జిల్లా విద్యాశాఖాధి కారిణి చైతన్యజైని, మోటివే షన్ స్పీకర్ గంపా నాగేశ్వర రావు, అధికారులు తదిత రులు పాల్గొన్నారు.

**దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖా స్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలె క్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివా సరెడ్డి తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిం చారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధి కారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ డిసి ఎం. రాజేశ్వరి, జెడ్పిసిఇఒ దీక్షారైనా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలి

'మాస్‌లైన్' నేత గుమ్మడి నర్సయ్య



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వెలుగుమట్ల బాధితులకు సత్వరం న్యాయం చేయాలని మాజీ శాసన సభ్యులు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం బాధితులను గుమ్మడి నర్సయ్య, మాస్ లైన్ రాష్ట్ర నాయకులు జి. సత్యనారాయణరెడ్డి స్థానిక నాయకు లతో కలిసి పరామర్శించారు. అనంతరం సమస్యను కలెక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లా డుతూ భూదాన్ భూమిలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవి స్తున్న వారిని రోడ్డుపైకి నెట్టి నివాసాలను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇండ్లు కోల్పోయి రోడ్డున పడ్డ పేద లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేదలు కష్టపడి నిర్మించుకున్న ఇండ్లను కూల్చివే యడం అమానుష చర్య అని గుమ్మడి తెలిపారు. భూదాన్ భూములు పేదలకు చెందుతాయి తప్ప రియల్ ఎస్టేట్ వ్యాపా రులకు కాదని ఆయన తెలిపారు. మంత్రి పొంగులేటి మాట నిలపుకోవాలని ఈనెల 15 నాటికి నివాస స్థలాలు పంపిణీ చేయడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, సివై పుల్లయ్య, జి. రామయ్య, ఆవుల అశోక్, శిరోమణి, ఝాన్సీ, శోభ, మంగ తాయి, శ్రీనివాస్, మలీదు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## గుప్త నిధుల తవ్వకాలు.. తొమ్మిది మంది అరెస్టు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఫిబ్రవరి 25వ తేదీన సాయంత్రం బ్లూ కోర్టు సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుం డగా మండల పరిధిలోని ఏరుగట్ల గ్రామంలో ఓ పత్తి చేనులో భూగ ర్భంలో దాగి ఉన్నట్లు భా వించి బంగారు నిధులు (గుప్త నిధులు) ఉన్నాయని తవ్వకాలు ప్రారంభిం చారు. సమాచారం అందుకున్న వీఎం. బంజర్ ఎస్ఐ కె. వెంకటేష్ పోలీస్ సిబ్బం దితో దాడి చేయగా నిందితులు పరారయ్యారు. సంఘటనా స్థలంలో లభించిన ఒక జెసిబి, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీన పరచుకు న్నారు. సోమవారం వీయం. బంజర్ పోలీస్‌స్టేష న్‌లో సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం, వి ఎం. బంజర్ ఎస్ఐ వెంకటేష్ విలేకర్లతో మాట్లాడుతూ గుప్త నిధుల సంఘటనలో కారకులైన తొమ్మిది మంది నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. వీరిలో చిక్కుమళ్ల తిరుపతిరావు, కండే గోపాలరావు, భాషబోయిన రాజయ్య, వీరమళ్ళ రాధాకృష్ణ, కట్టేబోయిన మోహన్‌రావు, మర్రి గంగయ్య, గొర్రెపాటి నాగే శ్వరరావు, గంధసిరి మల్లయ్య, జక్కంపూడి రవి అను వారలను పోలీస్‌లు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించనున్నట్లు సిఐ తెలిపారు.

## 'ఎస్‌బిఐటి'లో వ్యక్తిత్వ వికాసంపై సదస్సు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస సదస్సులో గుండాల కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ గతిని మార్చగల సత్తా విద్యార్థుల తరగతి గది నుంచే మొదలవుతుందన్నారు. నేటి తరం యువత అతి చిన్న విషయా లకే ఆత్మహత్యలకు ప్రేరేపితులవుతున్నారన్నారు. వ్యక్తిగత అలవాట్లలో మార్పులు క్రమశిక్షణ ద్వారా వీటిని అధిగమించవచ్చునన్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ బోర్డ్ రూమ్ నిర్ణయాలను తీసుకునే, ప్రణాళికలను సిద్ధం చేసే ఖర్మాగారమని తెలిపారు. తరగతి గదిలోనైనా తప్పులు దొర్లే అవకాశం ఉంటుందని బోర్డ్ రూములో తప్పుడు నిర్ణయాలు, వ్యవస్థను, ఉద్యోగస్తులను, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయ న్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివా సరావు, ఎవివి శివప్రసాద్, హెచ్‌వోడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవుల కోసం పార్లమెంట్‌లో గళమెత్తుతా

'కరుణగిరి' ముగింపు వేడుకల్లో
ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** దళిత క్రైస్తవులకు ఎస్‌సి రిజర్వేషన్ వర్తింపు చేయడానికి పార్లమెంటులో గళమెత్తుతానని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. గత నాలుగురోజులుగా నిర్వహి స్తున్న కరుణగిరి పుణ్యక్షేత్ర వేడుకలు సోమవారం ఐదురోజుతో ముగి శాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపి హాజరై మాట్లాడారు. ఎస్‌సి రిజర్వేషన్ల అమలులో ఉన్న తారతమ్యాలను తొలగించడానికి పార్ల మెంటులో తన గళాన్ని వినిపించి దళిత క్రైస్తవులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. క్రైస్తవం ప్రజలందరి సుఖ సంతోషాలను కోరు కుంటుందని, అందుకే తాను క్రైస్తవ మతాన్ని అభిమానిస్తానన్నారు. కరు ణగిరి పుణ్యక్షేత్రం క్రైస్తవులకు గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రఖ్యాతి చెందిందని, కొనియాడారు. వాటికన్ సిటీ పోప్‌చే నియమించిన కార్డినల్ బిషప్ డాక్టర్ పూల అంతోని మన తెలుగువారు కావడం గొప్ప గౌరవం అన్నారు. ఏసు మార్గం అనుసరణీయమైందని, ప్రతి ఒక్కరూ ఆచరిస్తే మహోన్నత సమాజం ఏర్పడుతుందన్నారు. మతపెద్దలు, భక్తులకు, క్రైస్తవు లకు ఎలాంటి కష్టం వచ్చినా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలి పారు. అనంతరం కార్డినల్ బిషప్ డాక్టర్ పూల అంతోనిని ఉమ్మడి జిల్లా బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్‌లను ఎంపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఏదులాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, మేత్రాసనం ప్రోక్రేటర్ పాథర్ సూరేపల్లి ఐజక్, విజి ఫాదర్‌శౌరి, కరుణగిరి డైరెక్టర్ జ్వానేష్, పాలేరు విచారణగురువు కొమ్ము అంతోని, తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు ప్రాంతాల మత గురువులు, పాథర్స్, బ్రదర్స్, సిస్టర్స్, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కమిషనర్ ఆదేశాలు.. బేఖాతర్!

సిండికేట్ వెనక ఉన్న మున్సిపల్ ఉద్యోగి ఎవరు?
కార్పొరేషన్‌లో పన్ను చెల్లించని వ్యాపార సంస్థలు
ప్రభుత్వ సొమ్ము 'ప్రైవేటు' ఖాతాలకు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కార్పొరేషన్‌లో ఉద్యోగుల తీరు తలను తోక ఆడించినట్లు ఉంది. కమిషనర్ ఆదేశాలను సైతం లెక్కచేసే పరిస్థితిలో ఉద్యో గులు లేరు. లిఖిత పూర్వక ఆదేశాలను సైతం పట్టించుకోడం లేదు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో చాలా వ్యాపార సంస్థల నుంచి వాణిజ్య పన్ను వసూళ్లు అధికారికంగా చేయకుండా మొత్తం వ్యవస్థను తప్పుదారి పట్టిస్తున్నట్లు ఆరో పణలు వస్తున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా వ్యాపారం నిర్వహిం చడంతో పాటు కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన పన్నులు చెల్లించని కొన్ని వ్యా పార సంస్థలపై కార్పొరేటర్లు నేరుగా కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పా టు అధికారుల వ్యవహార శైలిపైనా పలు ఆరోపణలు చేశారు. ఆరేండ్లుగా కోట్ల రూపాయల లావాదేవీలు కలిగిన వ్యాపారుల నుంచి పన్ను వసూలు చేయకపోవడాన్ని ఆధారాలతో సహా కమిషనర్ దృష్టికి తీసుకు రావడంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య వెంటనే స్పందించారు. ఇల్లందు రోడ్డులోని శ్రీ విజయ దుర్గా స్టీల్ సిండికేట్ దుకాణాన్ని మూసివేయాలని లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం ఆదేశాలను బుట్ట దాఖలు చేశారు. కమిషనర్ ఆదేశాలు ఏమయ్యాయో కానీ శ్రీ విజయ దుర్గా స్టీల్ సిండికేట్ మాత్రం యథేచ్ఛగా నడుస్తుంది. శ్రీ విజయ దుర్గా స్టీల్ సిండి కేట్‌కు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవు. ఈ విషయాన్ని స్వయం గా కమిషనర్ కార్యాలయమే తెలిపింది. దుకాణం నిర్వహిస్తున్న ఇంటిని కార్పొరేషన్ గుర్తించ లేదని, ఆ ఇంటికి నెంబర్ కూడా లేదని ధృవీకరించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఆరేండ్లుగా వ్యాపారం నిర్వహిస్తున్న కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడం వెనక మతలబు ఏమిటన్నది అర్థం కావడం లేదు. ఈ వ్యవహారం ఒక్క శ్రీ విజయ దుర్గా స్టీల్ సిండికేట్‌కు మాత్రమే పరిమితమైందా, కార్పొరేషన్ పరిధిలో ఇటువంటి పన్ను వసూలు చేయని, అనుమతులు లేని వ్యాపార సంస్థలు ఎన్ని ఉన్నాయో అన్న ఆరోప ణలు వినవస్తున్నాయి. పన్ను వసూలు చేయకపోవడంతో కార్పొరేషన్‌కు కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుంది. పన్ను వసూళ్లు చేసే బాధ్యులు ఎవరు , ఎందుకు వసూళ్లు చేయడం లేదు. ఇల్లందు రోడ్డులోని శ్రీ విజయ దుర్గా స్టీల్ సిండికేట్ లాంటి సంస్థలు ఎన్ని ఉన్నాయి అనే దానిపై పాలక వర్గం పూర్తి విచారణ చేపడితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
03-03-2026
www.prajapaksham.in

‘మాస్ మహారాజా రవితేజ నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’ సంక్రాంతి సందర్భంగా థియేటర్లలో విడుదలై మిక్స్‌డ్ టాక్ అందుకుంది. కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు.’

# రీల్

## యూత్‌ను ఆకట్టుకునే సవర్ణ టెక్స్ టైల్స్



శివకుమార్ రామచంద్రవరపు, డిబోరా డోరిస్ ఫెల్, రాజశేఖర్ అనింగి, విక్రమాదిత్య డాంబర్ ప్రధాన పాత్ర దారులుగా ప్రశాంత్ నామిని రచన దర్శకత్వంలో తెరకెక్కుతున్న సువర్ణ టెక్స్ టైల్స్ చిత్రం టీజర్ విడుదల చేశారు. యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎ.వై.వి.ప్రొడక్షన్స్, స నాతన క్రియేషన్స్ బ్యానర్స్‌పై నిర్మాత అనిల్ ఈరుగు దిండ్ల నిర్మిస్తున్నారు. ప్ర సాద్ ల్యాబ్ లో దర్శకుడు వేణు ఉడుగుల ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేశారు.ఈ సందర్భంగా హీరో శివకుమార్ మాట్లాడుతూ హైటెక్ సిటీ వీధుల్లో నైటీ వేసుకుని పరిగెత్తించాడు. మంచి జీల్ ఉన్న దర్శకుడు ప్రశాంత్ నామిని. ఎంతో ప్యా షన్ తో సినిమా తీశాడు. యూత్ కు బాగా నచ్చుతుంది అన్నారు. దర్శకుడు వే ణు ఉడుగుల మాట్లాడుతూ టీజర్ చాలా బాగుంది. ఈ సినిమాతో ప్రశాంత్ నామిని ఓ మంచి దర్శకుడు అవుతాడు అన్నారు.హీరో సోహైల్ మాట్లాడుతూ. ప్రశాంత్ నాకు ఎప్పటి నుంచో పరిచయం. ఫస్ట్ ఈ కథని నాకే చెప్పాడు. అయితే నాకే ఈ జోనర్ చేయాలంటే ధైర్యం చాలలేదు. ఈ టీజర్ చూస్తుంటే యూత్ కి బాగా కనెక్ట్ అయ్యేలా వుంది. ఆల్ ది బెస్ట్ ప్రశాంత్ నామిని అన్నారు. దర్శకుడు ప్రశాంత్ నామిని పాల్గొన్నారు .

## దోస డైరీస్ బ్యానర్‌పై ‘సరస్వతి’



వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్ తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం’సరస్వతి’. ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మార్చి 6న ఈ సినిమా థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరోయిన్ డైరెక్టర్, వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ కాష్ రాజ్ ప్రియమణి నా విజన్ ని మరో స్థాయికి తీసుకువెళ్లారు. తమ పాత్రలకు ప్రాణం పోశారు. ఇందులో ప్రతి పాత్ర కూడా చాలా అర్థవంతంగా ఉంటుంది.మా సినిమాకి వెన్నుముకగా నిలిచిన ఈటీవీ యాజమాన్యానికి కృతజ్ఞతలు. పూజ ఈ సినిమాని చాలా కంట్రోల్ గా చేసింది. హీరో శరత్ కుమార్ మాట్లాడుతూ ఇక్కడ విమెన్ పవర్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఒక నటిగా వరలక్ష్మి విజయంలో నా పాత్ర ఏమీ లేదు. పూజకి చాలా మంచి ప్రొడక్షన్స్ స్కిల్స్ ఉన్నాయి. సరస్వతిలో కొన్ని క్లిప్స్ చూశాను చాలా ఇంట్రెస్టింగ్ సబ్జెక్టు. వరలక్ష్మి పూజ టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. ఇందులో మంచి టెక్నీషియన్స్ పనిచేశారు. తమన్ గొప్ప మ్యూజిక్ ఇచ్చారు. అలాగే కెమెరా వర్క్ కూడా చాలా బాగుంది. రాధిక శరత్ కుమార్ మాట్లాడుతూ సరస్వతి ధైర్యాన్ని ఇచ్చే సినిమా. వరలక్ష్మి విషయంలో చాలా గర్వంగా ఉన్నాను. తను ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. వరలక్ష్మి చేస్తున్న ఫస్ట్ సినిమా చూసినప్పుడే తప్పకుండా ఒక మంచి నటి అవుతుందని భావించాం. ఇది ఒక మౌనంగా ఉన్న చా లా మంది అమ్మాయిలకి ఒక ధైర్యాన్నిస్తుంది. హీరోయి న్ ప్రియమణి మాట్లాడుతూ ఇది మనసులో నిలిచిపోయిన కథ. కథ చెప్పినప్పుడు చాలా నచ్చింది. ఈ జర్నీ నాకొక కేక్ వాక్ లా అనిపించింది. వరలక్ష్మి చాలా అద్భుతంగా ప్లాన్ చేసింది. తను అద్భుతమైన డైరెక్టర్. సినిమాకి ఏం కావాలో తనకి పర్‌ఫెక్ట్‌గా తెలుసు. ఈ సినిమాని సపోర్ట్ చేసిన అందరికీ థాంక్యూ. ఇలాంటి సినిమాలు ఆడియన్స్ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో పూజా శరత్ కుమార్ , నికోలాయ్ సచ్‌దేవ్ డైరెక్టర్ బి నందిని రెడ్డి, హీరోయిన్ సిమ్రాన్, సప్తగిరి పాల్గొన్నారు.

## ‘పెద్ది’ డబ్బింగ్ షురూ

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది సినిమా డబ్బింగ్ పనులు ప్రారంభం అయ్యాయి. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీ త సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఫస్ట్ షాట్ గ్లింప్స్, బ్లాక్ బస్టర్ ఫస్ట్ సింగిల్ చికిరి చికిరికి ట్రెమండస్ రెస్పాన్స్‌తో రికార్డులను బ ద్దలు కొట్టాయి. తాజాగా రామ్ చరణ్ ‘పెద్ది’ డబ్బింగ్ ప్రారంభించారు. పెద్ది పాత్రలో చరణ్ చెప్పిన ‘ఏమది’ డైలాగ్ అందరినీ ఆకట్టుకుంటుంది.ఈ వీడియో ప్రస్తుతం షోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. పెద్ది సెకండ్ సింగిల్ ‘రై రై రారా’ మార్చి 2న రిలీజ్ అయింది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రత్న వేలుడిఒపి, జాతీయ అవార్డు గెలుచుకున్న ఎడిటర్ నవీన్ నూలి ఎడిటర్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. పెద్ది ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.



## విశ్వనాథ్ అండ్ సన్స్‌గా సూర్య



తమిళ నటుడు ’సూర్య46’ చిత్రానికి ’విశ్వనాథ్ అండ సన్స్’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు.సూర్య ఒక చిన్నారితో కలిసి కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. భారీ స్థాయి కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మమిత బైజు, రాధిక శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ’సార్/వాతి’, ’లక్కీ భాస్కర్’ వంటి వరుస విజయాలతో దూసుకుపోతున్న బ్లాక్‌బస్టర్ దర్శకుడు వెంకీ అట్లూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విజయవంతంగా చిత్రీకరణ పూర్తి చేసుకున్న ’విశ్వనాథ్ అండ సన్స్ సినిమాను జూలై లో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, ఛాయాగ్రాహకుడిగా నిమిష్ రవి వ్యవహరిస్తున్నారు. ఎడిటింగ్ బాధ్యతలను నవీన్ నూలి నిర్వహిస్తున్నారు. కళా దర్శకుడిగా బంగ్లాన్ వ్యవహరిస్తున్నారు. సార్/వాతి’, ’లక్కీ భాస్కర్’ వంటి వరుస విజయాల తర్వాత ప్రముఖ నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య కలిసి మరో ప్రతిష్టాత్మక తమిళతెలుగు ద్విభాషా చిత్రాన్ని అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నిర్మితమవుతున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ చిత్రానికి ఫైట్ మాస్టర్: వి. వెంకట్, కొరియోగ్రాఫర్: విజయ్ బిన్నీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: యలమంచిలి గోపాలకృష్ణ, లైన్ ప్రొడ్యూసర్: ఉమామహేశ్వరరావు.

## ఫెస్టివల్ కోసం సినిమా తీయను



జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై. నిహారిక కొణిదెల నిర్మాతగా ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి ‘రాకాస’ మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమాను ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నిహారిక కొణిదెల మాట్లాడుతూ ‘రాకాస’ చెప్పిన కథ నాకు నచ్చేసింది. సినిమా ఏదైనా సరే ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వాలన్నదే పింక్ ఎలిఫెంట్ ప్రొడక్షన్ లక్ష్యం. ‘రాకాస’తో నెక్స్ట్ లెవెల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తాం. థియేటర్‌కు వచ్చిన వాళ్లని మాత్రం నిరాశపరచం. ఈ చిత్రంతో సంగీత్ మరింత షైన్ అవుతాడు. నేను ఫిల్మ్ ఫెస్టివల్స్‌కి వెళ్లాలని సినిమాలు తీయలేదు. ‘రాకాస’ కూడా అంతే ప్రేమతో, ప్యాషన్‌తో నిర్మించాను. ఎక్కడికి వరకు వెళ్తుందో చూడాలి. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌ని నేను మరింత గొప్ప స్థాయికి తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను. సంగీత్ శోభన్ మాట్లాడుతూ “నిహారిక, మానస వల్లే ‘రాకాస’ ఈ స్థాయికి వచ్చింది. ఆ ఇద్దరి వల్లే నేను ఈ స్థాయిలో నిలబడ్డాను. ఈ మూవీ కోసం ఆ ఇద్దరూ ఎంతో కష్టపడ్డారు. టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని ఆశిస్తున్నాను. మానస కథ చెప్పిన వెంటనే నాకు చాలా నచ్చింది. రాకాసా నాది వన్ మెన్ షో ఉంటుందో లేదో కానీ.. మానస శర్మ గారిది మాత్రం వన్ ఉమెన్ షో లా ఉంటుంది అన్నారు. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ “‘రాకాస’ కోసం మేమంతా చాలా కష్టపడి పని చేశాం. నిహారిక వల్లే నేను దర్శకురాలిగా మారాను. నేను ఆమెకి ఎప్పుడూ రుణపడి ఉంటాను. సంగీత్ శోభన్ వ్యక్తిగతంగా ఎంతో మంచి వ్యక్తి. ఏప్రిల్ 3న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు.జీ తెలుగు హెడ్ దివ్య, సంగీత దర్శకుడు అనుదీప్, నటుడు గెటప్ శ్రీను , నటి రోహిణి పాల్గొన్నారు.

## శివాజీ లేకపోతే సినిమా లేదు: దర్శకుడు



శివాజీ, లయ జంటగా నటించిన సినిమా ‘సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని’. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హీరో శివాజీ స్వయంగా నిర్మిస్తుండగా సుధీర్ శ్రీరామ్ తెరకెక్కించారు. ఈ నెల 6న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సుధీర్ శ్రీరామ్ సోమవారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మా నేపథ్యం కడప. నాన్న పోస్ట్ మాస్టర్. నాకు చిన్నప్పటి నుండి సినిమాలంటే ఇష్టం. సినిమా సెలబ్రిటీలా నాకు ఓగుర్తింపు రావాలని కోరిక ఉండేది. హ్యాపీడేస్ సినిమా చూసి ఇంజనీరింగ్ పూర్తి చేశాను. 2015 నుంచి సినీ పరిశ్రమలోకి ఉన్నాను. నైన్టీస్ సినిమాలో శివాజీని చూడగానే మా నాన్న గుర్తొచ్చారు. సినిమా కథలు చెప్పే సమయంలో ఆయనకు ఎందుకు కథ చెప్పకూడదు? అనిపించి ’సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని’ కథతో శివాజీని అప్రోచ్ అయ్యాను. కథ వినగానే ఆయన ఈ కథను నేనే ప్రొడ్యూస్ చేస్తాను అన్నారు. ఆ మాట వినగానే ఎంతో హ్యాపీగా అనిపించింది. ఈ కథను శివాజీ ఈటీవీ వాళ్లకు కూడా చెప్పమన్నారు. నితిన్ , సాయికృష్ణ కథ వినగానే వాళ్లు కూడా ఓకే చేశారు. ఫైనల్‌గా బాపినీడు కూడా ఓకే చేశారు. అప్పటి నుంచి ఈ సినిమా జర్నీ ప్రారంభమైంది. శివాజీ వల్ల ఈ సినిమా స్పీడ్‌గా పూర్తిచేశాను. ఈ కథ క్రైమ్ కామెడీ. దర్శకుడు నెల్సన్ తెరకెక్కించే సినిమా తరహాలో ఉంటుంది. కో..కో.కోకిల, డాక్టర్ సినిమాలా డార్క్ కామెడీ ఉంటూ థ్రిల్లింగ్ నేపథ్యం ఉంటుంది. ఈ రోజు విడుదల చేసిన ట్రయిలర్ చూస్తే అందరికి అర్థమవుతుంది. ఈ సినిమా ప్రారంభం కాగానే మొదటి 20 నిమిషాల తరువాత మరో కోణంలోకి వెళుతుంది. శివాజీ ఇన్‌వాల్వ్‌మెంట్ కథలో ఎలాంటి మార్పులు చేయలేదు. స్క్రిప్ట్ ఏ రోజు మారలేదు. నా నుంచి తదుపరి నాలుగు కథలు నాలుగు డిఫరంట్‌గా ఉంటాయి. ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్, కమర్షియల్ ఎంటర్‌టైనర్ కథలు ఉన్నాయి. మైథలాజికల్ కథ కూడా ఉంది. ఒకే జోనర్‌కు పరిమితం కావడం నాకు ఇష్టం లేదు. ఆడియన్స్ డెఫినెంట్ గా హిలేరియస్‌గా ఫస్ట్‌ఆఫ్ ఎంజాయ్ చేస్తారు.

---

### ప్రముఖ చరిత్రకారిణి, మహిళా ఉద్యమకారిణి

## డాక్టర్ గార్గీ చక్రవర్తి మృతి

సిపిఐ సంతాపం



**న్యూఢిల్లీ:** ప్రముఖ చరిత్రకారులు, ప్రొఫెసర్, నిబద్ధత గల ఉద్యమకారిణి డాక్టర్ గార్గీ చక్రవర్తి కన్నుమూశారు. ఆమె దాదాపు మూడు దశాబ్దాల పాటు ఢిల్లీ యూనివర్సిటీ, మైత్రేయి కళాశాలలో బోధించారు. విద్యావేత్తగా గౌరవం పొందారు. టీచర్ల ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. ప్రజాస్వామిక పోరాటాల్లో భాగస్వాములయ్యారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా, సిపిఐ జాతీయ నాయకురాలిగా పనిచేశారు. న్యాయం, సమాన్వం కోసం పాటుపడ్డారు. డాక్టర్ గార్గీ చక్రవర్తి మృతికి సిపిఐ సంతాపం ప్రకటించింది. ఆమె మరణం సిపిఐకి, కమ్యూనిస్టు ఉద్యమానికి, మహిళా ఉద్యమానికి తీరని లోటు అని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సోమవారం సామాజిక మాధ్యమం వేదికగా దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. గొప్ప ఉద్యమకారిణిని, మేధావిని, రచయిత్రిని దేశం కోల్పోయిందన్నారు. ‘కమింగ్ అవుట్ ఆఫ్ పార్టిషన్, చార్టింగ్ ఏ న్యూ పాత్: ఎర్లీ ఇయర్స్ ఆఫ్ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్, పిసి జోషి: ఏ బయోగ్రఫీ’ వంటి రచనలు చేశారని గుర్తుచేశారు. కమ్యూనిస్టు ఉద్యమానికి, మహిళా ఉద్యమానికి ఆమె తోడ్పాటు మరువలేనిదన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా, సీపీఐ జాతీయ నాయకురాలిగా గొప్ప సేవలు అందించారని డి.రాజా కొనియాడారు. ప్రజా సేవకు ఆమె తుది వరకు అంకితమయ్యారన్నారు. డాక్టర్ గార్గీ చక్రవర్తి లేని లోటు భర్తీ చేయలేనిదని డి.రాజా వెల్లడించారు. డాక్టర్ గార్గీ చక్రవర్తి కుటుంబం, మిత్రులు, సహచరులకు సీపీఐ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె ఆదర్శాలు భవిష్యత్ పోరాటాలకు స్ఫూర్తి అన్నారు.

**స్ఫూర్తిప్రదాత డాక్టర్ గార్గి: ఎన్ఎఫ్ఐడబ్ల్యు**

డాక్టర్ గార్గీ చక్రవర్తి జీవితం ఆదర్శనీయమని, ఆమె లేని లోటు తీరనిదని ఎన్ఎఫ్ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ సంతాపం ప్రకటించారు. విద్యావేత్తగానే కాకుండా ఎన్ఎఫ్ఐడబ్ల్యు, సిపిఐ నాయకురాలిగా నిబద్ధతతో పనిచేశారని, ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలంగా పాల్గొన్నారని గుర్తుచేశారు. డాక్టర్ గార్గి మరణం ఎన్ఎఫ్ఐడబ్ల్యుకు తీరని లోటన్నారు. ఈ కష్టసమయం లో ఆమె కుటుంబానికి, బంధు మిత్రులకు, సహచరులకు సానుభూతి తెలిపారు.



## ఫీజులు చెల్లించాలని 6న కలెక్టరేట్‌ల ముట్టడి

### జయప్రదం చేయాలని ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** రాష్ట్రంలోని 16 లక్షల మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల ఫీజులు, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న కలెక్టరేట్‌ల ముట్టడి నిర్వహించనున్నట్టు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు తరగతు లు బహిష్కరించి, ప్రభుత్వ ఆఫీసుల వద్ద ముట్టడి, ధర్నా కార్యక్రమాల్లో పాల్గొని, జయప్రదం చేయాలని కో రారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, బిసి, ఎస్‌సి, ఎస్‌టి హాస్టల్ విద్యార్థి సంఘాల అధ్యక్షులు మోదీ రాందేవ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమై ఎనిమిది నెలలవుతున్నా ఒక్క రూపాయి కూడా ఫీజులు బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల 10వేల కోట్లు అప్పులు తెచ్చారని, లక్షల కోట్లు పన్నుల ద్వారా ఆదాయం వచ్చిందన్నారు. అయినా విద్యార్థులకు రూ.6కోట్లు స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడం ప్రభు త్వ పేద విద్యార్థుల చదువుపై ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అగ్రవర్ణ ప్రభుత్వం పేద కులాల విద్యార్థులు చదువుకొంటుంటే ఓర్వలేక ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీమ్‌ను నీర్గర్చే కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ఫీజులు చెల్లించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరంచేస్తామని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి సంఘం నేతలు నీలం వెంకటేశ్, అనంతయ్య, సి.రాజేందర్, నిఖిల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## 9న రైతు, కార్మికుల పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

అభినందనలు తెలియజేస్తున్నామని నాయకులు చెప్పారు. బిహార్‌లోని బరౌనీ శుద్ధి కర్మాగారం, హర్యానాలోని పానిపట్ శుద్ధి కర్మాగారం, గుజరాత్‌లోని లార్సెన్, టూబ్రో కంపెనీలలో ఇటీవల సమరశీల పోరాటాలు సాగించిన కాంట్రాక్ట్ కార్మికులు వారి సంఘీభావాన్ని ప్రకటించారన్నారు. ఈ కాంట్రాక్ట్ కార్మికులందరూ వారికి సరైన వేతనాలు ఇవ్వకుండా అధిక పనిగంటలు అంటే రోజుకు 12గంటల చొప్పున నిర్దయగా పనిచేస్తున్నారని తెలిపారు. వారి కోసం యాజమాన్యాలు పని ప్రదేశాలలో సురక్షిత చర్యలు లేకపోవడం, సాంఘిక భద్రత, రెగ్యులరైజేషన్, సెలవుదినాల సమస్యలపై ముక్తకంఠంతో గొంతెత్తారని, ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్త లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి అమలుచేయడంపై వారు జపిన సమరశీల పోరాటాలు మరువలేనివన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు) స్టూడెంట్స్ ఆఫీసు బేరర్లపై జెఎన్‌యు పాలనా యంత్రాంగం అప్రజాస్వామిక చర్యలకు పాల్పడటాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. వారు ప్రజాస్వామిక పద్ధతిలో నిరసనలు నిర్వహిస్తున్నా వారిపై కేసులు నమోదు చేయించి, అరెస్ట్‌లు చేయించడం, విద్యకు, హాస్టళ్లకు దూరం అయ్యేలా బహిష్కరణ చర్యలు చేపట్టడం ఆక్షేపణీయమన్నారు. పంజాబ్‌లో రైతుల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు సాగిస్తోన్న భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా (ఉగ్రహాణ్) కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించిన అరెస్టులు చేయించి జైళ్లకు పంపించడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. ఈ చర్య హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు సాగిస్తున్న రైతుల హక్కులను హరించే కుటిల ఆలోచనే అన్నారు. భవిష్యత్ సమరశీల పోరాటాలకు రైతులు, కార్మికులు, అన్నివర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

---

## యురేనియం డీల్

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ, కీలక సాంకేతికతలు, చిన్న, మాడ్యులర్ అణు రియాక్టర్లు, విద్య, పునరుత్పాదక ఇంధన రంగాలలో సహకారాన్ని పంచుకుంటామని ఇద్దరు నాయకులూ ప్రతిజ్ఞ చేశారు. 2.6 బిలియన్ డాలర్ల యురేనియం సరఫరా ఒప్పందం ప్రకారం భారతదేశ పౌర అణుశక్తి రంగానికి కెనడా మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ‘ఉగ్రవాదం, తీవ్రవాదం అనేవి భారతదేశం, కెనడా దేశాలకే కాకుండా మొత్తం మానవాళికే సాధారణమైన, తీవ్రమైన సవాళ్లు అని ఇరుపక్షాలూ అంగీకరించాయని ప్రధానమంత్రి చెప్పారు. ప్రపంచ శాంతి, స్థిరత్వానికి మా సన్నిహిత సహకారం కూడా చాలా కీలకం’ అని ఆయన అన్నారు. పశ్చిమాసియాలోని ప్రమాదకర భద్రతపై కూడా మోదీ, కార్నీ ఇరువురూ ఈ సందర్భంగా చర్చించారు. చర్చలు, దౌత్యం ద్వారా అన్నివివాదాల పరిష్కారానికి భారతదేశం మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి మోదీ నొక్కిచెప్పారు. ‘పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి మాకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. చర్చలు, దౌత్యం ద్వారా అన్ని వివాదాల పరిష్కారానికి భారతదేశం మద్దతు ఇస్తుంది. ఈ ప్రాంతంలోని భారతీయ పౌరులు అందరికీ భద్రత కల్పించడానికి మేం అన్ని దేశాలతో కలిసి పనిచేస్తూనే ఉంటాం’ అని ప్రధానమంత్రి మోదీ తన మీడియా ప్రకటనలో తెలియజేశారు.

## కంట్రోల్ రూమ్

(మొదటి పేజీ తరువాయి)

లేదా తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. మధ్యప్రాచ్య ప్రాంత పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ తో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉంటుందని ప్రభుత్వం తెలియజేసింది. కంట్రోల్ రూమ్‌లో రెసిడెంట్ కమిషనర్, వ్యక్తిగత కార్యదర్శి, లైజన్ హెడ్ వందన బరువా +91 9871999044, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సిహెచ్.చక్రవర్తి +91 9958322143, లైజన్ ఆఫీసర్లు జావేద్ హుస్సేన్ 9910014749, రక్షిత్ నాయక్ +91 9643723157 లను సంప్రదించవచ్చని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు

(మొదటి పేజీ తరువాయి)



శ్రేణులకు సూచించారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానమే సక్రమంగా లేదని రాహుల్ గాంధీ విమర్శించారు. ఇరాన్ లాంటి పరిస్థితులు భారతదేశానికి రాకుండా ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వ చర్యల వల్ల భారతదేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇండోఅమెరికా వాణిజ్య ఒప్పందం దేశానికి ముప్పు కలిగించవచ్చని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ‘సంఘటన సృజన్ అభియాన్’ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డిసిసి అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. వికారాబాద్ హరిత రిసార్ట్స్‌లో జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, తెలంగాణ సిఎం ఎ.రేవంత్ రెడ్డి హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ “బిజెపి ద్వేషం ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తుంది. కాంగ్రెస్ శ్రేణులు అప్రమతంగా ఉండి బిజెపి ఆగడాలను అడ్డుకుని దేశాన్ని రక్షించాలి. కాంగ్రెస్ అంటే శాంతి, అహింస, సత్య వాక్కు వీటి తోనే కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్ళాలి. ప్రజల సమ్మతితోనే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి’ అని అన్నారు. ప్రజలు పార్టీకి బలం కావాలని, పార్టీ ప్రజలకు బలం కావాలని, ప్రజలతో కలిసిపోయి వారితో మమేకమై వారి కోసమే కాంగ్రెస్ పార్టీ పనిచేసే విధంగా కార్యాచరణ ఉండాలని, అహంకారాన్ని విడనాడి పార్టీ ప్రజల కోసం పనిచేయాలని ఆయన అన్నారు. ‘కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం అహింస, శాంతి, సత్యాన్వేషణ. ఈ సిద్ధాంతాల ఆచరణ కోసం మనం నిరంతరం పనిచేయాలి. కాంగ్రెస్‌లో సమానత్వ సిద్ధాంతానికి అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. కుల, మత, వర్గ, లింగ బేధాలు లేకుండా, పేద, ధనిక అనే తారతమ్యాలు లేకుండా అందరిని గౌరవిస్తూ పార్టీని నడిపించాలి’ రా హుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గుర్తు చేయి గుర్తు అంటే అభయ ముద్ర, ప్రపంచంలోని అన్ని మతాల చిహ్నం కూడా అభయ ముద్రనే, అదే మన సిద్ధాంతమన్నారు. పార్టీలో మహిళలను గౌరవించాలని, వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ‘డిసిసి అధ్యక్షులు పార్టీ బలోపేతం కోసం ప్రజల కోసం పనిచేయాలి. మీ భవిష్యత్‌ను నేను చూసుకుంటా. మీరు బాగా పని చేస్తే ఏ స్థాయి వరకు అయినా నాయకులుగా ఎదిగే అవకాశం ఉంటుంది. మీ కార్యాచరణ, మీ పని విధానం ప్రజల కోసం ఉండాలి. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వసం ఏర్పడి వారు పార్టీ వైపు ఆకర్షితులు కావాలి. డిసిసి అధ్యక్ష పదవి ఆకర్షణ కోసం కాదు. అది ఒక బాధ్యతగా పని చేయాలి’ అని రాహుల్ గాంధీ డిసిసి అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నాయని ఆయన కితాబిచ్చారు. సామాజిక సమస్యలపై మరింత దృష్టి పెట్టాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు.

**ప్రజలతో మమేకమవుతాం**

రాహుల్ గాంధీ సూచనలకు పలువురు డిసిసి అధ్యక్షులు స్పందిస్తూ ప్రతి నెల 30 గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేకం అవుతామని చెప్పారు. డిసిసి కార్యాలయాలలో ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు. కష్టపడి పని చేసి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి లోతుగా తీసుకెళుతామని 2 నెలలలో బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని కమిటీలను పూర్తి చేస్తామని చెప్పారు. గ్రామాల్లో రైతు సమస్యలు, ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడం, అమెరికా ఒప్పందాలతో జరుగుతున్న నష్టాలపై పోరాటం చేస్తామని, పట్టణాలలో గిగ్ వర్కర్స్ సమస్యలపై పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com